www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం
వాహనం లోయలోపడి 14 మంది మృతి 2

శుక్రవారం | 1-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 333 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి పూర్తి; నక్షత్రం: స్వాతి మ. 12.49 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.6.51-8.35; దుర్ముహూర్తం: ఉ.8.58-9.44, మ.12.51-1.38; అమృతఘడియలు: తె.5.13; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.19 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ధరణి సమస్యల పరిష్కారానికి

స్పెషల్ డ్రైవ్

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

నేటి నుంచి 9 వరకు
పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం

ప్రతి మండలానికి ప్రత్యేక బృందాలు

తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్లకు అధికారాల బదిలీ

మార్గదర్శకాలు జారీచేసిన సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్

ధరణిలో లక్షల ఎకరాలు మాయం..!

ఆ పోర్టల్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం

ధరణిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం: పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందుకోసం శుక్రవారం నుంచి ఈ నెల 9 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. ఈ క్రమంలో తహసీల్దార్, ఆర్డీవోలకు కూడా పలు అధికారాలను దఖలుపరిచింది. వారం క్రితం ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నతాధికారులతో ధరణి కమిటీ సమావేశమైన విషయం తెలిసిందే. పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చూపాలని ఆ సమావేశం తీర్మానించింది. దీంతో సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్ గురువారం ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా ఉత్తర్వులను జారీచేశారు. ఈనెల 9లోగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, మండలాల వారీగా దరఖాస్తులను పరిష్కరించాలని ఆయన ఆ ఉత్తర్వుల్లో నిర్దేశించారు. ప్రతి మండలానికి రెండు-మూడు బృందాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసే బృందానికి తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు నేతృత్వం వహించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశాలు

మిగతా 13వ పేజీలో...



డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి


‘మెగా’ నోటిఫికేషన్

టీచర్ పోస్టులకు 4 నుంచి దరఖాస్తులు.. ఏప్రిల్ 2వరకు గడువు

గతంలోనే దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ చేయనక్కర్లేదు

రాష్ట్రవ్యాప్తంగా 11 కేంద్రాల్లో పరీక్షలు.. త్వరలో తేదీల ఖరారు

11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వయంగా విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 14



కాళేశ్వరం ప్రాజెక్టు లోటుపాట్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న వెదిరె శ్రీరామ్

కాళేశ్వరం డిజైన్లకు కేంద్రం

అనుమతి లేదు

ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కూడా సీడబ్ల్యూసీ ఇవ్వలేదు

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యతపై తప్పుడు ప్రచారం

రూ.40 వేల కోట్లతో ప్రాణహిత-చేవెళ్ల పూర్తయ్యేది

రూ.1.27 లక్షల కోట్ల ఖర్చు చేసి కాళేశ్వరం కట్టారు

జియొలాజికల్ సర్వే చేయకపోవడం అతిపెద్ద తప్పు

ఆ తప్పునకు జైలుకెళ్లేది ఎవరో కాలమే చెబుతుంది

వచ్చేవారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు ఎన్‌డీఎస్‌ఏ

కాళేశ్వరంపై 20రకాల సమాచారం ఇవ్వాలని కోరితే గత ప్రభుత్వమే కాదు.. ప్రస్తుత సర్కారూ ఇవ్వలేదు

నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరె శ్రీరామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదించలేదని.. తెలంగాణ నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషనే (సీడీవో) ఆమోదించిందని నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్, కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ స్పష్టంచేశారు. కేంద్రం ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కూడా ఇవ్వలేదని.. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్

మిగతా 13వ పేజీలో...

నేడు బీఆర్ఎస్
‘చలో మేడిగడ్డ’

ప్రజలకు వాస్తవాలు చెబుతాం: కేటీఆర్

కాంగ్రెస్ బండారం బయటపెడ్తం: కడియం

కాకమ్మ కథలకే మేడిగడ్డకు: మల్లు రవి

12

నీ సిట్టింగ్ సీటులోనే
తేల్చుకుందాం!

దమ్ముంటే సీఎం, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. నేనూ రిజైన్ చేసొస్తా

మల్కాజిగిరిలో ఎవరేంటో చూద్దాం

నాది ‘మేనేజ్‌మెంట్’ అయితే నీది ‘పేమెంట్’

మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏది ‘రాజకీయ’ నివేదిక

హరీశ్ చెప్పినట్లు చేతకాకుంటే దిగిపోండి

మేం పరిష్కారం చూపుతాం: కేటీఆర్



10

జానపద, సినీగాయకుడు
వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత

ఎట్టకేలకు షాజహాన్ అరెస్ట్ 2

10 రోజుల పోలీసు కస్టడీ

కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించిన మమత సర్కారు

షాజహాన్ అరెస్టుతో సందేశ్‌ఖాలీలో సంబరాలు!

అతన్ని ఆరేళ్ల పాటు సస్పెండ్ చేసిన టీఎంసీ

భళా భారత్ 11

జీడీపీ వృద్ధి 8.4 శాతం!

మూడో త్రైమాసికంలో అంచనాలను మించి ప్రగతి

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి 2

లేకుంటే మే 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల హెచ్చరిక

నిమిషం విషమ పరీక్ష

ఇంటర్ విద్యార్థుల గుండెల్లో నిబంధన దడ

ఆలస్యమైతే ఎగ్జామ్‌కు అనుమతి నిరాకరణ

మొదటి రోజునే పలువురికి చేదు అనుభవం

కాంపిటీటివ్ ఎగ్జామ్ కానందున అర్థరహితం

ఏడాది చదివితే చివర్లో అనర్హుల్ని చేస్తారా?

భవిష్యత్ పరీక్షలపైనా మానసికంగా దెబ్బ

ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు

విమర్శల తాకిడితో ఇంటర్ బోర్డు దిద్దుబాటు

5 నిమిషాల దాకా విద్యార్థులకు అవకాశం ఇవ్వాలంటూ మౌఖిక ఆదేశం?

ప్రతి విద్యార్థికి ‘ఇంటర్మీడియట్’ చదువు అత్యంత కీలకం.. జీవితం ఇక్కడే మలుపు తిరుగుతుంది.. కాబట్టే అత్యంత జాగ్రత్తగా ఉండాలి...! భవిష్యత్ పోటీ పరీక్షలకు ఇంటర్ నుంచే పునాది. అందుకే తమ పిల్లలు మంచి మార్కులు సాధించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే, రాష్ట్ర ఇంటర్ బోర్డు వార్షిక పరీక్షల సందర్భంగా అమలు చేస్తున్న.. ‘నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ’ నిబంధన విద్యార్థుల పాలిట శరాఘాతం అవుతోంది.

3

ప్రాణం తీసిన నిమిషం

పరీక్ష కేంద్రానికి 3 నిమిషాలు ఆలస్యంగా ఇంటర్ విద్యార్థి

ఎంత ప్రాధేయపడినా లోపలికి అనుమతించని అధికారులు

సాత్నాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య.. ఆదిలాబాద్‌లో విషాదం

రూ. 1.26 లక్షల కోట్లతో
3 సెమీకండక్టర్ యూనిట్లు

గుజరాత్, అసోంలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

ఖరీఫ్‌లో రూ.24,420 కోట్ల ఎరువుల రాయితీకి పచ్చజెండా

రూ.75 వేల కోట్లతో ‘సూర్యఘర్’ అమలుకు గ్రీన్‌సిగ్నల్

7 రకాల బిగ్ క్యాట్స్ సంరక్షణకు ఐబీసీఏ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ఎలక్ట్రానిక్స్ రంగంలో అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల విషయంలో ఆత్మనిర్భరత సాధించే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1.26 లక్షల కోట్లతో మూడు సెమీకండక్టర్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోద ముద్ర వేసింది. దీంతోపాటు.. ఫాస్ఫాటిక్, పొటాష్ ఎరువులకు రూ.24,420 కోట్ల సబ్సిడీ నిధుల విడుదల, సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా

మిగతా 2వ పేజీలో...

గాజాలో ఇజ్రాయెల్ కాల్పులు..

104 మంది శరణార్థుల దుర్మరణం



మరో 750 మందికి తీవ్రగాయాలు

పిండి పంపిణీలో దారుణం

గాజాలో సహాయ సామగ్రి ట్రక్కుల వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న పాలస్తీనా ప్రజలు. ఇజ్రాయెల్ దళాలు కాల్పులు జరిపింది వీరిపైనే.

2

మే 1 నుంచి నిరవధిక సమ్మె

» ఓపీఎస్ పునరుద్ధరణకు ఉద్యోగ సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: పాత పింఛన్ పథకం(ఓపీఎస్)ను పునరుద్ధరించకుంటే కార్మిక దినోత్సవం(మే 1) నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు కలిసి దీనికోసం జేఎఫ్ఆర్ఓపీఎస్(ది జాయింట్ ఫోరం ఫర్ రీస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం)గా ఏర్పడ్డాయి. మార్చి 19 నుంచే సమ్మె నోటీసులు ఇవ్వడం ప్రారంభిస్తామని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివ్ గోపాల్ మిశ్రా గురువారం ఓ ఆంగ్ల పత్రికకు తెలిపారు. కాగా, ఓపీఎస్ స్థానంలో ప్రభుత్వం ఎన్‌పీఎస్(జాతీయ పింఛన్ పథకం)ను అమల్లోకి తీసుకొచ్చింది. ఎన్‌పీఎస్ కింద ఉద్యోగి మూల వేతనంలో 10 శాతాన్ని, అలాగే ప్రభుత్వం నుంచి మరో 14 శాతాన్ని పింఛన్ నిధికి జమచేస్తారు. ఆ నిధులను వివిధ రూపాల్లో పెట్టుబడులు పెడతారు. ఉద్యోగి రిటైర్మెంట్ ప్రయోజనాలు ఈ పెట్టుబడులపైనే ఆధారపడి ఉంటాయి. ఎన్‌పీఎస్ అనేది రిటైరయ్యే ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివ్ గోపాల్ మిశ్రా విమర్శించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని చర్చల్లో అనేకసార్లు డిమాండ్ చేశామని, కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశామని చెప్పారు. కాగా, ఓపీఎస్‌ను పునరుద్ధరించే ఆలోచన ఏమీ లేదని గతేడాది డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది.

మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

» వాహనం లోయలోపడి 14 మంది మృతి

దిండోరి, ఫిబ్రవరి 29: మధ్యప్రదేశ్‌లో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ కార్యక్రమానికి వెళ్లి వస్తున్న పికప్ వాహనం బోల్తా పడిన ఘటనలో 14 మంది మరణించారు. మరో 20 మంది గాయపడ్డారు. "దిండోరి జిల్లా బంద్‌ఝర్ ఘాట్ మూల మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. వాహనం 50 అడుగుల లోయలో బోల్తా పడింది. తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనలో 14 మంది చనిపోయారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది" అని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు 50వేల రూపాయలను పరిహారంగా ప్రధాని మోదీ ప్రకటించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం చనిపోయిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది.

గాజాలో ఇజ్రాయెల్ కాల్పులు..

104 మంది శరణార్థుల దుర్మరణం

» 750 మందికి తీవ్ర గాయాలు.. పిండి పంపిణీలో దారుణం

సెంట్రల్ గాజా, ఫిబ్రవరి 29: ఆహారం దొరక్క.. కలుపు మొక్కల్ని తింటున్న గాజా వాసులపై మరో పిడుగు పడింది. ఈజిప్టు నుంచి రఫా సరిహద్దు మీదుగా గురువారం ఉదయం ఆహార సరఫరా ట్రక్కులు రాగా.. పిండి కోసం ఆ వాహనాలను చుట్టుముట్టిన పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ ఘటనలో 104 మంది మృత్యువాత పడ్డారు. మరో 750 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉన్నారు. దక్షిణ గాజాలోని 'రషీద్ స్ట్రీట్' వద్ద మానవతాసాయం కోసం ఎదురు చూస్తున్నవారిపై ఇజ్రాయెల్ దారుణంగా కాల్పులు జరిపిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్-ఖుద్రా ఆరోపించారు. ఇజ్రాయెల్ తొలుత ఈ ఆరోపణలను ఖండించింది. పిండి పంపిణీలో జరిగిన తొక్కిసలాటలో మరణాలు సంభవించినట్లు పేర్కొంది. మధ్యాహ్నానికి కాల్పులకు తమ వైమానికదళమే కారణమని అంగీకరించినట్లు 'రాయిటర్స్' ఓ వార్తను ప్రచురించింది. అయితే మరణాల సంఖ్యను 70గా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) పేర్కొన్నట్లు తెలిపింది.

6 నుంచి హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్లు: యూఎస్‌సీఐఎస్

వాషింగ్టన్, ఫిబ్రవరి 29: అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగం చేయడానికి విదేశీయులకు జారీ చేసే హెచ్1బీ వీసా కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లను త్వరలోనే ప్రారంభించనున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను హెచ్1బీ ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 6న ప్రారంభమై అదే నెల 22 వరకూ కొనసాగుతుందని వెల్లడించింది. మరోవైపు, ఒక సంస్థలోని బహుళ వ్యక్తులు, వారి చట్టబద్ధమైన సంబంధీకుల హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్లు, దరఖాస్తుల ప్రక్రియలో సహకరించడానికి ఒక కొత్త వ్యవస్థను సిద్ధం చేసినట్లు యూఎస్ ఇమిగ్రేషన్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. దీనిలో భాగంగా సంస్థాగత ఖాతాలను ప్రారంభించినట్లు తెలిపింది. వీసా దరఖాస్తు ప్రక్రియలో సహకారాన్ని పెంపొందించడంతో పాటు ఇతర ప్రక్రియలను క్రమబద్ధీకరించడమే దీని లక్ష్యమని పేర్కొంది. ప్రీమియం ప్రాసెసింగ్ సర్వీసులు ప్రారంభించడానికి ఐ-907, దాని అనుబంధ దరఖాస్తుల విషయంలో సహకరించడానికి ఈ ఖాతాలు అనుమతిస్తాయని వివరించింది.

FORM IV

(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER ANDHRA JYOTHI

1. Place of Publication	: Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupathi, Karimnagar, Ananthapur, Tadepalligudem, Warangal, Guntur, Kurnool, Nellore, Srikakulam, Rajamahendravaram, Khammam, Kadapa, Ongole, Nalgonda, Nizamabad, Mahaboobnagar.
2. Periodicity of its Publication	: DAILY
3. Printer's name	: KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of india	: YES
(b) If a foreigner, The country of origin:	-
Address	: Door No.: 8-2-293/82/J/68-B, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
4. Publisher's Name	: KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of India	: YES
(b) If a foreigner, The country of origin	: -
Address	: Door No.: 8-2-293/82/J/68-B,, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
5. Editor's Name	: K.SRINIVAS
Nationality	: INDIAN
1 (a) Whether a citizen of India	: YES
(b) If a foreigner, the country of origin:	-
Address	: 301, Sai Surabi Apartments Durgabhai Deshmuki Colony, Hyderabad - 500 007. Telangana.
6. Name's and Addresses of individuals : Who own the Newspaper and partners of Shareholding more than one percent of the total capital	
(a) Aamoda Publications Pvt. Ltd	Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(b) V.Radhakrishna	8-3-293/82/J III/211-1, Road No 76, Phase-III, Jubilee Hills Hyderabad - 500 033
(c) M.Prabhakara Rao	H.No. 8-2-293/82/A, Plot No.543, Road No.26, Jubilee Hills, Hyderabad - 500 033.
(d) D.Jai Ramesh	Plot No.173, Road No.13, Jubilee Hills, Hyderabad - 500 033.
(e) V.Aditya	8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(f) Ch.Shruthi Keerthi	8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(g) M/s Active Power Corporation Pvt Ltd	Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(h) Vemuri Anusha	8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.

I, **KOGANTI VENKATA SESHAGIRI RAO,** here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
KOGANTI VENKATA SESHAGIRI RAO
Publisher

Date: 29.02.2024

ఇంటెల్ పెంటియం రూపకర్త అవతార్ సింగ్ దుర్మరణం

» సైక్లింగ్ చేస్తుండగా ఢీకొన్న ట్యాక్సీ

» ముంబై పాలమ్ బీచ్‌రోడ్‌లో ఘటన

ముంబై, ఫిబ్రవరి 29: ఐదోతరం కంప్యూటర్లకు నాందిపలికిన ఇంటెల్ పెంటియం ప్రాసెసర్ రూపకర్త అవతార్‌సింగ్ సైనీ (68) రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలయ్యారు. ఇంటెల్ ఇండియా, ఇంటెల్ దక్షిణాసియా విభాగాలకు చీఫ్‌గా వ్యవహరించిన ఆయన అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవలే తన స్వస్థలం ముంబైకి వచ్చారు. బుధవారం ఉదయం పాలమ్ బీచ్‌రోడ్‌లో సైక్లింగ్ చేస్తుండగా ఓ ట్యాక్సీ అతన్ని ఢీకొంది. ఈ ఘటనలో ముందు చక్రాల కింద తల నలిగిపోయి కొన ఊపిరితో ఉన్న అవతార్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందేలోపు మృతిచెందినట్లు పోలీసులు వివరించారు. "అవతార్‌సింగ్ కుమారుడు, కుమార్తె అమెరికాలోనే స్థిరపడ్డారు. వారు భారత్‌కు వస్తున్నారు"అని ముంబై పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన ట్యాక్సీ డ్రైవర్‌ను అరెస్టు చేశామని, అవతార్‌సింగ్ బంధువులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు.



కంప్యూటర్ వేగంలో మార్పు..

భారీ సైజులో ఉండే కంప్యూటర్లు. ఆలస్యంగా ఔట్‌పుట్‌నిచ్చే ప్రాసెసర్లు..! ఇదీ మూడున్నర దశాబ్దాల క్రితం సంగతి. అప్పట్లో 8085, 8086 ప్రాసెసర్ల పనితీరు అలా ఉండేది. అప్పుడే సైజులో చిన్నగా ఉండి వేగంగా పనిచేసే ప్రాసెసర్ల రూపకల్పనకు ఇంటెల్ నడుంబిగించింది. 1993 మార్చిలో అవతార్‌సింగ్.. పెంటియం ప్రాసెసర్‌కు రూపకల్పన చేశారు. అలా పెంటియం-1(ఎక్స్86) ప్రాసెసర్లు అందుబాటులోకి వచ్చి కంప్యూటర్ల వేగం పెరిగింది. ఐదోతరం కంప్యూటర్ల నాందికి పెంటియం-1 దోహదపడింది. తర్వాత పెంటియం-2,3,4 వచ్చాయి. పెంటియంలో 64- బిట్ మైక్రోప్రాసెసర్ల రూపకల్పనలోనూ అవతార్ సింగ్‌ది కీలక భూమిక. ఇంటెల్ డ్యూయల్ కోర్, కోర్-2 డ్యూయో.. ఐ3, ఐ5, ఐ7..ఇలా కొంగొత్త ప్రాసెసర్లను తెచ్చింది. 2004లో ఇంటెల్‌ను అవతార్ వీడారు.

1.26 లక్షల కోట్లతో 3 సెమీకండక్టర్ యూనిట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించిన 'పీఎం సూర్యఘర్: ఉచిత విద్యుత్ పథకం' కింద వాటిని అమర్చుకున్న ప్రతి ఇంటికీ రూ.78 వేల సబ్సిడీ, 12 వ్యూహాత్మక ఖనిజాల రాయల్టీకి సంబంధించి ఎంఎండీఆర్ చట్టాన్ని సవరించడం వంటి కీలక ప్రతిపాదనలకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. రక్షణ, ఆటోమొబైల్స్, టెలికమ్యూనికేషన్స్ రంగాల్లో అత్యవసరమైన 'చిప్'ల కోసం భారతదేశం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో.. దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు 'డెవలప్‌మెంట్ ఆఫ్ సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్' ప్రోగ్రామ్ కింద టాటా గ్రూప్, జపాన్‌కు చెందిన రెనెసాస్ భాగస్వామ్యంతో మూడు యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో రెండింటిని గుజరాత్‌లో, ఒక యూనిట్‌ను అసోంలో ఏర్పాటు చేస్తామని.. వచ్చే 100 రోజుల్లో వీటి నిర్మాణం ప్రారంభమవుతుందని, ఈ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం రూ.76 వేల కోట్ల సాయం అందిస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ఏవేవి ఎక్కడంటే..

గుజరాత్‌లోని ధోలేరాలో ఒక యూనిట్‌ను టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్‌తో కలిసి రూ.91 వేల కోట్లతో ఏర్పాటు చేస్తుంది. నెలకు 50 వేల వేఫర్స్‌ను తయారు చేసే సామర్థ్యం ఈ యూనిట్‌కు ఉంటుంది. సీజీ పవర్ అనే మరో సంస్థ జపాన్, థాయ్ సంస్థలతో కలిసి గుజరాత్‌లోనే సనంద్‌లో రూ.7,600 కోట్లతో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇక.. టాటా సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (టీశాట్) సంస్థ అసోంలోని మోరిగావ్‌లో రూ.27 వేల కోట్లతో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. వీటిలో ధోలేరాలో టాటా సంస్థ ఏర్పాటు చేసే ప్లాంట్ అత్యంత శక్తిమంతమైన 28 నానోమీటర్ చిప్స్‌ను తయారుచేస్తుందని



క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

అశ్వినివైష్ణవ్ తెలిపారు. అసోం యూనిట్‌లో రోజుకు 4.8 కోట్ల చిప్‌లు.. సనంద్ యూనిట్‌లో రోజుకు 1.5 కోట్ల చిప్‌లు తయారవుతాయని వెల్లడించారు. ఈ మూడు యూనిట్ల వల్ల నేరుగా 20 వేల మందికి ప్రత్యక్షంగా.. మరో 60 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వివరించారు. చిప్‌ల లభ్యత అధికంగా ఉండడంతో.. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, టెలికం, ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఉద్యోగాల సంఖ్య భారీగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక.. ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 దాకా సాగే ఖరీఫ్ సీజన్‌కు రూ.24,420 కోట్ల ఎరువుల సబ్సిడీని అందించేందుకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. రైతులు ప్రస్తుతం డీఏపీ (డై అమ్మోనియం ఫాస్ఫేట్) ఎరువును క్వింటా సబ్సిడీ ధర అయిన రూ.1350కి కొనుగోలు చేస్తున్నారు. ఈ రేటు కొనసాగుతుందని, ఫాస్ఫాటిక్, పొటాష్ ఎరువుల రిటైల్ ధరలు కూడా అలాగే కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. డీఏపీ దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించేందుకుగాను.. పోషకాల ఆధారిత రాయితీ పథకంలో ఉన్న 25 ఎరువుల శ్రేణికి మరో మూడు కొత్త ఎరువుల గ్రేడ్‌లను చేర్చాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.

ఇంటింటా సౌర శక్తి..

'పీఎం సూర్యఘర్: ఉచిత విద్యుత్ యోజన' పేరిట రూ.75,021 కోట్లతో చేపట్టిన పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద ఇళ్లపై సౌరశక్తి ఫలకాలు అమర్చుకునేవారికి.. విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని బట్టి ఇంటికి రూ.30 వేల నుంచి రూ.78 వేల దాకా ఇస్తారు. అలాగే దాన్నుంచి వచ్చే విద్యుత్తులో నెలకు 300 యూనిట్ల దాకా ఉచితంగా వినియోగించుకోవచ్చు. మిగతా విద్యుత్‌ను ప్రభుత్వం తీసుకుంటుంది. కోటి ఇళ్లకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 2024 ఫిబ్రవరి 13న ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వల్ల 25 ఏళ్లలో 720 మిలియన్ టన్నుల మేర కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. అలాగే వీటివల్ల 17 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. వీటితోపాటు.. అంతరించే ముప్పు ఎదుర్కొంటున్న పులి, సింహం, చిరుత, మంచు చిరుత, ప్యూమా, జాగ్వార్, చీతా సంరక్షణ కోసం గతంలో భారతదేశం ప్రతిపాదించిన 'అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ)' ఏర్పాటుకు కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రపంచవ్యాప్తంగా 96 దేశాల్లో ఈ 'బిగ్ క్యాట్స్' ఉండగా.. మనదేశంలో పులి, సింహం, చిరుత, మంచు చిరుత, చీతా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఐబీసీఏ ప్రధాన కార్యాలయం భారత్‌లోనే ఏర్పాటు చేయనున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2027-28 దాకా దీని కోసం రూ.150 కోట్లు అందించనున్నారు.

లోకం తీరు



ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు

» అనర్హులుగా ప్రకటించిన హిమాచల్‌ప్రదేశ్ స్పీకర్

» పార్టీ విప్ ధిక్కరించినందుకే!

సిమ్లా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: బడ్జెట్‌పై ఓటింగ్ సందర్భంగా విప్‌ను దిక్కరించిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్‌సింగ్ పఠానియా గురువారం అనర్హత వేటు వేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు అనర్హులుగా తేల్చలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు రాజిందర్ రాణా, సుధీర్‌శర్మ, ఇందర్‌దత్ లఖన్‌పాల్, దేవిందర్ కుమార్ భుటూ, రవిఠాకూర్, చైతన్యశర్మలు బడ్జెట్‌పై ఓటింగ్‌లో పాల్గొనలేదని, ఆర్థిక బిల్లుపై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయనందున అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను అధికార కాంగ్రెస్ కోరింది. వీరంతా మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు ఓటు వేయడం గమనార్హం. కాగా, విప్‌ను ఉల్లంఘించినందుకు ఎమ్మెల్యేలపై చర్యలు కోరుతూ స్పీకర్‌కు శాసనసభా వ్యవహారాల మంత్రి హర్షవర్ధన్ మంగళవారం పిటిషన్ సమర్పించారు. ఎమ్మెల్యేలు బుధవారం స్పీకర్ ఎదుట హాజరయ్యారు. గురువారం ఇరుపక్షాల వాదనల అనంతరం స్పీకర్ నిర్ణయం ప్రకటించారు. విప్‌ను దిక్కరించిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి వచ్చారని.. దీంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాగా, తమ క్లయింట్‌లకు షోకాజ్ మాత్రమే జారీ చేశారని, 7 రోజులకు గాను 2 రోజుల సమయమే ఇచ్చారని రెబల్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అయితే, రెబల్ ఎమ్మెల్యేలు హాజరు పట్టికలో సంతకం చేశారని.. బడ్జెట్‌పై ఓటింగ్‌కు గైర్హాజరయ్యారని స్పీకర్ పఠానియా వివరించారు.

ఎట్టకేలకు షాజహాన్ షేక్ అరెస్ట్

10 రోజుల పోలీసు కస్టడీకి ఇచ్చిన కోర్టు.. సందేశ్‌ఖాలీలో సంబరాలు

బసిర్హాత్/కోల్‌కతా, ఫిబ్రవరి 29: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో మహిళలపై లైంగిక వేధింపులు, భూ ఆక్రమణల కేసుల్లో ప్రధాన నిందితుడు, అధికార టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని మినాఖా ప్రాంతంలో ఓ ఇంట్లో దాక్కొన్న షేక్‌ను గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. 'రేషన్ బియ్యం కుంభకోణం' కేసులో నిందితుడిగా ఉన్న షాజహాన్ ఇంట్లో తనిఖీలకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై గత నెల 5న అతని అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి షేక్ కనిపించకుండా పోయారు. షాజహాన్ షేక్, అతడి అనుచరులు తమపై అకృత్యాలకు పాల్పడుతున్నారంటూ ఇక్కడి మహిళలు రోడ్డెక్కారు. అతన్ని అరెస్టు చేయాలంటూ సందేశ్‌ఖాలీ ప్రాంత ప్రజలు దాదాపు 55 రోజులుగా హింసాత్మక నిరసనలు చేస్తున్నారు. ఈ క్రమం లో షేక్‌ను 72 గంటల్లోగా అరెస్టు చేయాలని.. లేకపోతే కారణాలను తనకు నివేదించాలని బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనందబోస్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. మరోవైపు కలకత్తా హైకోర్టు కూడా సీబీఐ, ఈడీ, బెంగాల్ పోలీసుల్లో ఎవరైనా షేక్‌ను అరెస్టు చేయొచ్చని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు, గవర్నర్ ఆదేశాల నేపథ్యంలో పోలీసులు స్పందించారు. సందేశ్‌ఖాలీకి 30 కిలోమీటర్ల దూరంలోని మినాఖా ప్రాంతంలో ఓ ఇంట్లో ఉన్న షేక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు డీజీపీ సుప్రతిమ్ సర్కార్ గురువారం వెల్లడించారు. అనంతరం అతన్ని బసిర్హాత్ కోర్టులో హాజరుపర్చగా.. 10 రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించినట్లు చెప్పారు. తర్వాత అతన్ని కోల్‌కతాలోని పోలీసు ప్రధాన కార్యాలయానికి తరలించారు. మమత సర్కారు ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో షేక్‌ను అక్కడికి తీసుకెళ్లినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. షాజహాన్ షేక్ అరెస్టు వార్త తెలియగానే సందేశ్‌ఖాలీ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు.



హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు..

షాజహాన్ షేక్‌కు బెయిలు ఇవ్వాలని కోరుతూ అతని తరఫు న్యాయవాదులు కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. 'నా క్లైంట్ ముందస్తు బెయిల్ తిరస్కరణకు గురైంది. ఆయన్ను అరెస్టు చేశారు. పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టండి' అని నిందితుడి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న షేక్‌పై ఎలాంటి సానుభూతీ లేదని సీజే జస్టిస్ టీఎస్ శివజ్ఞానం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఈ వ్యక్తిపై 43 కేసులు ఉన్నాయి. మరో 10 ఏళ్ల ఆయన మిమ్మల్ని బిజీగా ఉంచుతారు. మరే కేసు పరిశీలించే అవకాశం ఉండకపోవచ్చు. షేక్ కేసు విచారణకే పెద్ద లీగల్ టీమ్‌ను పెట్టుకోవాల్సి వస్తుందేమో!' అని వ్యాఖ్యానించారు.

షాజహాన్‌పై సస్పెన్షన్ వేటు..

పోలీసులు అరెస్టు చేసిన షాజహాన్ షేక్‌పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కఠిన చర్యలు తీసుకుంది. అతన్ని పార్టీ నుంచి ఆరేళ్లపాటు సస్పెండ్ చేసినట్లు టీఎంసీ నేత డెరెక్ ఒబ్రెయిన్ చెప్పారు. ప్రస్తుతం అతను సందేశ్‌ఖాలీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా, ఉత్తర 24 పరగణాల జిల్లా పరిషత్ సభ్యుడిగా ఉన్నారు. మరోవైపు షాజహాన్ మంగళవారం రాత్రి నుంచి బెంగాల్ పోలీసుల 'సురక్షిత కస్టడీ'లోనే ఉన్నారని బీజేపీ పేర్కొంది. తాజా అరెస్టు కేవలం వారి ముందస్తు ప్రణాళికలో భాగమేనని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ ఆరోపించారు. షాజహాన్ లాంటి అసాంఘిక శక్తులు టీఎంసీకి ఆస్తులన్న విషయం మరోసారి రుజువైందని బెంగాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధీర్‌రంజన్ చౌధరి అన్నారు. ఆయన అరెస్టు కేవలం డ్రామా అని ఆరోపించారు. 43 కేసులు నమోదైనా షాజహాన్‌ను అరెస్టు చేయడానికి ఇంత సమయం ఎందుకు పట్టిందని సీపీఎం ప్రశ్నించింది.

ప్రభుత్వ ఉద్యోగానికి సంతాన పరిమితి నిబంధన సబబే: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు విధించిన అర్హతల్లో సంతాన పరిమితిని పేర్కొనడం సబబేనని, అది రాజ్యాంగ విరుద్ధం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి అర్హులు కారంటూ రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనను సమర్థించింది. ఈ మేరకు గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. రాజస్థాన్ వేరియస్ సర్వీస్ అమెండ్‌మెంట్ రూల్స్-2001లో ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి అనర్హులన్న నిబంధన ఉంది. రాజస్థాన్ పోలీసు సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1989లోని రూల్ నెంబరు 24(4)లో కూడా 2002 జూన్ ఒకటో తేదీ తరువాత ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు కలిగిన వారు ఉద్యోగాలకు అర్హులు కారని స్పష్టంగా పేర్కొంది. ఈ నిబంధనలను సవాలు చేస్తూ రామ్‌జీ లాల్ జాట్ తొలుత హైకోర్టును ఆశ్రయించారు. 2017లో మిలటరీ నుంచి రిటైరయిన ఆయన 2018లో పోలీసు కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేశారు. అధిక సంతానం కలిగి ఉన్నారన్న కారణంతో ఆ దరఖాస్తును తిరస్కరించారు. దీంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నిబంధనలో జోక్యం చేసుకోలేమంటూ హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం ఈ నిబంధనలు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవే తప్ప వివక్ష చూపేవి కాదని తెలిపింది. అప్పీలును తిరస్కరించింది.

కేసుల విచారణపై గడువు విధించలేం

» 6 నెలలు గడిచినంత మాత్రాన 'స్టే' ఆటోమేటిక్‌గా రద్దు కాదు: సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: మధ్యంతర స్టే ఉత్తర్వుల విషయమై గతంలో ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ గురువారం సుప్రీంకోర్టు కీలక నిర్ణయాన్ని వెలువరించింది. సివిల్, క్రిమినల్ కేసుల్లో ఇచ్చే మధ్యంతర స్టే ఉత్తర్వులు ఆరు నెలల అనంతరం ఆటోమేటిక్‌గా రద్దేమీ కావని స్పష్టంచేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయిస్తే ఫలానా సమయంలోగా కేసులు పరిష్కరించాలంటూ సుప్రీంకోర్టుగానీ, హైకోర్టుగానీ ట్రయల్ కోర్టులకు ఎలాంటి నిర్దేశాలు ఇవ్వలేవని తెలిపింది. కేసులోని అంశాల ఆధారంగా అవే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈమేరకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై 2018లో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ తాజా నిర్ణయం వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. ఒకే అభిప్రాయాన్ని పేర్కొంటూనే జస్టిస్ మిశ్రా, జస్టిస్ ఓకా విడివిడిగా తీర్పులు రాశారు. జస్టిస్ మిశ్ర వ్యక్తిగతంగా, జస్టిస్ ఓకా తనతోపాటు మిగిలిన ముగ్గురితరఫున తీర్పు రాశారు. ఆసియన్ రీసర్ఫేసింగ్ ఆఫ్ రోడ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ సీబీఐ కేసుపై 2018లో త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇస్తూ ప్రత్యేకంగా పొడిగించకపోతే ట్రయల్ కోర్టుల్లో జరిగే విచారణలపై వచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులు ఆటోమేటిక్‌గా రద్దవుతాయని తెలిపింది.

ప్రత్యేక దక్షిణాది దేశం ఆలోచన ప్రమాదకరం

» కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక దక్షిణ భారత అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ డీకే సురేష్ లేవనెత్తడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పోకడ అని వ్యాఖ్యానించారు. దేశాన్ని బీజేపీ ఏకం చేస్తుంటే కాంగ్రెస్ నోట ఇలాంటి విభజన మాటలు పదేపదే వినిపిస్తున్నాయని ఆమె విమర్శించారు. బెంగళూరులోని ఆదాయపన్నుల శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. నిధుల విడుదలలో ఫైనాన్స్‌కమిషన్‌ను కాదని కేంద్రం వ్యవహరించడం లేదన్నారు. కర్ణాటకలో వసూలయ్యే పన్నులను ఎక్కడికీ తరలించడం లేదని, ఆ రాష్ట్ర అభివృద్ధికే వినియోగిస్తున్నామని ఆమె చెప్పారు.

మెట్రోలో అన్నదాతకు అవమానంపై జాతీయ మానవహక్కుల కమిషన్ నోటీసు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మాసిన బట్టలతో వచ్చిన రైతును మెట్రోస్టేషన్‌లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంపై మానవహక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వివాదంపై కమిషన్ తీవ్రంగా స్పందించింది. నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని బెంగళూరు మెట్రో కార్పొరేషన్‌కు నోటీసు జారీ చేసింది. ఫిబ్రవరి 26న రాజాజీనగర్ మెట్రోస్టేషన్‌లోకి వచ్చిన రైతును మెట్రో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్న విషయం తెలిసిందే. తోటి ప్రయాణికులు సిబ్బందిని మందలించి, ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో ఇప్పటికే సంబంధిత సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించారు.

వీల్‌చైర్ లేక వృద్ధుడి మృతి ఘటనలో ఎయిర్ ఇండియాకు రూ.30 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ఇటీవల ముంబై విమానాశ్రయంలో వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటనకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) తీవ్రంగా స్పందించింది. వృద్ధుడికి వీల్‌చైర్ సమకూర్చడంలో విఫలమైనందుకు ఎయిర్ ఇండియాకు రూ.30 లక్షల జరిమానా విధించినట్లు డీజీసీఏ గురువారం తెలిపింది. ఈనెల 12న ఓ 80 ఏళ్ల వ్యక్తి తన భార్యతో కలిసి ఎయిర్‌ఇండియా విమానంలో న్యూయార్క్ నుంచి ముంబైకు వచ్చారు. విమానం దిగిన తర్వాత వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన టెర్మినల్ వరకు నడుచుకుంటూ వెళ్లి గుండెపోటుకు గురై మరణించిన సంగతి తెలిసిందే. విమానాశ్రయాల్లో ప్రయాణికులకు సరిపడా వీల్‌చైర్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్ని విమానయాన సంస్థలకు డీజీసీఏ గురువారం అడ్వైజరీ జారీ చేసింది.

జైళ్లలో కుల, మత వివక్ష చెల్లదు

» నిబంధనలు సవరించండి.. రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

చెన్నై, ఫిబ్రవరి 29: కులం, మతం ఆధారంగా జైళ్లలో ఖైదీల పట్ల వివక్ష చూపిస్తుండడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఇలాంటివాటికి వెంటనే స్వస్తి పలకాలని తెలిపింది. ఇందుకు వీలుకలిగించే నిబంధనలు కొన్ని రాష్ట్రాల జైళ్ల మ్యాన్యువల్‌లలో ఉన్నాయని, వాటిని తక్షణమే రద్దు చేయడమో, సవరించడమో చేయాలని ఆదేశించింది. ఖైదీలను వారి కులం, మతం ఆధారంగా వేరు చేయడంతో పాటు అందుకు అనుగుణంగా వారికి జైళ్ల పనులు అప్పగించడం కొన్ని రాష్ట్రాల్లో అమలవుతోంది. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. 2016నాటి మోడల్ ప్రిజన్ మాన్యువల్‌లోనూ ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు గుర్తు చేసింది. వంటశాల నిర్వహణ, ఆహారం తయారీ తదితర పనుల్లో కులం, మతాన్ని చూడకూడదని; సామాజిక, ఆర్థిక హోదాల ఆధారంగా ఖైదీలను విభజించకూడదని, అందర్నీ ఒకేలా చూడాలని స్పష్టంగా ఉంది. ఈ నిబంధనలు అన్ని రాష్ట్రాల జైళ్ల మాన్యువల్‌లలో పొందుపరచాలని సూచించింది. ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపింది.

ప్రాణం తీసిన 'నిమిషం'

- పరీక్ష కేంద్రానికి 3 నిమిషాలు ఆలస్యంగా ఇంటర్ విద్యార్థి
- ప్రాధేయపడినా అనుమతించని అధికారులు
- మనోవేదనతో సాత్నాల ప్రాజెక్టులో దూకిన విద్యార్థి
- ఆదిలాబాద్ జిల్లాలో విషాదం


శివకుమార్ (ఫైల్)

ఆదిలాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): 'నిమిషం ఆలస్యమైనా కూడా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోం' అన్న నిబంధన ఓ ఇంటర్ విద్యార్థి నిండు ప్రాణాలను బలిగొంది. పరీక్ష కేంద్రానికి మూడు నిమిషాలు ఆలస్యంగా వెళ్లిన ఆ విద్యార్థి, లోపలికి అనుమతించాలని ఎంతగా వేడుకున్నప్పటికీ అధికారులు కనికరించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి నుంచి ఎంతో ఉత్సాహంగా పరీక్ష కేంద్రానికి బయలుదేరిన ఆ విద్యార్థి తీవ్ర నిరాశతో తిరుగుముఖం పట్టి మార్గమధ్యలో ఓ ప్రాజెక్టులోకి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. మృతుడు ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం మాంగూర్ల గ్రామానికి చెందిన టీకం రాములు-పంచపూల దంపతుల కుమారుడు 17 ఏళ్ల శివకుమార్. పరీక్షను మిస్ అయ్యాననే బాధను భరించలేకపోతున్నానంటూ నాన్నను ఉద్దేశించి శివ కుమార్ సూసైడ్ నోట్ రాశాడు. శివ కుమార్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం శివను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన బైక్‌పై ఎక్కించుకొని ఆదిలాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద దిగబెట్టాడు. అయితే అప్పటికే మూడు నిమిషాలు ఆలస్యమవడంతో పరీక్ష కేంద్రంలోకి శివను అధికారులు అనుమతించలేదు. అధికారులను శివ బతిమాలుకుంటున్న దశలోనే దిగబెట్టిన ఆ వ్యక్తి.. తనకు స్థానికంగా వేరేపని ఉదంటూ బాలుడికి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎంత బతిమిలాడినా ఫలితం లేకపోవడంతో కొద్దిసేపటి తర్వాత శివ పుట్టెడు దుఖంతో తిరుముఖం పట్టాడు. గ్రామ శివారులోని సాత్నాల ప్రాజెక్టులోకి దూకాడు. స్థానికులు చూసి పోలీసులకు చెప్పడంతో గజ ఈతగాళ్లు గాలించారు. శివను బయటకు తీసేటప్పటికే అతడు ప్రాణాలు విడిచాడు. గట్టు మీద.. సూసైడ్ నోట్, రిస్ట్ వాచీ, రెండు పెన్నులు లభించాయి.


శివకుమార్ రాసిన సూసైడ్ నోట్

" నాన్న నన్ను క్షమించు. ఈ బాధ భరించడం నా వల్ల కావడం లేదు. మీరు నాకోసం చాలా చేశారు కానీ నేను మీ కోసం ఏదీ చేయలేక పోతున్నా.. నా జీవితంలో ఎప్పుడూ ఇంత బాధ కలగలేదు. మొదటిసారి ఎగ్జామ్ మిస్ అయినందుకు చాలా బాధగా ఉంది. ఊపిరి కూడా తీసుకోలేకపోతున్నా"

సూసైడ్ నోట్‌లో శివ కుమార్

శివ పరీక్ష కేంద్రానికే వెళ్లలేదు: ఎస్సై

ఆత్మహత్యకు పాల్పడిన ఇంటర్ విద్యార్థి శివ కుమార్ అసలు పరీక్ష కేంద్రానికి వెళ్లలేదని జైనథ్ ఎస్సై పురుషోత్తం చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద తాము సీసీ ఫుటేజీని పరిశీలించామని, ఎక్కడా శివ కుమార్ కనిపించలేదని స్పష్టం చేశారు.

జూనియర్ లైన్‌మెన్ పోస్టులను భర్తీచేయండి

- హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థ టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లో భర్తీ కాకుండా మిగిలిపోయిన జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు నియామకాల ప్రక్రియను చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మిగిలిపోయిన దాదాపు 550 పోస్టులను నూతన రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రస్తావన లేకుండా పాత జిల్లాల ప్రాతిపదికనే భర్తీ చేయాలని సూచించింది. ఈ సంస్థ 2019లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో దాదాపు 1950 పోస్టులు ఇప్పటికే భర్తీకాగా, మిగిలిపోయిన పోస్టులను కొత్త జిల్లా ప్రాతిపాదికన స్థానికులకు 95 శాతం రిజర్వేషన్ ఇవ్వనున్నట్లు ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాత ఉమ్మడి జిల్లాలకు చెందిన అభ్యర్థులు వేర్వేరుగా హైకోర్టులో 30 పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. పై విధంగా తీర్పు వెలువరించింది.

అగ్రహార కాచారంలో స్ఫటికరాయి మైనింగ్ నిలిపివేత

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

నల్గొండ జిల్లా దేవరకొండ మండలం అగ్రహార కాచారంలో స్ఫటికరాయి (క్వార్ట్జ్) మైనింగ్‌ను నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. లీజు రెన్యువల్ చేయడం అక్రమమని పేర్కొంటూ దేవరకొండ, కాచారం గ్రామాలకు చెందిన కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ప్రభుత్వం ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఈ ఉత్తర్వులు జారీచేసింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

నిమిషం విషమ 'పరీక్ష'

ఇంటర్ విద్యార్థుల గుండెల్లో నిబంధన దడ.. ఆలస్యమైతే ఎగ్జామ్‌కు అనుమతి నిరాకరణ

- మొదటి రోజునే పలువురికి చేదు అనుభవం
- విమర్శల తాకిడితో ఇంటర్ బోర్డు దిద్దుబాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి 'ఇంటర్మీడియట్' చదువు అత్యంత కీలకం.. జీవితం ఇక్కడే మలుపు తిరుగుతుంది.. కాబట్టి అత్యంత జాగ్రత్తగా ఉండాలి...! కాలేజీలో చేరిన నాటి నుంచి ఫేర్‌వెల్ ఫంక్షన్ వరకు చెప్పే మాటలివి..! వీటిలో వందకు వందశాతం నిజం ఉంది. భవిష్యత్ పోటీ పరీక్షలకు ఇంటర్ నుంచే పునాది. అందుకే తమ పిల్లలు మంచి మార్కులు సాధించేలా.. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేలా తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే, ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక పరీక్షల సందర్భంగా ప్రస్తుతం అమలు చేస్తున్న.. 'నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ' నిబంధన విద్యార్థుల పాలిట శరాఘాతం అవుతోంది. పరీక్ష ప్రారంభమయ్యే సమయం దాటిన తర్వాత కేంద్రానికి వస్తున్నవారిని లోపలికి పంపించకపోవడం తీవ్ర మనో వేదన మిగుల్చుతోంది. రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ ఎగ్జామ్స్ మొదలయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు.. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8.45- 9 గంటల వరకు ఓఎంఆర్ షీట్స్ అందిస్తున్నారు. 9 తర్వాత ఒక్క నిమిషం దాటినా అనుమతించడం లేదు.

ఏడాదంతా చదివి పరీక్షకు ఆలస్యంగా వెళ్లాలని విద్యార్థులెవరూ కోరుకోరు. రవాణా సౌకర్యం లేక కొన్నిసార్లు ఆలస్యం కావొచ్చు. ముఖ్యంగా బస్సులు, ఆటోల్లో ప్రయాణించి వచ్చే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నిమిషం నిబంధన తీవ్ర ఇబ్బందిగా మారింది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నగరాలు, పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు సరేసరి. వీటన్నిటి మధ్య ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకునేవారికి అనుమతి నిరాకరిస్తున్నారు. బుధవారం 24 మంది పరీక్షకు దూరం కాగా అందరూ గ్రామీణ ప్రాంతం వారే. ఆదిలాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిది ఇదే నేపథ్యం. ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని ఉద్దేశం కాదు. అయితే, నిమిషం నిబంధన మరీ కఠినంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వెయిటేజీ లేదు.. కాంపిటీటివ్ కాదు

టీఎస్ ఈఏపీసెట్ (గతంలో ఎంసెట్)లో ఇంటర్ మార్కుల వెయిటేజీని తొలగించారు. దీంతో ఈ మార్కులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. అంతేకాదు.. డిస్క్రిప్టివ్‌గా సాగే ఇంటర్ పరీక్షలు అకడమిక్. 5, 10 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా.. అనుమతించడం ద్వారా మిగతావారికి నష్టం జరగదు. పేపర్ లీక్, కాపీయింగ్‌లకు అవకాశం ఉండదు. అదే.. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉండే ఈఏపీసెట్, జేఈఈ వంటివి పోటీ పరీక్షలు. కాపీయింగ్‌తో పాటు ప్రశ్నలు బయటకు వస్తాయనే ఆందోళన ఉంటుంది. అందుకే నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరిస్తుంటారు. కానీ, ఇంటర్ పరీక్షలకూ కఠినంగా వర్తింపజేయడం సరికాదనే వాదన వస్తోంది.

5 నిమిషాల దాక అనుమతికి మౌఖిక ఆదేశం?

నిమిషం నిబంధనపై తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో ఇంటర్ బోర్డు దిద్దుబాటుకు దిగినట్లు తెలుస్తోంది. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఐదు నిమిషాల వరకు ఆలస్యమైనా పరీక్షకు అనుమతించాలని సిబ్బందికి మౌఖికంగా మాత్రమే ఆదేశాలిచినట్లు సమాచారం. దీంతో ఆదిలాబాద్ గురుకుల కాలేజీలో, హైదరాబాద్‌లో గురువారం 9 తర్వాత వచ్చినా లోపలకు వెళ్లనిచ్చారు. కాగా, సెకండ్ ఇయర్ సెకండ్ లాంగ్వేజి పేపర్-2 కు 4,55,536 మందికి 4,42,451 మంది హాజరయ్యారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూడాలని.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం జిల్లా విద్యాధికారులకు సూచించారు. ఆదిలాబాద్‌లో విద్యార్థి ఆత్మహత్య నేపథ్యంలో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కళాశాలల ప్రిన్సిపల్స్ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఒత్తిడికి గురయ్యే వారికి డీఐఈవోలు, నోడల్ అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు హెల్ప్ లైన్ నంబర్లు 14416 లేదా 18009144166కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చన్నారు. రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ నం.040-24655027 లోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మానసికంగా దెబ్బపడితే చాలా ప్రభావం

ఒక్క మార్కు అయినా తలరాత మారుస్తుంది కాబట్టి కాంపిటీటివ్ పరీక్షల్లో నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరిస్తుంటారు. పరీక్ష మొదలయ్యాక విద్యార్థి ఏకాగ్రత చెదరకూడదనే ఉద్దేశమూ ఇందులో ఉంటుంది. ఇంటర్‌కు 5-10 నిమిషాలు ఆలస్యం అనుమతించదగినదే. ఏడాది చదువును దెబ్బతీసేలా పరీక్షకు దూరం చేయడం సమంజసం కాదు. ఇలా చేయడం మానసికంగా వారిపైన ప్రభావం చూపుతుంది. ఈ దెబ్బ తర్వాత రాయబోయే పోటీ పరీక్షలపైనా ఉంటుంది.

- కంచన లలిత్‌కుమార్, విద్యావేత్త

ప్రాణాంతకమైన మత్తు ఇంజెక్షన్ ఇవ్వలేకపోవడంతో మరణ శిక్ష వాయిదా పడ్డ ఘటన అమెరికాలోని ఇడాహో రాష్ట్రంలో జరిగింది. బయట ఐదు హత్యలతో పాటు, జైలులో తోటి ఖైదీని హత్య చేశాడన్న నేరం రుజువు కావడంతో థామస్ యూజీన్ క్రీచ్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. ప్రాణాంతక ఇంజెక్షన్ వేయడానికి అతని కాళ్లు, చేతుల్లో నరాలను వైద్య సిబ్బంది పట్టుకోలేకపోవడవంతో శిక్ష వాయిదా పడింది. - వాషింగ్టన్


జర్నలిస్టు కుటుంబానికి అకాడమీ తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్న కె. శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు


జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు

- జేఎన్‌జే సభ్యులు సహా అందరికీ లబ్ధి
- నగరానికి నలువైపులా ఇళ్లు, ఇళ్ల స్థలాలు
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెండున్నర లక్షల చొప్పున చెల్లించి గడిచిన 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘాలు, ప్రతినిధులు, హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో త్వరలో సమావేశమై ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులకు నగరానికి నాలుగు వైపుల స్థలాలను గుర్తించి ఎవరికి ఎక్కడ అనువైతే అక్కడే ఇచ్చేలా అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దైనందిన సమస్యలతో జర్నలిస్టులు వృత్తిపరమైన నైపుణ్యతపై దృష్టి సారించలేకపోతున్నారని, మీడియా అకాడమీ వారిలో నైపుణ్యతను పెంచడానికి కృషి చేయాలన్నారు. అకాడెమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అక్రిడిటేషన్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వంటి సమస్యలను సంబంధం లేకుండానే అకాడెమీకి అప్పగించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నార. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీఎం సీపీఆర్ఓ అయోధ్య రెడ్డి, ఏపీప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీపీఐ నాయకులు డాక్టర్ కె.నారాయణ, పల్లా వెంకటరెడ్డి, సియాసత్ ఎడిటర్ అమెర్ అలీఖాన్, ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతరావు పాల్గొన్నారు.

క్వింటా పసుపు రూ.15,025

- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రికార్డుస్థాయి ధర


నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు

ఖిల్లా (నిజామాబాద్), ఫిబ్రవరి 29: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధర రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం బద్దం సంతోష్ అనే రైతు అనే రైతు తీసుకొచ్చిన పసుపు రికార్డు స్థాయిలో క్వింటా రూ.15,025లు పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర. అయితే సంతోష్ క్వింటాలున్నర పసుపు తీసుకురాగా దానికి మాత్రమే ఈ ధర లభించింది. మిగిలిన రైతుల పసుపు క్వింటా రూ.8 వేల నుంచి రూ.11,500 మధ్య ధర పలికింది. కొంతమందికి రూ.14,611 వరకు ధర పలికింది. కాగా, గురువారం మార్కెట్‌కు మొత్తం 7,500 క్వింటాళ్ల పసుపు అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో సరాసరి మోడల్ రేటు ప్రకారం ధర వస్తుందని కార్యదర్శి వెంకటేశం తెలిపారు.

మేడారం హుండీల లెక్కింపు షురూ

- పది రోజుల వరకు కొనసాగే అవకాశం
- హుండీల్లో అంబేడ్కర్ బొమ్మ ఉన్న రూ.100 నోట్లు

హనుమకొండ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు మొదలైంది. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో భారీ బందోబస్తు మధ్య లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. దేవాదాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు 350 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. లెక్కింపు పూర్తి కావడానికి పది రోజులు పట్టవచ్చని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత తెలిపారు. లెక్కింపును వేగవంతం చేయడానికి ఈసారి నోట్ల నుంచి నాణేలను వేరుచేయడానికి ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌లో అక్రమాలు జరగకుండా కేంద్రం లోపల, బయట 60కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. హుండీల్లోని చాలా నోట్లు బెల్లం, పసుపు, కుంకుమలతో తడిసి ముద్దయ్యాయి. వాటిని సబ్బు నీళ్లలో నానబెట్టి, కడిగి, ఇస్త్రీ చేస్తున్నారు. పూర్తిగా చిరిగిపోయిన నోట్లను పక్కన పెడుతున్నారు. హుండీల్లో నోట్లతో పాటు బంగారు, వెండి కానుకలు కూడా బయటపడుతున్నాయి. లెక్కించిన నోట్లను ఏరోజుకారోజు బ్యాంకులో జమ చేయనున్నారు. మొదట తెరిచిన హుండీల్లో అంబేడ్కర్ బొమ్మ ఉన్న రూ.100 నోట్లు ఐదారు నోట్లు వచ్చాయి. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్ వాటిపై రాసి ఉంది. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఎవరో ఇలాంటి నోట్లను ముద్రించి ఉంటారని భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హిమాచల్ చల్లబడినట్టేనా?


రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి, కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మనుసింఘ్వీ పరాజయానికి కారకులైన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలమీద హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గురువారం అనర్హతవేటు వేశారు. రాష్ట్ర బడ్జెట్ ఓటింగులో విప్‌కు అనుగుణంగా వ్యవహరించని నేరంపై వారికి ఈ శిక్షపడింది. ఈ చర్యతో అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 68నుంచి 62కు తగ్గింది, కాంగ్రెస్ బలం 34, ముగ్గురు స్వతంత్రులతో కలిపి బీజేపీ బలం 28అయింది. పతనం అంచుకు జారుకున్న హిమాచల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అనర్హత నిర్ణయం తరువాత ప్రస్తుతానికి ఓ పెద్ద గండంనుంచి బయటపడింది. స్పీకర్ స్థానంలో అస్మదీయులున్నప్పుడు అధికారపక్షాలకు ఎన్నెన్నో లాభాలుంటాయి మరి.

ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ ప్రభావం అభిషేక్ మనుసింఘ్వీ ఓటమికి మాత్రమే పరిమితం కాలేదు. వారి చర్యతో ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సభలో మెజారిటీ కోల్పోయిందని, ఆయన సభావిశ్వాసాన్ని నిరూపించుకోవాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేసింది. కానీ, బుధవారం బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో పదిహేనుమంది బీజేపీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం, మర్నాడు ఈ ఆరుగురిమీదా ఆర్థికబిల్లుపై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటుచేయలేదన్న ఆరోపణతో అనర్హతవేటువేయడం ద్వారా కాంగ్రెస్ తనకు అనుకూలంగా పరిస్థితిని మార్చుకుంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా జారీ చేసిన విప్‌ను ధిక్కరించినందుకు పార్టీ ఫిర్యాదుమేరకు స్పీకర్ వారిపై ఈ చర్య తీసుకున్నారు. ఈ ఆరుగురితోపాటు ఇంతకాలం కాంగ్రెస్‌కు అండగా ఉన్న ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులను కూడా బీజేపీ తనవైపు తిప్పుకోవడంతో సభలో దాని బలం పాతికనుంచి 34కు పెరిగి, కాంగ్రెస్ సరిసమానమైపోయిన విషయం తెలిసిందే. ఓట్లను ఇలా సమానం చేసి, ఆ తరువాత లక్కీడ్రా ముందుకు తెచ్చి తన రాజ్యసభ అభ్యర్థి హర్ష్ మహాజన్‌ను బీజేపీ గెలిపించుకుంది. అప్పటివరకూ 43మందితో నిక్షేపంగా ఉన్న కాంగ్రెస్ తన అభ్యర్థి ఓటమితో పాటు, ప్రభుత్వాన్నే కోల్పోయే ప్రమాదంలోకి జారుకుంది.

ప్రస్తుతానికి సమస్యనుంచి గట్టెక్కినా, ఉన్నవారిని నిలబెట్టుకుంటూ ఎవరూ జారిపోకుండా జాగ్రత్తపడుతూ కాంగ్రెస్ ఎంతకాలం నెట్టుకురాగలదన్నది అసలు ప్రశ్న. కర్ణాటక శివకుమార్, చత్తీస్‌గఢ్ భూపేష్‌బగల్, హర్యానా హూడా సహా చాలామంది కాంగ్రెస్ పెద్దలు, మేధావులు గురువారం శిమ్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో చర్చోపచర్చలు జరిపారు. సంక్షోభం సమసిపోయిందనీ, అంతా సవ్యంగా ఉన్నదని ప్రకటించారు. ముఖ్యమంత్రి సుఖూను మార్చాలన్న డిమాండ్ బలంగా ఉన్నా, ఆ పనిచేస్తే ఈసారి తిరుగుబాటు ఆయన వర్గంనుంచి వస్తుంది కనుక ప్రస్తుతానికి కొనసాగింపే శ్రేయస్కరమన్నది పర్యవేక్షకుల వ్యాఖ్యల సారాంశం. ఆరుసార్లు హిమాచల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వీర్‌భద్రసింగ్ భార్య ప్రతిభాసింగ్ వర్గానికి, ముఖ్యమంత్రి సుఖూ వర్గానికి మధ్య నిరంతరపోరు పార్టీని ముంచుతోంది. మంత్రిగా ఉన్న ఆమె కుమారుడు సైతం ఇప్పుడు తన రాజీనామా విషయంలో రాజీపడినట్టుగా వార్తలు వస్తున్నాయి. కానీ, నేను బాహుబలిని అని నిరూపించుకోవడానికి గురువారం ముఖ్యమంత్రి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అల్పాహారానికి పిలిస్తే 31మంది మాత్రమే వచ్చారట.

అసెంబ్లీలో ఎంత బలం ఉన్నా, కాంగ్రెస్ నిద్రమత్తులోనే ఉంటుంది, ఇటువంటి ప్రమాదాలు వచ్చిపడుతూనే ఉంటాయి అంటూ సీపీఎం పత్రిక గురువారం ఓ వ్యాఖ్య చేసింది. బీజేపీ అవినీతికరమైన చర్యలను తప్పుబడుతూనే, పార్టీలో అంతర్గతవైరుధ్యాలను, లుకలుకలను పరిష్కరించడంలో కాంగ్రెస్ అధినాయకత్వం విఫలమవుతున్నదని అది వ్యాఖ్యానించింది. హిమాచల్‌లో పరిస్థితులు సవ్యంగా లేనందునే సోనియాగాంధీని రాజస్థాన్‌నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ పంపిందని వార్తలు వచ్చాయి. అభిషేక్‌మను సింఘ్వీ పరాజయం, ప్రభుత్వం పతనమయ్యే ప్రమాదం, ఒక మంత్రి రాజీనామా వంటి తీవ్ర పరిణామాలతో కానీ కాంగ్రెస్ అధినాయకత్వం సంక్షోభనివారణకు దిగకపోవడం విచిత్రం. పార్టీలో అంతర్గత పోరు కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు బీజేపీ పరం కావడానికి ఉపకరించింది. ఇప్పుడు ఉత్తరభారతంలో హిమాచల్ మాత్రమే కాంగ్రెస్ చేతిలో మిగిలింది. 2022లో బీజేపీని ఓడించి మంచి ఆధిక్యతతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ పదిహేనునెలల్లోనే ప్రజలు అప్పగించిన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి అష్టకష్టాలూ పడుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టుకు కాలం చెల్లినట్టేనా?



నీళ్లు నిధులు, నియామకాల నినాదంతో ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పాటయింది. అదే నినాదాన్ని ఎన్నికల ఆయుధంగా మలుచుకొని మరికొన్ని ఆకర్షణీయమైన హామీలతో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. తెలంగాణ సమాజం నూతనంగా ఏర్పడ్డ రాష్ట్రం నుండి, మరీ ముఖ్యంగా ఉద్యమాల నుంచి ఉద్భవించిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అనితర సాధ్యంగా పునర్నిర్మిస్తుందని అందరూ ఆశించారు. జరిగిందేమిటి? పది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వ పాలన తర్వాత నేడు వెనక్కి చూస్తే ఆ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి తెలంగాణను తిరోగమనంలోకి తీసుకెళ్ళిందని విశదమవుతుంది.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి పెట్టామని 2014లో కొత్త రాష్ట్రంలో ప్రప్రథమంగా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్ గొప్పగా ప్రకటించింది. అప్పటికే ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన పలు సాగునీటి ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయి. వాటిని పూర్తిచేసే బాధ్యతను పక్కనపెట్టి, అప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులకు పేర్లు మార్చడం, రీ డిజైనింగ్ పేరుతో నిర్మాణ వ్యయాన్ని పెంచే కార్యక్రమంలో మునిగిపోయారు. అందులో ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు కావలసిన దాదాపు అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి పొంది సుమారు రూ.38 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేసేందుకు పూనుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు పేరును కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా మార్చి, పూర్తిస్థాయిలో రీడిజైనింగ్ కార్యక్రమం మొదలుపెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం తానే నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, మేడిగడ్డ ప్రాంతంలో బ్యారేజ్ కట్టాలని నిర్ణయించి ముందుకు వెళ్ళింది. ఆ విధంగా మొదలైన ఆ అశాస్త్రీయ ప్రక్రియ దాదాపు నాలుగు సంవత్సరాల పాటు కొనసాగి చివరికి 2019లో పూర్తిస్థాయిలో రీడిజైనింగ్‌కు గురైన కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడంబరంగా ప్రకటించుకున్నారు. దాదాపుగా మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 200 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసి సామర్థ్యం గల రిజర్వాయర్లు, 530 మీటర్ల ఎత్తుకి నీటిని ఎత్తిపోయడం లాంటి సంక్లిష్టమైన అంశాలున్న ఎత్తిపోతల ప్రాజెక్టు నాలుగు సంవత్సరాలలో పూర్తి చేసినట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారు. ఈ సంక్లిష్టమైన ప్రాజెక్టుకు దాదాపుగా లక్ష కోట్ల రూపాయలు అప్పు తెచ్చి ఖర్చుపెట్టినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియను తానేనని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదే పదే చెప్పుకున్నారు.

> కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ పార్టీలు రాజకీయ కోణంలో చూడకుండా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల దీర్ఘకాలిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఇక ఆ ప్రాజెక్టుపై అదనంగా ఖర్చు చేసే అంశానికి స్వస్తి చెప్పాలి. మున్ముందు జరగబోయే నష్టాలను తగ్గించుకునే మార్గాలను ఎంచుకోవడం మంచిది. మిగిలిన ఒకే ఒక్క శ్రేయస్కర మార్గం– కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా నీటిపారుదల ప్రాజెక్టుగా చూడకుండా దాన్ని కేవలం ఒక టూరిజం హబ్‌గా, చేపల పెంపకానికి అనువైన ప్రదేశంగా అభివృద్ధిపరిచేందుకు అవకాశాలు అన్వేషించడమే.

ఈ సంక్లిష్టమైన ప్రాజెక్టుకు సంబంధించిన మూడు కీలక అంశాలను విశ్లేషించాల్సిన అవసరం ఉంది. మొదటిది నిపుణుల సిఫార్సులకు పూర్తి విరుద్ధంగా మేడిగడ్డ వద్ద కట్టిన బ్యారేజీ అశాస్త్రీయమైనది. గత సెప్టెంబర్‌లో మేడిగడ్డ బ్యారేజ్‌కు సంబంధించిన మూడు పిల్లర్లు భూమిలోకి కుంగిపోవడమే అందుకు నిదర్శనం. తద్వారా బ్యారేజీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో బ్యారేజీలో ఉన్న నీటిని రహస్యంగా ఆనాటి కేసిఆర్ ప్రభుత్వం సముద్రంలోకి వదిలివేసింది. దీనిని పరిశీలించిన జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ ఇచ్చిన నివేదికే అందుకు నిదర్శనం. రెండవ అంశం కేంద్ర ప్రభుత్వ సంస్థ 'కాగ్' నివేదిక ప్రకారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు వ్యయం సమాజానికి ఏ మాత్రం లాభసాటి కాదని స్పష్టంగా తెలుస్తుంది. ఆ నివేదిక ప్రకారం, ఈ ప్రాజెక్టుపై పెట్టిన ప్రతి వంద రూపాయల ఖర్చుకు కేవలం 52 రూపాయల లబ్ధి మాత్రమే సమాజానికి లభించగలదని స్పష్టంగా తెలుస్తుంది. ప్రపంచంలోని ఏ నీటిపారుదల ప్రాజెక్టు గానీ, ఏ ఇతర ప్రాజెక్టులు కానీ ఈ స్థాయిలో ఆర్థికంగా లాభసాటి కానీ విధంగా ఉన్నట్లు దాఖలాలు లేవు. బాధ్యతగల ఏ ప్రభుత్వం కూడా అప్పుగా తీసుకువచ్చిన ప్రజాధనాన్ని ఈ విధంగా సమాజానికి ఉపయోగపడని రీతిలో ఖర్చుపెట్టినట్టు దాఖలాలు లేవు. మూడవ అంశం– కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కింద సుమారు 16,40,000 ఎకరాలకి సాగునీటిని అందిస్తామని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే దీనికి సంబంధించి ఎలాంటి శాస్త్రీయత లేని విధంగా కాకి లెక్కలతో కూడిన గణాంకాలను చెప్పుకుంటూ వచ్చారు. ఈ సందర్భంగా 2014–2022 మధ్యకాలంలో ఎంత విస్తీర్ణం అదనంగా నీటిపారుదల కిందికి తీసుకొచ్చాము అనేది కీలకమైన అంశం. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2014 జూన్ నాటికి తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 80 లక్షల ఎకరాల విస్తీర్ణానికి వివిధ వనరుల కింద నీటిపారుదల సౌకర్యం ఉంది. 2022 నాటికీ దాదాపుగా ఇది 92 లక్షల ఎకరాలు అయినట్టు చెప్తున్నారు. అదనంగా వచ్చిన ఈ 12 లక్షల ఎకరాల నీటిపారుదల విస్తీర్ణం అన్ని ప్రాజెక్టులు, చెరువులు బోరు బావుల ద్వారా వచ్చింది. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మాత్రం అయితే కాదు. అదే విధంగా గత పది సంవత్సరాలలో బోరుబావుల సంఖ్య 15 లక్షల నుండి 29 లక్షలకు పెరిగింది. అంతేకాకుండా గత పది సంవత్సరాలలో దాదాపు 8 సంవత్సరాలు వర్షపాతం సగటు కంటే అధికంగా నమోదయింది. దీన్ని బట్టి చూస్తే అదనంగా వచ్చిన 12 లక్షల ఎకరాల సాగునీటి విస్తీర్ణం, కేవలం అదనంగా వేసిన బోరుబావుల ద్వారా వచ్చినట్టు అర్థమవుతుంది. ఈ బోరు బావులన్నీ రైతులు అప్పు తీసుకొచ్చి సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకున్నవే. దీన్నిబట్టి చూస్తే కాళేశ్వరం ప్రాజెక్టుకు పెట్టిన రూ. లక్ష కోట్లతో పాటు, ఇతర ప్రాజెక్టులపై, చెరువుల మరమ్మతు (మిషన్ కాకతీయ) కొరకు పెట్టిన వ్యయంతో కలిపితే దాదాపు లక్షా యనభై వేల కోట్ల రూపాయలు (1,80,000 కోట్లు) సాగునీటి కోసం ఖర్చుపెట్టినట్లు తెలుస్తుంది. మరి ఇంత ప్రజాధనం ఖర్చు పెట్టిన తర్వాత, అందులోనూ అప్పు తీసుకొచ్చి ఖర్చు చేసిన ఈ వ్యయం ద్వారా అదనంగా ఎంత విస్తీర్ణం నీటిపారుదల కిందికి వచ్చింది అనేది తెలపడానికి స్పష్టమైన గణాంకాలు ఎక్కడా లేవు. దీన్నిబట్టి చూస్తే గత పది సంవత్సరాలలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్ట్‌తో పాటు ఇతర ప్రాజెక్టుల ద్వారా ఎక్కడ అదనపు నీటిపారుదల విస్తీర్ణం వచ్చినట్లు దాఖలా లేదు. గత గత తొమ్మిది సంవత్సరాల్లో అదనంగా నీటిపారుదల విస్తీర్ణంలోకి వచ్చిన 12 లక్షల ఎకరాలు రైతులు వేసుకున్న బోర్ల ద్వారానే వచ్చినట్లు తెలుస్తుంది.

ఇటీవల కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలంటే మరొక 50,000 కోట్లు అవసరం ఉంటుందని స్పష్టమవుతుంది. అంతేకాకుండా ఇప్పటికే ఖర్చు చేసిన లక్ష కోట్ల పెట్టుబడికి ఎలాంటి ఫలితం రాలేదని అర్థమవుతుంది. వీటితో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అశాస్త్రీయమైనదని ఆర్థికంగా లాభసాటి కాదని స్పష్టంగా కాగ్ నివేదికలో పేర్కొనబడింది. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ఒకవేళ పూర్తయినా ఒక ఎకరానికి సాగునీరు అందించడానికి నిర్వహణ వ్యయం రూపాయలు 40 వేల నుంచి 50 వేలు అవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఏ పంట ద్వారా కూడా రైతుకు ఒక ఎకరం నుండి నికర ఆదాయం 50 వేల రూపాయలకు మించదు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ సమాజానికి ఒక గుదిబండగా మారకూడదని తెలంగాణ శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు. అయితే ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 50 వేల కోట్లు ఖర్చు పెట్టడం ఎంతవరకు సమంజసం? అంతేకాకుండా ఇక ముందు కూడా ఇది ఏమాత్రం సమాజానికి లాభసాటిగా ఉంటుందనే నమ్మకం ఎక్కడ కనిపించట్లేదు.

ఈ నేపథ్యంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఇక కాలం చెల్లినట్లే అని భావించవచ్చు. రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల దీర్ఘకాలిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఇక ఈ కాళేశ్వరం ప్రాజెక్టుపై అదనంగా ఖర్చు చేసే అంశానికి స్వస్తి చెప్పి, ఇక ముందు జరగబోయే నష్టాలను తగ్గించుకునే మార్గాలను ఎంచుకోవడం మంచిది. ఇక మిగిలినది ఒకే ఒక్క శ్రేయస్కర మార్గం– కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా నీటిపారుదల ప్రాజెక్టుగా చూడకుండా ఇది కేవలం ఒక టూరిజం హబ్‌గా, చేపల పెంపకానికి అనువైన ప్రదేశంగా అవకాశాలు వెతుక్కోవడమే.

ఒక ప్రాజెక్టు వల్ల సమాజానికి లాభం కంటే నష్టమని స్పష్టంగా తెలిసినప్పుడు, శాస్త్రీయంగా అది సాధ్యపడదని తేటతెల్లమైనప్పుడు ఇలాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత పూర్తిగా విరమించుకోవడం దీర్ఘకాలంలో సమాజానికి శ్రేయస్కరం. పూర్వపు సోవియట్ యూనియన్ అనుభవమిది. కాళేశ్వరం విషయంలో మనం ఆ అనుభవం నుంచి పాఠం నేర్చుకోవల్సిన అవసరమున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్వాపరాలు విశ్లేషించిన తర్వాత, పూర్వపు సోవియట్ యూనియన్ భారీ నదీ జలాల మరలింపు ప్రణాళిక అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు కాలం చెల్లినట్లుగా భావించాల్సి వస్తుంది. ఇక ఈ ప్రాజెక్టుపై ఎలాంటి అదనపు ఖర్చు చేయటం వృథా ప్రయాస మాత్రమే.

■ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

ఖర్చుదారీ సేద్యం కష్టాలు తీరేదెన్నడు?



■ సునీతా నారాయణ్

మట్టివాసన

'పొలంలో హలంతో రైతు /నిలుస్తొ డివాళా రేపు'– ఇది, అన్నదాత మనుగడపై ఒక మహాకవి వ్యక్తం చేసిన నిండు విశ్వాసం. అయితే రైతులు ఇప్పుడు ఎల్లెడలా పొలంలో హలంతో నిలబడలేకపోతున్నారు. అలా నిలబడేందుకే వారు పొలాలు, పల్లెలు వదిలి తమ 'భాగ్య విధాతలు' ఉండే నెలవులకు మూకుమ్మడిగా కదులుతున్నారు. జరుగుతున్న అన్యాయాలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే, సముద్రాల ఆవల ఐరోపాలోను, మన దేశంలోను ఇప్పుడు చోటు చేసుకొంటున్నది. దేశ రాజధాని న్యూఢిల్లీ బాట పట్టిన అన్నదాతలు తమ ట్రాక్టర్లతో హైవేలను దిగ్బంధం చేస్తున్నారు. వ్యవసాయ వ్యయాలు విపరీతంగా పెరిగిపోయాయి.. వాటికి తోడు వాతావరణ వైపరీత్యాలు అను నిత్యం కల్లోల పరుస్తున్నాయి. పంటపండించిన రైతుకే తిండిలేకుండా పోతున్న దుస్థితి దాపురించింది. కనుక సాగు వ్యయాలు తిరిగి దక్కేలా తమ ఫలసాయానికి చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ఇవ్వాలని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.

వాతావరణ మార్పు వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలలో ప్రవేశపెట్టిన కొత్త చట్టాలు అక్కడ రైతులను ఆందోళనకు పురిగొల్పాయి. ఆ కొత్త చట్టాల ప్రకారం క్రిమిసంహారక మందుల వాడకాన్ని సగానికి, ఎరువుల వినియోగాన్ని 20 శాతం మేరకు తగ్గించాలి. సేంద్రియ సాగు ఉత్పత్తులను రెట్టింపు చేయాలి. వ్యవసాయేతర ఉపయోగాలకు, ముఖ్యంగా జీవ వైవిధ్య పరిరక్షణకు మరింత భూమిని వదిలివేయాలి. ఇందుకు అదనంగా నత్రజని కారక కాలుష్యాన్ని నివారించేందుకు పశుగణాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని నెదర్లాండ్స్ సంకల్పించుకోగా శిలాజ ఇంధనమైన డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీని తగ్గించుకోవాలని జర్మనీ నిర్ణయించింది. వాతావరణ మార్పుతో మనుగడ ముప్పు నెదుర్కొంటున్న ప్రపంచం ప్రస్తావిత చర్యలను తీసుకోవడం అనివార్యమయింది.

యూరోపియన్ దేశాలలో వ్యవసాయ రంగం, ప్రపంచ వ్యాప్తంగా ఇతర ఖండాలలో వలే, హరిత గృహ వాయువుల ఉద్గారాలకు పెద్ద ఎత్తున కారణమవుతోంది. ఐరోపాలో వార్షిక ఉద్గారాలలో పదో వంతు వ్యవసాయ రంగానివే కావడం గమనార్హం. ఈ ఉద్గారాలను తగ్గించేందుకు అయ్యే వ్యయాలు యూరోపియన్ సంపన్న రైతులకు భరించరానివే అయినప్పుడు కేవలం జీవనాధార వ్యవసాయం చేస్తున్న ఆసియా, ఆఫ్రికా దేశాల రైతులు ఆ వ్యయాలను ఎలా భరించగలుగుతారు? అధునాతన సేద్య తీరుతెన్నులన్నీ యూరోపియన్ వ్యవసాయ రంగంలో మనకు కన్పిస్తాయి. భారీ సబ్సిడీల ఆలంబనగా ఆ వ్యవసాయం వర్ధిల్లుతోంది. 1962 నుంచి యూరోపియన్ యూనియన్ ఉమ్మడి వ్యవసాయ విధానం రైతులకు విశేషంగా ఆర్థిక తోడ్పాటును సమకూరుస్తోంది. అయితే దీనిపై పలు విమర్శలు రావడంతో ఆ ఆర్థిక మద్దతును గణనీయంగా తగ్గించడం అనివార్యమయింది.

నేడు యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యవసాయ రంగానికి సమకూరుస్తున్న ఆర్థిక మద్దతు ఈయూ బడ్జెట్‌లో 40 శాతం మేరకు ఉంటోంది. ఈ సహాయాన్ని రైతులకు నేరుగా చెల్లిస్తున్నారు. యూరోపియన్ కమిషన్ సమాచారం ప్రకారం ప్రతి రైతూ 2021లో 6700 యూరోలు (ఇంచుమించు రూ.50 వేలు) నేరుగా అందుకున్నాడు. ఈ సహాయంతో పాటు వ్యవసాయరంగ అభివృద్ధికి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం కూడ జరుగుతోంది.. అనేక సంవత్సరాలుగా వ్యవసాయ 'స్వరూప స్వభావాలు' మారుతూ వస్తున్నాయి. వ్యవసాయ కమతాలు విస్తీర్ణంలో పెరుగుతున్నాయి. మరింతగా సమీకృతమవుతున్నాయి. ఉత్పాదకాల ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో చిన్న రైతుల మనుగడ కష్ట సాధ్యమవుతోంది.

సాగు వ్యయాలు పెరిగిపోవడంతో పెద్ద రైతుల సైతం రుణగ్రస్తులు అవుతున్నారు. పైరు సగటు దిగుబడి పెరుగుదల లక్ష్యంగా సేద్యం జరుగుతోంది. ఇందుకు రసాయన ఎరువులను మరింతగా వినియోగించడం అనివార్యమవుతోంది. దీనికి తోడు వాతావరణ అవ్యవస్థతో పంటల సాగు ఖర్చులు తడిపిమోపెడవుతున్నాయి. పెరిగిన సాగు వ్యయాలలతో పాటు మరో రెండు వాస్తవాలను తప్పక ప్రస్తావించి తీరాలి. అవి : ఒకటి– ఆహార వినియోగ ధరలను అదుపులో పెట్టవలసిన ఆవశ్యకత; రెండు– వాతావరణ వైపరీత్యాలతో పంట నష్టాలు పెరిగిపోవడం. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో సైతం ఆహార ధరలు అందరికీ అందుబాటులో ఉండడం లేదన్నది ఒక కఠోర వాస్తవం. అంతకంటే ముఖ్యమైన వాస్తవం ఆ దేశాలలో పర్యావరణ సమతౌల్యత తీవ్రంగా దెబ్బ తింటోంది.

దేశ రాజధాని ఢిల్లీ ముంగిట నిరసనలు తెలుపుతున్న రైతులు తమ పంట దిగుబడులకు అధిక కనీస మద్దత ధర (ఎమ్ఎస్‌పి)ను డిమాండ్ చేస్తున్నారు. సంపన్న యూరోప్‌లో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లనే వీరూ ఎదుర్కొంటున్నారు. అయితే ఆహార ధాన్యాల సాగు విషయంలో యూరోపియన్ రైతులకు లభిస్తున్నట్టుగా భారతీయ రైతులకు ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఆర్థిక మద్దతు లభించడం లేదు. దేశ ప్రజానీకానికి ఆహారాన్ని సమకూర్చేందుకై రైతుల నుంచి ఆహారధాన్యాలను ప్రభుత్వం సేకరించివలసివున్నది. ధరలను నియంత్రించేందుకు ఇది తప్పనిసరి ; ఆహార ధరల పెరుగుదలను ఎవరు కోరుకుంటారు? వినియోగదారులు ఎవరూ కోరుకోరు కదా. ఖర్చులు భరించేందుకు రైతులు ఒక పక్క ఇబ్బంది పడుతుండగా మరో పక్క వాతావరణ వైపరీత్యాలు, చీడ, తెగుళ్ల మూలంగా ఆర్థిక నష్టాలు, ఇతర చిక్కులకు లోనవుతున్నారు.

ఆహార ధరల పెరుగుదలను అరికట్టేందుకు చౌక దిగుమతులపై ఆధారపడాలి. వీటి వల్ల ధరలు తగ్గుతాయి. నిజమే. అయితే తమ ఉత్పత్తులకు సరైన ధర లభించక పోతే రైతులు నష్ట పోతారు. ఈ పరిస్థితుల్లో భూసార పెంపుదల, నీటి సదుపాయాల మెరుగుదల, జీవ వైవిధ్య పరిరక్షణకు రైతులు ఏమీ ఖర్చు చేయలేరు ఈ సమస్యను అధిగమించడమెలా అంటే పర్యావరణ భద్రతలకు అయ్యే వ్యయాలను మినహాయించుకోవడమే..వ్యవసాయం లాభదాయకంగా ఉండాలంటే ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరమున్నదని రైతులకు చెబుతున్నారు. అయితే విత్తనాలు, ఎరువుల మొదలైన ఉత్పాదకాల వ్యయం తక్కువేమీ కాదు కదా. కనుక రైతులు అధిక ఖర్చులను భరించవలసిస్తోంది. ఖర్చులకు తగ్గ ఆదాయం వారికి లభించడం లేదు. జనాభాలో అత్యధికులకు ఆహారం చౌకగా అందుబాటులో ఉండాల్సిన దేశంలో అధిక వ్యయాలతో కూడిన వ్యవసాయం అర్థవంతమైన, లాభదాయకమైన కార్యకలాపం కాదు, కాబోదనేది కూడా విస్మరించకూడని సత్యం.

ఐరోపాలో ఇచ్చిన స్థాయిలో మన దేశంలో రైతులకు



> ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరమున్నదని రైతులకు చెబుతున్నారు. విత్తనాలు, ఎరువుల మొదలైన ఉత్పాదకాల వ్యయం తక్కువేమీ కాదు. ఫలితంగా రైతులు పంటల సాగుకు అధిక ఖర్చులను భరించవలసి వస్తోంది. ఖర్చులకు తగ్గ ఆదాయం వారికి లభించడం లేదు. జనాభాలో అత్యధికులకు ఆహారం చౌకగా అందుబాటులో ఉండాల్సిన దేశంలో అధిక వ్యయాలతో కూడిన వ్యవసాయం అర్థవంతమైన, లాభదాయకమైన కార్యకలాపం కాదు, కాబోదనేది కూడా విస్మరించకూడని సత్యం.

సబ్సిడీలు ఇవ్వడం సాధ్యంకాదు. పెద్ద మొత్తంలో రైతులకు ఆర్థిక మద్దతు సమకూర్చడం సాధ్యంకాదనేది స్పష్టమే. సాగు వ్యయాలను తగ్గిస్తూనే రైతులకు ఆర్థిక లబ్ధి సమకూర్చడమెలా అనే విషయమై మనం చర్చించవలసి ఉన్నది. ఇక్కడే పునరుత్పాదక లేదా సహజ సేద్యం ప్రాధాన్యాన్ని గుర్తించవలసివున్నది. అయితే ఇందుకు పటిష్ఠ ప్రగతిశీల విధాన నిర్ణయాలు, చిత్త శుద్ధితో వాటిని అమలుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

అన్ని ప్రాంతాలలోను ఆహార సేకరణకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తగు విధానాలను రూపొందించి, అమలుపరచడం కూడా ఎంతైనా అవసరం. తద్వారానే రైతుల ఉత్పత్తులకు మంచి మార్కెట్ సదుపాయం లభిస్తుంది. మధ్యాహ్న భోజన పథకానికి ఒడిషా ప్రభుత్వం చిరుధాన్యాలను సేకరిస్తోంది. ఇది రైతులకు విశేషంగా మేలు చేస్తుందనడంలో సందేహం లేదు. వాస్తవమేమిటంటే సమస్త ప్రజల అవసరాలను తీర్చగల ఆహారం ప్రపంచంలో సమృద్ధిగా ఉన్నది. సమస్యేమిటంటే ఆ ఆహారంలో అత్యధిక భాగం పశుగణాలకు వినియోగమవుతోంది లేదా వ్యర్థమవుతోంది. లభ్యమవుతున్న ఆహారం ప్రజల అవసరాలకు సద్వినియోగమయ్యేలా విధానాలు రూపొందించి, అమలుపరచడంపై ప్రభుత్వాలు తమ దృష్టిని కేంద్రీకరించవలసివున్నది.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

వందేళ్ల నల్గొండ ఆర్యసమాజ్

దేశంలో అనేక సంఘ సంస్కరణలు ఆర్యసమాజ్ కేంద్రంగా అమలయ్యాయి. సాధారణ ప్రజల్లోనూ మూఢనమ్మకాలు, అసాంఘిక కట్టుబాట్లపై ఆర్యసమాజ్ కేంద్రంగా పలు ఉద్యమాలు జరిగాయి. ఆర్యసమాజాన్ని 1875 ఏప్రిల్ 10న బొంబాయి (ముంబాయి)లో మహర్షి స్వామి దయానంద సరస్వతి స్థాపించారు. హిందూ ధర్మాన్ని అన్ని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, వేదాలకు దగ్గరగా తీసుకెళ్ళడమే ఆర్య సమాజం ముఖ్య ఉద్దేశం. ముంబాయిలో ప్రారంభమైన సుమారు 50 ఏళ్ల అనంతరం, నల్లగొండ పట్టణంలో 1924లో ఆర్య సమాజాన్ని షేర్ బంగ్లాలో ప్రారంభించారు.

నల్లగొండలో జరిగిన నిజాం విముక్తి పోరాటంలో ఆర్య సమాజ్ ముందు వరసలో నిలిచింది. జిల్లాలోని ప్రముఖ కమ్యూనిస్టు యోధులైన ధర్మభిక్షం కూడా ఆర్యసమాజ్ బాధ్యులుగా ఉన్నారు. సంఘ సంస్కరణ, సమాజ పరివర్తన, హిందూ ధర్మ రక్షణలో కీలక పాత్ర వహించిన ఆర్య సమాజం విగ్రహారాధన, మూర్ఖపు మతాచారాలు, కుల, లింగ భేదాలను తీవ్రంగా వ్యతిరేకించింది. అందరూ వేదాలు చదవాలని, ఆడవాళ్ళు కూడా మగవాళ్ళతో సమానంగా చదువుకోవాలని పాఠశాలలు ఏర్పాటు చేసింది. మొట్టమొదటి 'స్వదేశీ' పదాన్ని వాడింది ఆర్య సమాజమే.

> నల్లగొండలో జరిగిన నిజాం విముక్తి పోరాటంలో ఆర్య సమాజ్ ముందు వరసలో నిలిచింది. జిల్లాలోని ప్రముఖ కమ్యూనిస్టు యోధులైన ధర్మ బిక్షం కూడా ఆర్యసమాజ్ బాధ్యులుగా ఉన్నారు. సంఘ సంస్కరణ, సమాజ పరివర్తన, హిందూ ధర్మరక్షణలో కీలక ప్రాత వహించిన ఆర్య సమాజం విగ్రహారాధన, మూర్ఖపు మతాచారాలు, కుల లింగ భేదాలను తీవ్రంగా వ్యతిరేకించింది.



కుల దురాచారాలను వ్యతిరేకించే వారంతా కూడా అప్పట్లో ఆర్య సమాజాన్ని సమర్థించారు. కొమర్రాజు కోటేశ్వరరావు నల్లగొండలో ఆర్య సమాజాన్ని నడిపించడంలో గొప్ప పాత్ర పోషించారు. ఆర్య సమాజం షేర్ బంగ్లాలో ఉండేది. నల్లగొండ వాస్తవ్యులు బలిజ బొంతయ్యని హరిద్వార్ పంపి సంస్కృతం, వేదాలు చదివించి పండిత భద్రదేవ్‌గా నల్లగొండలో ఆర్య సమాజ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. 1922లోనే గ్రంథాలయం కూడా స్థాపించి పుస్తక పఠనానికి అవకాశం కల్పించారు. ఆడపిల్లలకు స్కూల్ నడిచేది. వాళ్ళకు అక్కడ చదువుతో పాటు కర్రసాము, కత్తి సాము కూడా నేర్పేవారు. పండిత భద్రదేవ్, మాత వేదవతిలు కలిసి అనేక కార్యక్రమాలు చేసినారు.

1938లో ఆల్ ఇండియా ఆర్య సమాజ్ మీటింగ్ నల్లగొండలో పెద్ద ఎత్తున నిర్వహించారు. 1965లో బాలికల పాఠశాల కోసం చందాలు కలెక్ట్ చేసి (1943లో రామగిరిలో పులిజాల రంగారావు గారి దగ్గర కొన్నభూమిలో) గదులు కట్టించారు. మొదట కట్టినవి గవర్నమెంట్ బాయ్స్ హైస్కూలుకి ఇచ్చారు. తరువాత కట్టినవి గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూలుకి ఇచ్చారు. నల్లగొండ పట్టణానికి చెందిన దివంగత దోమలపల్లి యాదగిరి రావు ఆర్యసమాజానికి, ఆర్య సమాజం ఆధ్వర్యంలో పేదలకు విద్యను అందించేందుకు గాను ఈ కొనుగోలు చేసిన భూమిని దానం చేశారు. అదే భూమిలో నల్లగొండకు మేధావులనందించిన రామగిరి బాలుర, బాలికల పాఠశాలలను ఏర్పాటు చేశారు. వెంకట నారాయణ ప్రెసిడెంట్‌గా ఉండగా రామగిరిలో ఆర్య సమాజం మందిరం నిర్మితమైనది. శ్రీవిశ్వామిత్ర, మాతల ఆధ్వర్యంలో పెళ్ళిళ్ళు, ఉపనయనాలు, సమావేశాలు, సత్సంగాల నిర్వహణ ప్రారంభమైంది. ఆర్యసమాజానికి కొమర్రాజు మురిధార్ రావు దాదాపు 20ఏళ్ల పాటు అధ్యక్షులుగా ఉండి విశేష సేవలందించారు. వీరి హయాంలో ఆర్య సమాజ్ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడారు. అవసరమైతే న్యాయస్థానాలకు సైతం వెళ్లారు. కొన్నేళ్లుగా నిలిచిపోయిన, పాత బస్తీ ఆర్యసమాజ్ నుంచి రామగిరి ఆర్యసమాజ్ వరకు ప్రతీ దసరాకు జరిగే శోభాయాత్రను కొమర్రాజు మురళీధర్ రావు పునరుద్ధరించారు.

ఆ తరువాత బీద పిల్లలకు 5వ తరగతి దాకా పాఠశాల, కరాటే, వారం వారం యజ్ఞం, సమావేశాలు నిరంతరం జరిగేవి. ఫ్యూడల్ పాలనను వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలోనూ ఆర్య సమాజం పాత్ర కీలక పాత్రనే పోషించింది. ఒకవైపు మత మార్పిడిలను కట్టడి చేస్తూనే మరోవైపు సాంఘిక దురాచారాలను రూపు మాపడంలో ఆర్య సమాజం కృషి చేసింది. నల్లగొండలో ప్రతి దసరాకు షేర్ బంగ్లా ఆర్య సమాజం నుంచి రామగిరి ఆర్య సమాజ మందిరం దాకా ఒక నగర ప్రముఖుడిని గుర్రంపై ఆసీనులు చేయించి శోభాయాత్ర నిర్వహిస్తారు. అదొక గొప్ప వేడుకగా నిలిచింది.

నల్గొండ ఆర్యసమాజ్ శత జయంతి ఉత్సవాలను మార్చి 1, 2, 3 తేదీలలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా స్వామి రాందేవ్ బాబా హాజరుకానున్నారు. ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్య సమాజం వ్యవస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి ద్విశత జన్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. మహాసభల ప్రారంభం రోజున తలపెట్టిన చారిత్రాత్మకమైన మహాయజ్ఞంలో స్వామి ప్రణవానంద సరస్వతి పాల్గొననున్నారు.

○ కన్నెకంటి వెంకట రమణ

నీటి పేరిట ఆనాటి దోపిడీ ప్రజలకు అర్థమైంది!

యావత్ తెలంగాణ ప్రజల సాక్షిగా గత పదేళ్ల కేసీఆర్ పాలనలో నీళ్లు, నిధుల దోపిడీ ఏందో కళ్ళకు కట్టినట్టు చూపించారు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ నేతలు ఎంత దబాయించినా ఎప్పటికైనా ప్రజా కోర్టులో దోషిగా నిలబడతారనేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల ఇరిగేషన్ ప్రాజెక్టు నిదర్శనం.

మిగులు నిధులతో ఏర్పడిన తెలంగాణ సంపదను కాజేసి అప్పుల ఊబిలోకి నెట్టిన అపార అవినీతి భగీరథుడు కేసీఆర్. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కట్టినాక అధిక వర్షాల ద్వారా గోదావరి వరద నీరే ఎక్కువగా సాగుకు అందింది కానీ ఈ ఎత్తిపోతల ద్వారా సాగు నీరు పెద్దగా అందింది లేదు. పైగా గోదావరి వరద పెరిగినప్పుడు కాళేశ్వరం మొత్తం మునిగిన తీరు చూస్తే ఏదో ఒక రోజు ప్రకృతి విపత్తులకు కొట్టుకపోయే ప్రాజెక్టుగానే కనిపించింది. కొద్దిపాటి వరదలకు జరిగిన నష్టం భరించడానికే శ్రమించాల్సి వచ్చిందంటే ఆ ప్రాజెక్టు కట్టిన ప్రాంతం అనువైనది కాదనే అర్థం కదా. ఏదైనా ఒక ప్రాజెక్టు కట్టాలంటే దానికి పెట్టిన పెట్టుబడికి కనీసం ఒకటిన్నర రేట్లు రాబడి రావాలన్నది సూత్రం. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల రాబడి కంటే పెట్టుబడే పెనుభారమైంది. వ్యయం, లాభం నిష్పత్తి 1:1.5గా ఉండాలి. కానీ 2:1గా ఉంది. ఇలాంటి నాసిరకమైన ప్రాజెక్టులు కట్టి భారీ నష్టాన్ని తెచ్చిన సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకొని డబ్బును రికవరీ చేయాలి.

> కుంగిన మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని చూసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే, పదేళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ మాట్లాడిన భాష సభ్యసమాజం అసహ్యించుకునే విధంగా ఉంది. చరిత్రను కొత్తగా నిర్మించే నాయకునిగా ఎదగాలి కానీ భాషను మలినం చేసి, తోటి నాయకులను, పార్టీలను హేళన చేసిన నాయకునిగా మిగలరాదు.


కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో జరిగిన లోపాలను కాగ్ రిపోర్టు, దాని సందర్భించిన డ్యామ్ సేఫ్టీ బృందం నివేదిక సైతం గత పాలకులను దోషులుగానే చూపించాయి. జరిగిన లోపాలను సవరించుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన బీఆరఎస్ పార్టీ, ఇరిగేషన్ శాఖను తన వద్ద ఉంచుకున్న కేసీఆర్, గతంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావులు ఇంకా బహిరంగ సభలు పెట్టి తెలంగాణ సమాజాన్ని మసిపూసి మారేడు కాయ చేయాలని ప్రయత్నించడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఎన్నికల కంటే ముందే కుంగిన మేడిగడ్డ బ్యారేజ్‌తో పాటు మిగతా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా నిర్మాణ లోపాలతో నాసిరకమైన పనులతో హడావిడిగా నిర్మించటం వలన పెచ్చులు ఊడిపోయే విధంగా ఉన్నాయి. ఈ పిల్లర్లను నిర్మించిన కాంట్రాక్టర్లకు, నిర్మాణ సంస్థకు లక్ష కోట్ల డబ్బులు ఇచ్చి తెలంగాణ సమాజం నీటి కష్టాలను కొనుక్కున్నట్లయింది. లక్ష 47 వేల కోట్లకు పైగా ఖర్చుపెట్టి దోచుకున్న బంగారు బాతు లాంటి ప్రాజెక్టు పేరే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు.

కృష్ణ, గోదావరి నదుల నీటి పంపకాలలో ఉద్యమ సమయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని రైతులను, ప్రజలను పోగుచేసి గట్టిగా మాట్లాడిన ఈ ఉద్యమ నాయకుడు తెలంగాణ వచ్చిన తర్వాత ఆ నీటి పంపకాల విషయంలో తన వాగ్ధాటిని కొనసాగించలేకపోయాడు. నీటి వాటాలో, పోలవరం ప్రాజెక్టు వల్ల కోల్పోయిన భూముల విషయంలో, ఖమ్మంలో ఏడు ముప్పు మండలాల విషయంలో చేతకానివాడయ్యాడు. కృష్ణా గోదావరి నదులలో 50శాతం వాటా నీటిని పొందాల్సిన తెలంగాణ 30శాతం నీటిని కూడా సరిగ్గా వాడుకోలేపోయింది. దీన్ని బట్టి నీటి పంపకాలలో గత పదేళ్ళల్లో కేసీఆర్ చూపించిన చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతుంది. కృష్ణ, గోదావరి నదీజలాలలో 50శాతం వాటా పాటించాలని కేసీఆర్ ఏ రోజూ బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసి అడగలేదు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలలకే నీటి పంపకాలలో బాధ్యత మొత్తం కేంద్రానికి అప్పగించిందని తప్పుడు ప్రచారం చేస్తూ తప్పించుకోవాలని చూస్తున్నారు. నీళ్లను, నిధులను దోపిడీ చేసింది ఎవరో తెలంగాణ సమాజానికి ఈపాటికి అర్థమైంది.



నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కుంగిన మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని చూసేందుకు నిపుణులతో కలిసి వెళ్తే, పదేళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ మాట్లాడిన భాష పట్ల సభ్యసమాజం అసహ్యించుకునే విధంగా ఉంది. ఒక ముఖ్యమంత్రిని పట్టుకొని "ఏం పీకడానికి వెళ్తావు" అనడం ఇంకో మాజీ ముఖ్యమంత్రి అనాల్సిన మాటేనా? చరిత్రను కొత్తగా నిర్మించే నాయకునిగా ఎదగాలి కానీ, భాషను మలినం చేసి, తోటి నాయకులను, పార్టీలను హేళన చేసిన నాయకునిగా మిగలరాదు.

• డాక్టర్ మండ్ల రవి
ఉస్మానియా యూనివర్సిటీ



మెగా డీఎస్సీతో ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 1,519 పోస్టులు

- మిగిలిన ఖాళీలనూ భర్తీ చేయాలంటున్న అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపికలు చేయాలని డిమాండ్

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీకి ముఖ్యమంత్రి గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగార్థుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ప్రభుత్వం వెల్లడించిన నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 1,519 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. మరోసారి టెట్ నోటిఫికేషన్ వేసిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే బాగుండేదని కొంత మంది బీఈడీ, డీఈడీ అభ్యర్థులు వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటే, ఎంతో కాలంగా విద్యాశాఖలో పని చేస్తున్న ఇంక్లూసివ్ రీసోర్స్ పర్సన్స్(ఐఆర్పీ)లకు డీఎస్సీలో వెయిటేజీ మార్కులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం కాలయాపన చేయకుండా త్వరితగతిన భర్తీల ప్రక్రియను పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరాన్ని నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో విద్యా సంవత్సరాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉండగా ప్రభుత్వం 11,062 పోస్టులను మాత్రమే భర్తీ చేయనుండటంతో అభ్యర్థులు ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.


చాలా సంవత్సరాల తర్వాత..

2012లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మెగా డీఎస్సీ కోసం అభ్యర్థులు ఎదురు చూడగా.. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం టీఆర్టీ ద్వారా స్వల్ప సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. అనంతరం గత సంవత్సరం 2023లో గత ప్రభుత్వం 5 వేల పైచిలుకు పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో అప్పటి డీఎస్సీ నోటిఫికేషన్ భవితవ్యం మరుగున పడింది. కాగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మరో 6 వేల ఖాళీలను కలుపుతూ మొత్తం 11,062 పోస్టులకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపిక చేయాలి...

ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీచేయడాన్ని ఉద్యోగార్థులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో కొంత గందరగోళంలో ఉన్నారు. జోన్ల వారీగా కాకుండా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన డీఎస్సీ ఎంపికలు

మిగతా 7వ పేజీలో..



ఎదురుదాడే లక్ష్యం!

బీఆర్ఎస్ మేడిగడ్డ పర్యటన ఆంతర్యమిదే..

- కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టేలా కార్యాచరణ
- నేటి కేటీఆర్ బృందం పర్యటనపై సర్వత్రా ఆసక్తి
- 39 మంది ఎమ్మెల్యేలతోపాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎంపీల రాక



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న పుట్ట మధు, బాల్క సుమన్

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి) / మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 29 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు లోపభూయిష్టమని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడుతున్న బీఆర్ఎస్ నేతలు ఎదురుదాడే లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్నారు. సీఎం, మంత్రులు సహా కాంగ్రెస్ నేతల మాటలను తిప్పి కొట్టడమే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి ఎదురుదాడి వ్యూహానికి పదును పెడుతోంది. ఇటీవల కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ పర్యటించి గత ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలను.. నిర్మాణాల్లో చోటు చేసుకున్న అక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆత్మరక్షణలో పడిన బీఆర్ఎస్ నేతలు ఎన్నికల ముందు డ్యామేజ్ కంట్రోల్ కోసం పోటీ యాత్రలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలో సుమారు 39 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎంపీలు.. ఇతర ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీను సందర్శించి వాస్తవాలను చెప్పే ప్రయత్నం చేస్తామంటోంది. ప్రభుత్వం మారిన నాటి నుంచే మేడిగడ్డ ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల్ల మధ్య యుద్ధం మొదలవగా ప్రాజెక్టులో దెబ్బతిన్న 19, 20, 21 పిల్లర్లను మరమ్మతు చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పంతానికి పోయి ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నది గులాబీ నేతల వాదన. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రాజెక్టు వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు గత ప్రభుత్వంపై విమర్శలను తీవ్రతరం చేస్తూ ఉండడంతో బీఆర్ఎస్ ఎదురుదాడి చేయడం ద్వారానే కాంగ్రెస్ ప్రచారాలను తిప్పి కొట్టాలన్న అజెండాతో కార్యచరణ సిద్ధం చేసుకున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో మేడిగడ్డ ప్రాజెక్టు వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రాజెక్టు భద్రతపై డ్యామ్ సేఫ్టీ నిపుణుల బృందం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన నేపథ్యంలో కేటీఆర్ బృందం చేపడుతున్న మేడిగడ్డ పర్యటన రాజకీయంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. శుక్రవారం ఉదయం 8.30గంటలకు హైదరబాద్ నుంచి బయలుదేరనున్న బీఆర్ఎస్ బృందం మధ్యాహ్నం 12గంటలకు భూపాలపల్లికి చేరుకోనుంది. మధ్యాహ్న భోజనం అనంతరం 2గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంటారు. సుమారు గంటపాటు పరిశీలన అనంతరం మధ్యాహ్నం 3గంటలకు అన్నారం బ్యారేజీ చేరుకొని కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలు, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి.. మీడియాతో మాట్లాడనున్నారు.

పర్యటనపై సర్వత్రా ఆసక్తి..

శుక్రవారం బీఆర్ఎస్ నేతల మేడిగడ్డ ప్రాజెక్టు యాత్రపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ ప్రాజెక్టు లోపాలు, భద్రత, జరిగిన అవినీతిపై సాక్ష్యాలతో మీడియాకు వెల్లడించిన నేపథ్యంలో దానికి కౌంటర్‌గా శుక్రవారం కేటీఆర్ బృందం ఏం చెప్పబోతోందన్నది అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏర్పడిన పగుళ్లకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లక్ష్యంగా చేస్తూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శల దాడిని కేటీఆర్ నేడు ఎలా తిప్పుకొట్టబోతున్నారన్నదానిపై చర్చ జరుగుతోంది. అయితే గులాబీ నేతల ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నిశితంగా గమనిస్తుందని అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు గడువు దగ్గర పడడంతో రెండు పార్టీల మధ్య ప్రాజెక్టులపై విమర్శల యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల రాజకీయమంతా కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టే కొనసాగే పరిస్థితి కనిపిస్తుండడంతో ఈ పోటాపోటీ పర్యటనలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీలో ఒక్క పిల్లర్ కుంగిపోతే అసలు కాళేశ్వరం ప్రాజెక్టే పనికిరాకుండా పోయిందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టేందుకే కేటీఆర్ బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనుందని తెలిపారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టులోని భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, పార్టీ మహదేవపూర్ మండల అధ్యక్షుడు లింగంపెల్లి శ్రీనివాస్‌రావు, నాయకులు శ్రీపతి బాపు, అలీంఖాన్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కడియం నివాసంలో బీఆర్ఎస్ నేతల భేటీ

- ఏర్పాట్లు, విజయవంతంపై చర్చ



కడియం నివాసంలో భేటీ అయిన నేతలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 29 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ విషప్రచారం చేస్తోందంటున్న బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రచారాన్ని తప్పికొట్టేందుకు ప్రాజెక్టు సందర్శన చేపట్టింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తరలిరానుండగా.. ఈ కార్యక్రమ విజయవంతానికి ఉమ్మడి వరంగల్ నేతలు ఏర్పాట్లు చేశారు. దీనిపై గురువారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని తన నివాసంలో ఉమ్మడి జిల్లా నేతలు.. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, నేతలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చూపుతామని, ప్రాజెక్టును రాజకీయం కోసం వాడుకుంటున్న కాంగ్రెస్ బండారం బయటపెడతామన్నారు. కాగా, హైదరాబాద్ నుంచి బస్సులో వస్తున్న కేటీఆర్‌ను వరంగల్ నేతలు జనగామ సమీపంలో నెల్లుట్ల వద్ద ఉదయం 10 గంటలకు స్వాగతం పలికి ర్యాలీగా మేడిగడ్డకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ పర్యటనకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు తరలనున్నారు.

ప్రావీణ్యకు బల్దియా బాధ్యతలు

- ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వరంగల్ కలెక్టర్



బాధ్యతలు చేపడుతున్న ప్రావీణ్య

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 29 : వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బల్దియా కమిషనర్‌గా ఉన్న షేక్ రిజ్వాన్ బాషా జనగామ జిల్లా కలెక్టర్‌గా వెళ్లిన సంగతి విధితమే. పూర్తి స్థాయిలో కమి షనర్ నియమితులవుతారని భావించి నా ఆ మేరకు ప్రభుత్వం నిర్ణ యం తీసుకోలేదు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్‌గా పని చేసిన ప్రావీణ్య వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం ప్రావీణ్యకే అదనపు బాధ్యతలను కేటాయించింది.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

మేడారం హుండీల లెక్కింపు

ప్రారంభం

- పది రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- ప్రక్రియలో 350మంది సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు
- పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు
- అంబేద్కర్ బొమ్మ ఉన్న నకిలీ నోట్లు ప్రత్యక్షం
- తొలిరోజు రూ.3.15 కోట్లకుపైగా ఆదాయం రాక

మాకో ఎంపీ టికెట్ ఇవ్వాలి!

- బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నామన్న భ్రమలోనే ఉన్నారు
- రాముడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్న బీజేపీ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సుబేదారి, ఫిబ్రవరి 29 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ధర్మంలో భాగంగా తమకో ఎంపీ టికెట్ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు అధికారంలేకపోయే సరికి జీర్ణించుకోలేక ఏదిపడితే అది మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణులు ఏది చెబితే అది చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పారని, నిపుణులు త్వరగా తేల్చితే పరిష్కారం దొరుకుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోనే లోపాలున్నాయని స్వయంగా కాగ్ రిపోర్టులోనే ఎత్తిచూపారని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ ప్రజలకు ఏం సమాధానం చెపుతుందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద రూ.28వేల కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తే గ్రావిటీ ద్వారా 16 లక్షల ఎకరాలకు నీరందేదని, నేడు రూ. 93 వేల కోట్లతో కాళేశ్వరం నిర్మించినా సాధించిదేమి లేదన్నారు. గడిచిన సింగరేణి ఎన్నికలలో ఏఐటీయూసీ గెలవడంతో పాటు ఆర్టీసీ, బ్యాంకు తదితర అనేక రంగాలలో బలంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతం పేరుతో రెచ్చగొడుతూ, రాముడి పేరు చెప్పుకుంటూ ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తుందని, 5 వేల ఏళ్ల క్రితమే రాముడి చరిత్ర ఉందని కొత్తగా బీజేపీ సాధించిందేవిలేదన్నారు. బీజేపీ ఏం చేసినా వచ్చే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమ చేయడం లాంటివి నెరవేర్చకుండా ప్రజలకు అబద్ధాలు చెప్పి బావోద్వేగాలు రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకులు బి. విజయసారధి, నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతి, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మీ, తోట భిక్షపతితో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ నిర్మాణ పనులను ప్రారంభించండి

- మేయర్ గుండు సుధారాణి



ఎఫ్‌టీపీ నిర్మాణ స్థల పరిశీలనలో గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 29 : వరంగల్ రామన్నపేటలో నిర్మించనున్న ఎఫ్‌టీపీ (మురుగు నీటి శుద్ధికరణ కేంద్రం) పనులను వెంటనే ప్రారంభించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం 29వ డివిజన్‌లోని రామన్నపేటలో నిర్మించే ఎఫ్‌టీపీ స్థలాన్ని ఆమె క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా రామన్నపేట ప్రాంతంలో పైలెట్ బేస్‌గా ఎఫ్‌టీపీని నిర్మించనున్నట్లు తెలిపారు. ముంబాయికి చెందిన అగ్రోమార్ఫ్ టెక్నాలజీ సొల్యుషన్స్ ఆధ్వర్యంలో ప్లాంట్ నిర్మాణం జరుగనున్నట్లు తెలిపారు. అల్గ్ బేస్డ్ టెక్నాలజీతో ప్రతీరోజు 1500 లీటర్ల మురుగు నీటిని శుద్ధికరించవచ్చన్నారు. సంవత్సరం పాటు ట్రాయల్ రన్ అనంతరం ఫలితాల ఆధారంగా నగరంలోని మిగితా డివిజన్‌లలో ప్లాంట్ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కి ప్రతినిధులు డాక్టర్ రాజ్‌మోహన్‌రెడ్డి, అవినాష్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమైయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 53 కేంద్రాల్లో ఇంటర్ జనరల్‌లో 17,357 మంది విద్యార్థులకుగాను 16,947 మంది హాజరయ్యారు. 410 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 898 మందికిగాను 862 విద్యార్థులు హాజరుకాగా 36 మంది గైర్హాజరైనట్లు హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈవో) ఏ.గోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ద్వితీయ సంవత్సరం 18255 మంది విద్యార్థులకు 17809 హాజరు కాగా, 446 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు డీఐఈవో తెలిపారు.

అందివచ్చిన 'ఆయుర్వేదం'

వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

అందుబాటులోకి టి-డయాగ్నస్టిక్ సేవలు

ఆర్‌టీఏ అధికారుల స్పెషల్ డ్రైవ్

పేరుకుపోయిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ



కాశోజీ జంక్షన్, ఫిబ్రవరి 29 : మోటారు వాహనదారులు తీసుకోకుండా కార్యాలయంలో పేరుకుపోయిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీకి ఆర్‌టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇటీవల హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పుప్పాల శ్రీనివాస్, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వాహనదారులకు సత్వర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

వాహనదారులకు పంపిణీ కాకుండా కార్యాలయంలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న సర్టిఫికెట్లను గమనించిన ఆయన వెంటనే వాహనదారులకు వాటిని చేర్చేందుకు చర్యలకు ఉపక్రమించారు. సర్టిఫికెట్లను పరిశీలించగా అవి పోస్టులో వెళ్లి అడ్రస్‌దారులు అక్కడ నివసించడం లేదని వాపస్ వచ్చిన సుమారు 4 వేలకు పైగా సర్టిఫికెట్లు కనుగొన్నారు. ఆ సర్టిఫికెట్లను ప్రత్యేక కార్యక్రమం ద్వారా వారికి అందజేయాలని తలపెట్టారు. మార్చి 1 నుంచి నెలాఖరు వరకు సంబంధిత సర్టిపికెట్ దారులు మధ్యాహ్నం 2 గంటల తర్వాత కార్యాలయానికి వస్తే ప్రత్యేక కౌంటర్ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే సర్టిఫికెట్ కోసం వచ్చే వాహనదారులు స్వయంగా తమ ఆధార్‌కార్డును లేదా తామందించిన ఒరిజినల్ రిసీప్ట్‌ను పట్టుకొని రావాలని డీటీసీ శ్రీనివాస్ కోరారు. కార్యాలయంలో ప్రస్తుతం వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి, డ్రైవింగ్ లైసెన్స్‌లు అర్హత సాధించిన వారికి స్పీడ్ పోస్టు ద్వారా మూడు లేదా నాలుగు రోజుల్లోపు వారి అడ్రస్‌కు చేరేలా చర్యలు చేపట్టారు.

ప్రజా భద్రతా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ - రేపు అంబేద్కర్ భవన్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 29: తెలంగాణలో ప్రజా భద్రతా చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అమరుల బంధుమిత్రుల సం ఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి పద్మకుమారి డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు ఉపాధ్యక్షురాలు శాంత మాట్లాడారు. విప్లవ రాజకీయాల మీద నిషేధాన్ని ప్రజాస్వామ్యం అంగీకరించదని అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అప్రజాస్వామిక విధానాల మీద తమ వైఖరి ఏవిటో సీఎం రేవం త్‌రెడ్డి చెప్పాలని అన్నారు. విప్లవోద్యమం మీద నిషేధానికి, అక్రమ కేసులకు, ఎన్ఐఏ దాడులకు వ్యతిరేకంగా మార్చి 2న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సదస్సులో ప్రజాస్వామిక వాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సమావేశంలో జాయింట్ సెక్రటరీ భవాని, పౌరహక్కుల సంఘం నేతలు పాణి, కళమ్మ, జయంత్, శోభ, విరసం కుమార్ పాల్గొన్నారు.

కేయూ ఆర్ట్స్ డీన్‌గా ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29: కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం కొత్త డీన్‌గా, కేయూ తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్ గా ఏటూరి జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు డీన్‌గా పనిచేసిన ప్రొఫెసర్ బన్న ఐలయ్య ఉద్యోగ విరమణ పొందడంతో డీన్‌గా ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. 2007లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన జ్యోతి తెలుగు విభాగాధిపతిగా, బీవోఎస్ స్టడీ చైర్‌పర్సన్‌గా, ఎస్సీ, ఎస్టీ సెల్, మహిళ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా, జండర్ స్టడీస్ విభాగం ఇన్‌చార్జిగా , వర్సిటీ కేంద్ర గ్రంథాలయ మెంబర్ ఇన్‌చార్జిగా పనిచేశారు.

ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు, పరిపాలన అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు కొత్త డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరి జ్యోతికి అభినందనలు, శుభకాంక్షలు తెలిపారు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదనాయక్

హనుమకొండ, ఫిబ్రవరి 29: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 104 మంది ఉద్యోగులకు సంబంధించిన ఐదు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఇతర అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1వ తేదీన తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్య దర్శి యాదనాయక్ తెలిపారు. గురు వారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 గంటలకు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గడప గడపకు ఉచిత వైద్యం పేరుతో గత 15 సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వేతనాలు చెల్లించడం తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహాధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్, సిహెచ్.అనిల్ కుమార్, ఎం.రాజుగౌడ్, కె.మధుసూదన్, బి.బుచ్చిరాజు, జి.సాయిబాబా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఫోరం రాష్ట్ర ఈసీ మెంబర్‌గా సురేష్



వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కందకట్ల సురేష్ నియామకం అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోరం ఎన్నికల్లో సురేష్‌ను మొదటి ఈసీ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా సురేష్ హనుమకొండ జిల్లాలోని వడ్డెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జ్యోతి

వైస్ ప్రిన్సిపాల్‌గా పుల్లా రమేశ్



నూతన పరిపాలన అధికారులతో వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29: సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కొత్త ప్రిన్సిపాల్‌గా కేయూ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్‌గా సోషియాలజీ విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ పుల్లా రమేశ్‌లు నియమితులయ్యారు. అలాగే కేయూ అకాడమిక్ ఆడిట్ డీన్‌గా వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ జి.హన్మంతును నియమించారు. నూతన పరిపాలన అధికారులకు గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు ఉత్తర్వులు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ టీచింగ్, నాన్‌టీచింగ్ ఏఆర్ పెండ్లి అశోక్‌బాబు తదితరులున్నారు.

. వైస్ ప్రిన్సిపాల్ ఎంపికపై విమర్శలు

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 29: కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ పుల్లా రమేశ్‌ను యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులున్నప్పటికీ కాంట్రాక్టు అధ్యాపకుడికి వైస్ ప్రిన్సిపాల్ పోస్టును కేటాయించడం పట్ల పలువురు అభ్యంతరాలు తెలుపుతున్నారు. తమను కాకుండా కాంట్రాక్టు అధ్యాపకుడికి వైస్ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేయడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ గ్రేడే లక్ష్యం..

- నేటినుంచి పదో తరగతి ప్రీఫైనల్స్ ప్రారంభం
- 18 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం
- ఆందోళన వద్దంటున్న విషయ నిపుణులు



కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29 : పదో తరగతి విద్యార్థుల్లో భయాన్ని తొలగించడంతో పాటు.. మరి కొన్నిరోజుల్లో జరిగే వార్షిక పరీక్షలను నిర్భయంగా రాసేలా విద్యాశాఖ విద్యార్థులను సంసిద్ధులను చేస్తోంది. చిన్నారుల భవిష్యత్‌కు తొలిమెట్టులాంటి పదోతరగతిలో ఉన్నత మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా దిశానిర్దేశం చేస్తోంది. ఈ క్రమంలోనే వారిని పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం చేసేలా శుక్రవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలనునిర్వహిస్తోంది. ఇక వచ్చేనెల 18వ తేదీన నుంచి జరిగే వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి? కొద్దిపాటి సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? ఒత్తిడి, భయానికి తావులేకుండా పరీక్షలు ఎలా రాయాలి? లాంటి పలు అంశాలపై కొత్త ప్రణాళికలతో ముందుకుపోతోంది. దీంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక తరగతులు, శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో కూడా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన తరగతుల్లో విద్యార్థులకు దాతలు, ఉపాధ్యాయుల ద్వారా అల్పాహారం అందజేశారు.

తెలుగును అవగాహనతో చదవాలి..

ప్రస్తుతం ఉన్న పాఠ్యాంశాలు పాతవిధానంలో కాకుండా సొంత భావన, సృజనాత్మకత వెలికి తీసేలా ఉన్నాయి. ఓ అవగాహనతో.. అర్థం చేసుకుంటూ చదవాలి. గతంలో మాదిరిగా కాదు.. ఇప్పుడు బాగా రాస్తేనే మంచి మార్కులు వస్తాయి. అక్షర దోషాలు లేకుండా వాక్యనిర్మాణం రాయడంపై సాధన చేయాలి.

తక్కువ మార్కులని హిందీపై నిర్లక్ష్యం వద్దు..

హిందీలో పాస్‌మార్కులు తక్కువ కదా! అని నిర్లక్ష్యం చేయొద్దు. మనసు పెట్టి చదవాలి. ముఖ్యంగా హిందీ ప్యాసేజ్‌లు బాగా చదవాలి. ఇందులోనే 20 మార్కులు వస్తాయి. ప్రతీ పాఠంలో ఉండే కవి పరిచయాలను నేర్చుకోవాలి. బిట్స్‌ను బాగా నేర్చుకోవాలి.

ఇంగ్లీష్ అంటే భయం వీడాలి..

ప్రణాళికబద్ధంగా ఉపాధ్యాయుడి మార్గదర్శకతతో ఇంగ్లీష్ చదవాలి. ముందు భయాన్ని వీడి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలి. గ్రామర్‌పై దృష్టిసారిస్తే సులభంగా మార్కులు తెచ్చుకోవచ్చు. వీటితోపాటు చక్కటి రాతతో లెటర్ రైటింగ్‌పై సాధన చేయాలి. సృజనాత్మకత ప్రదర్శించి మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు.

గణితంలో మాదిరి ప్రశ్నపత్రాలను..

కొత్తసిలబస్ విధానంలో పరీక్ష ఉన్నా సీసీఈ మోడలే కనుక ఇబ్బంది ఉండదు. గణితంలో ప్రధానంగా మాదిరి ప్రశ్నాపత్రాలను చూసి, పట్టుదలతో సాధన చేయాలి. అభ్యాసంలో ఉండే ప్రశ్నలేకాకుండా వాటి అప్లికేషన్స్‌ను కూడా పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. పాఠశాలలో జరిగే సెలబస్, ఉపాధ్యాయులు తయారుచేసే ప్రశ్నాపత్రాలను ఆకళింపు చేసుకొని పరీక్షలకు ప్రిపేర్ కావాలి. ఏదేని ఒక ప్రాబ్లమ్‌ను పదేపదే ప్రాక్టిస్ చేస్తే ఫలితాలు మెరుగ్గా వస్తాయి. ఎలాంటి సందేహం ఉన్నా ఉపాధ్యాయుడిని సంప్రదించాలి.

పాఠ్యపుస్తకాలను బాగా చదవాలి..

ప్రతీ విద్యార్థి పాఠ్యపుస్తకాన్ని సామాన్యశాస్త్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. ఏ ప్రశ్న ఇచ్చినా రాసేస్థాయికి రావాలి. బట్టీ పడితే అలా రాయడం కష్టమవుతుంది. ఆ విధానానికి స్వస్తి చెప్పి, అర్థం చేసుకుంటూ చదవాలి. 1, 2 మార్కుల ప్రశ్నలపైన దృష్టి సారించాలి. వీటికైతే సింపుల్‌గా రాసినా మార్కులు వచ్చేదానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదవితే మంచి మార్కులను సాధించవచ్చు. ఇక సాంఘిక శాస్త్రంలో ముఖ్యంగా ఆలోచించి రాసే విధంగా విద్యార్థులు తయారు కావాలి. బట్టీ పట్టి రాసే విధానాన్ని స్వస్తి పలకాలి. బాగా చదవడం ప్రాక్టిస్ చేయాలి. చదివిన ముఖ్యాంశాలను రాయడం ప్రాక్టీస్ తరహాలో కొనసాగించాలి. ఉన్న విషయాలను విశదీకరణగా రాస్తే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రీఫైనల్ ఎందుకంటే..

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం మార్చి 1వ తేదీ నుంచి టెస్ట్ ప్రీ ఫైనల్స్ ఆరంభమవుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఎగ్జామ్స్ పూర్తి కాగానే జవాబుపత్రాల వాల్యుయేషన్ చేసి వాటిని మళ్లీ టెస్ట్ విద్యార్థులకు ఇచ్చి జరిగిన పొరపాట్లు చూపి పబ్లిక్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధం చేస్తారు. తద్వారా విద్యార్థులు ప్రతీ ఒక్కరు ఉత్తీర్ణత సాధించడంతో పాటు గ్రేడింగ్ తెచ్చే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఆందోళనకు గురవకుండా ప్రీఫైనల్స్‌ను ప్రాక్టికల్‌గా తీసుకుంటే పబ్లిక్ ఎగ్జామ్స్‌లో సులువుగా ఉత్తీర్ణతలో గ్రేడింగ్ పొందుతారు.

వార్షిక పరీక్షలకు ఇవి తొలిమెట్టు

రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి, మహబూబాబాద్



మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు తొలి మెట్టు. ఈ పరీక్షలు రాసిన విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఏ పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వాటిని ఏ విధంగా రాయాలి అనే అంశాలపై ఒక అవగాహన ఏర్పడుతుంది. పరీక్షలంటే భయం వీడి ఈ పరీక్షల రాసిన విధంగానే ఎలాంటి ఆందోళన లేకుండా వార్షిక పరీక్షలు రాయొచ్చు అనే భావన కలుగుతుంది. తద్వారా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారు.

మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

- పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు
- 350 మంది సిబ్బంది నియామకం
- హుండీల్లో అంబేద్కర్ బొమ్మ ఉన్న నకిలీ నోట్లు
- పది రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- తొలిరోజు రూ.3.15 కోట్లకుపైగా రాక



హుండీలను లెక్కింపునకు మోసుకొస్తున్న సిబ్బంది



బెల్లం, పసుపు, కుంకుమతో తడిసి ముద్దయిన నోట్లు

హనుమకొండ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : పటిష్ఠ బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా మధ్య మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు ప్రక్రియ గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభమైంది. ఫిబ్రవరి 21వతేదీ నుంచి 24 వరకు జరిగిన మహాజాతరకు కోటిన్నర మందికి పైగా భక్తులు తరలొచ్చిన విషయం తెలసిందే. జాతర ముగియగానే హుండీలను హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపానికి తరలించి భద్రపరిచారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 9గంటలకు దేవాదాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు ప్రారంభమవగా దేవాదాయ, రెవెన్యూ శాఖలకు చెందిన 150మంది సిబ్బందితో పాటు పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన 200మంది కార్యకర్తలు మొత్తం 350మంది ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. అయితే హుండీల లెక్కింపు పూర్తి కావడానికి పది రోజులు పట్టవచ్చునని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి, స్వచ్ఛంద కార్యకర్తలకు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను ఏర్పాటు చేశారు. మగవారు లుంగీ, బనీను ధరించగా, మహిళలు కాషాయ రంగు చీర, జాకెట్ ధరించారు. లెక్కింపులో పాల్గొనేవారి పేర్లు, వారి చిరునామాల తదితర వివరాలను నమోదు చేశారు. హుండీల లెక్కింపు రోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. మేడారం పూజారుల సమక్షంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు నేతృత్వం అసిస్టెంట్ కమిషనర్ ఆర్ సునీత, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కార్యనిర్వహణాధికారి రాజేంద్రం ములుగు ఆర్‌డీవో సత్యపాల్ రెడ్డి హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్నారు. అయితే తొలిరోజు 134 హుండీలను తెరవగా విదేశీ కరెన్సీతో కలుపుకొని రూ.3,15,40,000 ఆదాయం సమకూరిందని ఈవో రాజేంద్రం తెలిపారు.

ప్రత్యేక మిషన్ ఏర్పాటు

నోట్లు, నాణేలను వేరుచేయడానికి వీలుగా ప్రత్యేకంగా ఒక మిషన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో నాణాలను వేరుచేయడానికి జల్లెడపట్టేవారు. దీని వల్ల ఎక్కువ సమయం పట్టేది. ఈ మిషన్‌కు ఉన్న జల్లెడ భాగంలో హుండీని కుమ్మరించగానే అందులోని బియ్యం కిందకు పడిపోతాయి. నాణాలు జారుకుంటూ ముందుకు వస్తాయి. జల్లెడపై నోట్లు మిగిలిపోతాయి. నాణేలతో పాటు వెండి, బంగారు వస్తువులు కూడా వేరవుతాయి. ఈ లెక్కింపులో ఎలాంటి అక్రమాలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. లెక్కింపు కేంద్రం బయట, లోపల 60కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక మానిటర్‌ను అమర్చారు. ఈ మానిటర్ ద్వారా నిరంతరం గమినించేందుకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు. సిబ్బంది లెక్కింపు కేంద్రం లోపలికి వెళ్లే ముందు, లెక్కింపు పూర్తయిన తర్వాత బయటకు వచ్చేప్పుడు తనిఖీ చేసేందుకు మెటల్ డిటెక్టర్లను అమర్చారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే వారిని పక్కన పెడతారు. లెక్కింపు ప్రక్రియ ఆసాంతం వీడియో చిత్రీకరణలో సాగుతోంది.

క్రమ సంఖ్య ప్రకారం..

మేడారం నుంచి మొత్తం 518 హుండీలను లెక్కింపు కేంద్రానికి తరలించారు. ప్రతీ హుండీకి ఒక నెంబర్ కేటాయించి.. వాటిని పకడ్బందీగా సీల్ చేసి.. వాటిపై డీసీ, ఏసీ, ఈవో సంతకాలు చేశారు. వాటి క్రమసంఖ్య ప్రకారం హుండీలను, వాటి సీళ్లను పరిశీలించి సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే తెరిచేందుకు అధికారులు అనుమతిస్తున్నారు. ఇదంతా పూజారుల సమక్షంలోనే జరుగుతోంది.

తడిసి ముద్దయిన నోట్లు

హుండీల్లోని చాలా నోట్లు బెల్లం, పసుపు, కుంకుమలతో తడిసి ముద్దయ్యాయి. వీటిని సబ్బు నీళ్లలో నానబెట్టి కడిగి శుభ్రం చేసిన తర్వాత ఇస్త్రీ చేయడం ద్వారా పూర్వ రూపానికి తీసుకొవస్తున్నారు. పూర్తిగా చిరిగిపోయిన నోట్లను పక్కన పెడుతున్నారు. హుండీల్లో నోట్లతో పాటు బంగారు, వెండి కానుకలు కూడా వస్తుండగా.. వాటిని భద్రపరుస్తున్నారు. ఈ కానుకను చివర తూకం వేసి వాటి బరువును రికార్డు చేస్తారు. లెక్కించిన నోట్లను వాటి డినామినేషన్ ప్రకారం వేరు వేరుగా కట్టలు కట్టి.. ఏరోజు కారోజు బ్యాంకులో జమ చేస్తున్నారు. ఈ మేరకు బ్యాంకు సిబ్బందిని కూడా లెక్కింపు కేంద్రంలో అందుబాటులో ఉంచారు.

ఈ సారి ఆదాయం పెరిగే అవకాశం..

ఈ సారి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీ ఆదాయం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రతీ జాతరకు ఆదాయం క్రమంగా పెరుగుతూ వస్తుండగా.. 2022 జాతరలో రూ.12,45,49,727 ఆదాయం వచ్చింది. గత జాతర కన్నా ఈ సారి భక్తులు భారీగా తరలొచ్చారన్న అంచనా మధ్య ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. 1968 నుంచి మేడారం జాతర ఆదాయ వ్యయాలను అధికారికంగా లెక్కిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 28జాతరలు జరగ్గా.. ఆదాయంతో పాటు ఖర్చు కూడా పెరుగుతూ వస్తోంది. 1978, 2014లో మినహా మిగతా సంవత్సరాల్లో జరిగిన జాతరల్లో ఆదాయం పెరిగింది. కరోనా కాలమైన 2020లోనూ ఆదాయం తగ్గలేదు.

అంబేద్కర్ చిత్రంతో ఉన్న నగదు రాక..

హుండీల నుంచి నకిలీ కరెన్సీ నోట్లు బయటపడుతున్నాయి. నోట్లపై మహాత్మాగాంధీ ఫొటోకు బదులు పలు రూ.100నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటో ఉండడంతో అందరూ ఆశ్చర్యపోయారు. మొదట తెరిచిన హుండీల్లో ఈ నకిలీ కరెన్సీ రాగా.. ఇలాంటివి అయిదారు నోట్లు వచ్చాయి. అయితే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను కూడా ముద్రించాలన్న డిమాండ్ వస్తున్న సమయంలో ఈ డిమాండ్‌ను జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతోనే ఇలా చేసి ఉంటారని అధికారులు భావిస్తున్నారు.

ఉద్యోగార్థుల్లో ఉత్సాహం..

(5వ పేజీ తరువాయి)

నిర్వహించాలని కోరుతున్నారు. జోన్ల ప్రాతిపదికన ఎంపికలు నిర్వహిస్తే కొత్తగా ఏర్పడిన జిల్లాల్లోని అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశముందని వారు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపికలు నిర్వహిస్తేనే ఎక్కువ మంది అభ్యర్థులకు న్యాయం జరిగే అవకాశం ఉందంటున్నారు. అలాగే భర్తీ ప్రక్రియను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరో రెండు నెలల్లో వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో భర్తీ ప్రక్రియను వేసవి సెలవుల వరకు పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరానికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా నోటిఫికేషన్ జారీ చేసి కాలయాపన చేయకుండా ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలంటున్నారు.

పూర్తి స్థాయిలో పోస్టులను భర్తీ చేయాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటన్నింటిని భర్తీ చేయాలని ఉపాధ్యాయ ఉద్యోగార్థులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలో మొత్తం మంది 130 ఐఈఆర్పీలు పనిచేస్తున్నారు. వారందరు డీఎస్సీలో తమకు వెయిటేజీ మార్కులు కలపాలని, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీలో వెయిటేజీ మార్కులు కలపినట్లు వారు గుర్తు చేస్తున్నారు.

4వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ...

డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం.. ఈ నెల 4వతేదీ నుంచి ఏప్రిల్2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. అభ్యర్థులు పరీక్ష ఫీజు కింద రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తులు చేసే వారు ఒక్కో పోస్టుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష తేదీలను తర్వాత ఖరారు చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పరీక్ష విధానం పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

జిల్లాల వారీగా ఖాళీలు ఇవే...

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,519 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వరంగల్ జిల్లాలో 301, హనుమకొండలో 187, జనగామలో 221, మహబూబాబాద్‌లో 381, ములుగులో 192, జయశంకర్ భూపాల్లిలో 237 పోస్టులు ఖాళాగా ఉండగా.. వాటిని ఈ మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది.

జిల్లా	ఎస్ఏలు	ఎల్పీలు	పీఈటీలు	ఎస్జీటీలు	స్పెషల్	మొత్తం
వరంగల్	66	21	6	182	26	301
హనుమకొండ	73	5	7	81	21	187
జనగామ	50	21	7	118	25	221
మహబూబాబాద్	71	19	2	264	25	381
ములుగు	33	16	1	125	17	192
భూపాలపల్లి	41	20	7	152	17	237

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన శ్రావణి



నెక్కొండ, ఫిబ్రవరి 29 : ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నెక్కొండకు చెందిన 36 సంవత్సరాల వయస్సు గల సొంటిరెడ్డి శ్రావణిని గురువారం మండల ప్రజలు, విద్యావేత్తలు అభినందించారు. నెక్కొండకు చెందిన అడ్వకెట్ సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి భార్య శ్రావణి ఎంఎస్సీ, బీఈడీ విద్యను అభ్యసించింది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఐదు సంవత్సరాల నుంచి కెమిస్ట్రీ కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులను నిర్వహిస్తోంది. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బోర్డ్ ఫలితాలలో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ ఫిజికల్ సైన్స్‌లో తెలంగాణ స్టేట్ లెవల్‌లో 147 ర్యాంక్ సాధించారు. గురుకులం పోస్టు గ్రాడ్యువేట్‌కు ఎంపికకావడంతో ఫిబ్రవరి 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నారు. అలాగే ఫిబ్రవరి 22న డిగ్రీ లెక్చరర్ ఇంటర్వ్యూకు హాజరు కాగా, 28వ తేదిన విడుదల చేసిన ఫలితాల్లో ఎంపికైంది. అలాగే ఈ నెల 24వ తేదిన జూనియర్ లెక్చరర్ ఇంటర్వ్యూకు హాజరు కాగా, ఫిబ్రవరి 29 తేదిన విడుదల చేసిన ఫలితాల్లో శ్రావణి ఎంపికైనట్లు ప్రకటించారు. మూడు పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్ (పీజీటీ) ఉద్యోగాలకు శ్రావణి ఎంపికైంది.

అందివచ్చిన ఆయుర్వేదం

- ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో టి-డయాగ్నస్టిక్ సేవలు
- అందుబాటులోకి వచ్చిన అన్ని రకాల ఉచిత ల్యాబ్ పరీక్షలు
- వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



ల్యాబ్‌లో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గిర్మాజీపేట, ఫిబ్రవరి 29 : దీర్ఘకాలిక, మొండి రోగాలకు శాశ్వత పరిష్కారంగా ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తున్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రిలో అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు సాధారణ పరీక్షలకు పరిమితమైన ల్యాబ్‌ను తెలంగాణ డయాగ్నస్టిక్ పరిధిలోకి తేవడంతో అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి రావడంతో రోగులు, వారి బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్‌లోని బస్టాండ్, రైల్వేస్టేషన్‌లకు కూతవేటు దూరంలో అధునాతన భవనాలు, సదుపాయాలతో ప్రత్యేక ఆయుర్వేద వైద్య విభాగాలతో వైద్య సేవలు అందిస్తోంది. అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు బోధన ఆస్పత్రిగా పనిచేస్తున్న 120 పడకలు ఆస్పత్రిలో నిత్యం 90మంది ఇన్‌పేషెంట్లు, 300 మంది అవుట్ పేషెంట్‌లు వైద్య సేవలు పొందుతుంటారు. జలుబు, దగ్గు, బీపీ, మధుమేహం, పక్షవాతం, నడుము, వెన్నుముక, కీళ్ల, స్పాండిలైటిస్, మైగ్రేన్, సైనసైటిస్, సోరియాసిస్, అర్షమొలలు, భగంధరం, డయాబెటిక్ రెటినోపతి, డయాబెటిక్ ఫుట్, వెరికోస్ వెయిన్స్ తదితర వ్యాధులకు నిష్ణాతులైన వైద్యులు ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తుంటారు. ఈ ఆస్పత్రిలో లభిస్తున్న మెరుగైన ఆయుర్వేద వైద్య సేవలతో దీర్ఘకాలిక, మొండి తదితర రోగాలకు పరిష్కారం లభిస్తుండడంతో వరంగల్ జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన రోగులు వస్తుండటంతో ఆస్పత్రి రద్దీగా ఉంటుంది.

ఆస్పత్రి ల్యాబ్‌లో సాధారణ పరీక్షలు


ఆస్పత్రికి వస్తున్న రోగులకు రోగ నిర్ధారణ, తగిన వైద్య చికిత్సల కోసం రోగులకు వివిధ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ల్యాబ్ పరీక్షల ప్రకారమే వైద్యులు రోగుల వ్యాధి నిర్ధారణ చేస్తారు. అయితే ల్యాబ్‌లో సాధారణ మూత్ర, రక్త పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కీళ్ల నొప్పులు, రుమాటాయిడ్ అర్థరైటిస్, కిడ్నీ, లివర్, మూడు నెలల షుగర్ స్థాయిలు నిర్ధారించే ఎచ్‌బిఎ1సి తదితర ముఖ్యమైన పరీక్షలు ఆస్పత్రి ల్యాబ్‌లో అందుబాటులో లేవు. వందల రూపాయల వ్యయం అయ్యే ఈ పరీక్షల కోసం రోగులు ప్రయివేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సహజంగా ఇక్కడికి వచ్చే రోగులు పేద, దిగువ మధ్య తరగతి, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ ఉంటారు. రోగుల పరిస్థితిని గమనించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనాచారి ఆయుష్ ఉన్నతాధికారులు, ఆయుర్వేద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో సంప్రదించి తెలంగాణ డయాగ్నస్టిక్ పరిధిలోకి వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిని తీసుకురావాలని కోరారు. ఆస్పత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్య, రోగ నిర్ధారణ ల్యాబ్ పరీక్షల అవశ్యకతను వివరించడంతో దృష్టిలో అధికారులు టీ డయాగ్నస్టిక్ సేవలను ఆయుర్వేద ఆస్పత్రికి పాక్షికంగా అందుబాటులోకి తెచ్చారు. కాశిబుగ్గ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ఆయుర్వేద ఆస్పత్రి శాంపిల్స్ పంపించేందుకు అధికారులు ఆమోదం తెలిపారు

టి-డయాగ్నస్టిక్ సేవలతో...

ఇప్పటి వరకు సాధారణ రక్త, మూత్ర పరీక్షలకే పరిమితం కాగా, టీ డయాగ్నస్టిక్స్ సేవలు అందుబాటులోకి రావడంతో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. కిడ్నీ, లివర్ ఫంక్షన్, ఎచ్‌బిఎ1సి తదితర రుమాటాయిడ్ అర్థరైటిస్ తదితర రోగులకు సైతం పరీక్షలు చేస్తున్నారు. టీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేసే సుమారు 80పరీక్షలకు సంబంధించి ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. ఆస్పత్రి ల్యాబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె. సాంబమూర్తి పర్యవేక్షణలో ల్యాబ్ టెక్నీషియన్ పవన్ పరీక్షలు చేస్తున్నారు. రోగుల ఆధార్ కార్డు, దీనికి అనుసంధానమైన మొబైల్ ఫోన్ నెంబర్‌ను రిజిస్ట్రేషన్ చేసుకుని వారి నుంచి సేకరించిన రక్త నమూనాలను కాశిబుగ్గ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ప్రతి రోజు నర్సంపేటలోని టీ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపుతున్నారు. నిర్ధారణ ఫలితాల సంబంధిత రోగుల మొబైల్ నెంబర్‌కే మరుసటి రోజు వస్తుండటంతో రోగుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

మెరుగైన వైద్య సేవలు

డాక్టర్ జగన్మోహనాచారి, సూపరింటెండెంట్



నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది సేవలతో ఆయుర్వేదంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. అన్ని రకాల దీర్ఘకాలిక, మొండి రోగాలకు ఉచిత వైద్య సేవలు అందుతుండడంతో రోగులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇతర రాష్ట్రాలవారుసైతం వస్తున్నారు. టీ డయాగ్నస్టిక్ సెంటర్ పూర్తిస్థాయిలో అస్పత్రిలో అందుబాటులోకి త్వరలోనే రానుంది. అస్పత్రి నుంచే రోగుల రక్త నమూనాలను పంపేందుకు ఉన్నతాధికారుల సహకారంతో చర్యలు చేపట్టాం.

ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ

బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ) ఫిబ్రవరి 29: ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ కల్పించినట్లు జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ప్రావీణ్య తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వడ్డీ మాఫీ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90 శాతం మాఫీ పొందవచ్చాన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెందిన వడ్డీ మాఫీ 90 శాతం మేరకు ఉంటుందన్నారు. విగతా 10 శాతం వడ్డీని వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 మార్చి వరకు వడ్డీ లేదా పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికి కూడా ఈ స్కీం వర్తిస్తుందన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికావాల్సి అవసరం లేదని 90 శాతం వడ్డీని రానున్న ఆస్తి పన్ను బిల్లుల్లో సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరవాసులను కోరారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

మడికొండ, ఫిబ్రవరి 29: పోగొట్టుకున్న మొబైల్‌ను సంబంధిత వ్యక్తికి అందజేసి పోలీసులు తమ విధ్యుక్త ధర్మాన్ని చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన జయప్రకాష్ అనే వ్యక్తి మడికొండలోని ఓం గ్రానైట్ వద్ద గురువారం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు దర్యాప్తు చేసిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. వెంటనే మొబైల్‌ను కనిపెట్టి స్థానిక సీఐ ప్రతాప్ ద్వారా బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY
శుక్రవారం 1 మార్చి 2024
హనుమకొండ సిటీ
• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు

నేడు వరంగల్‌లో బీజేపీ విజయసంకల్ప యాత్ర

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో శుక్రవారం బీజేపీ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్‌రెడ్డి పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మడికొండ నుంచి యాత్ర ప్రారంభమై, అక్కడ నుంచి రాంపూర్, తరాలపల్లి, వనమాల కనపర్తి, వెంకటాపురం, ఐనవోలు వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఐనవోలు మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించి పున్నేలు, పంథిని, కట్య్రాల, ఇల్లంద, వరంగల్‌లోని ఆర్టీవో జంక్షన్, శంభునిపేట సర్కిల్, నాగమయ్యగుడి, వాల్‌మార్ట్, ఇసుకఅడ్డాల జంక్షన్ మీదుగా హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో రాకేష్‌రెడ్డి మాట్లాడుతారన్నారు. అనంతరం పోచమ్మమైదాన్ సెంటర్ నుంచి భద్రకాళీ గుడిలో అమ్మవారి దర్శనంతో యాత్ర ముగుస్తుందని రవికుమార్ తెలిపారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేయాలి

హనుమకొండ, ఫిబ్రవరి 29: ప్రభుత్వం గొల్ల కురుమలకు నగదు బదిలీ ద్వారా గొర్రెలను పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శతబోయిన రమేష్ అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీడీలు చెల్లించిన గొల్ల కురుమలు జిల్లా వ్యాప్తంగా 7318 మంది ఉండగా 1135మందికి పంపిణీ చేసి 1079.మందికి గొర్రెల పంపిణీ నిలిపి చేశారని తెలిపారు. ప్రభుత్వం గొల్ల కురుమలకు నగదు బదిలీ ద్వారా 2 లక్షలు అకౌంట్‌లో వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అదే విధంగా మరణించి గొల్ల కురుమలకు ప్రమాద భీమా పది లక్షలు చెల్లించాలన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లింగయ్య, మండల నాయకులు చిన్న రాజు, కుమార్, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

పింగిళి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళిగౌడ్



సబార్డినేట్ యాదమ్మను సత్కరిస్తున్న పింగిళి కళాశాల అధ్యాపక బృందం

వడ్డెపల్లి, ఫిబ్రవరి 29: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని పింగిళి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమౌళిగౌడ్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న కె. యాదమ్మ గురువారం పదవీ విరమణ చేశారు. ఆమెను అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేడీసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజిరెడ్డి, అధ్యాపకులు సుహాసిని, రామకృష్ణారెడ్డి, పార్వతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఎంలో ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

హనుమకొండ , ఫిబ్రవరి 29: తన సర్వీస్ కాలంలో పదోన్నతి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఎంజీఎం ఉద్యోగి ఆత్మహత్యాయనికి పాల్పడ్డారు. గురువారం జరిగిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 25 సంవత్సరాలుగా మోహన్ స్వీపర్‌గా ఎంజీఎంలో పని చేస్తున్నాడు. పదోన్నతి విషయంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో తీవ్ర నిరాశతో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. ప్రస్తుతం మోహన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న మోహన్

పేదలకోసం పోరాడేది కమ్యూనిస్టులే..

• సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
• పార్టీలో భారీగా చేరికలు



సభలో అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 29 : ప్రపంచ వ్యాప్తంగా పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిస్టుల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ కేయూ రోడ్డులోని శారద గార్డెన్‌లో గురువారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సిరబోయిన కరుణాకర్ ఆధ్వర్యంలో సాంబశివరావు సమక్షంలో వెయ్యి మంది సీపీఐలో చేరారు. వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడారు. అధికారం కోసమే పని చేస్తున్న రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలోనే ప్రజల సమస్యలు గుర్తుకు వస్తాయని ఎద్దేవ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ. ప్రజా సమస్యల సాధన ఎర్రజెండాతోనే సాధ్యం అన్నారు. ముందుగా కేయూ జంక్షన్ నుంచి కరుణాకర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు సిరిబోయిన కరుణాకర్, కంచర్ల ప్రభాకర్, పున్నంచందర్, హనుమకొండ జిల్లా కార్యదర్శి బిక్షపతి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, శ్రీనివాస్, సదాలక్ష్మి, బాష్‌మియా, సహాయ కార్యదర్శులు భజక్షపతి, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాంగ్రెస్‌లోచేరిన వారికి న్యాయం చేస్తాం..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

సుబేదారి, ఫిబ్రవరి 29: కాంగ్రెస్‌లోచేరిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ అలంకార్ ప్రాంతానికి చెందిన సుమారు 100 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమంక్షలో కాంగ్రెస్‌లో పార్టీలో చేరగా ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ద్వారానే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భావించి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఫిరోజ్‌ఖాన్, ఉమర్, యాసిన్, ఫయాజ్, అజయ్, నోమన్, అమీర్, అజయ్, సోను తదితరులు ఉన్నారు.

సమాజంలో గౌరవప్రదమైనది అధ్యాపకుడి వృత్తి

కేయూ వీసీ తాటికొండ రమేష్



ఐలయ్య దంపతులను సన్మానిస్తున్న వీసీ, అధ్యాపకులు

సుబేదారి, ఫిబ్రవరి 29: సమాజంలో గౌరవప్రదమైన, ఆదర్శవంతమైన వృత్తి ఒక్క అధ్యాపక వృత్తేనని, అందుకే తల్లిదండ్రుల తర్వాత గురువులకు అంత ప్రాధాన్యత ఉందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ తాటికొండ రమేష్ అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో గురువారం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని కళాశాల ఫ్యాకల్టీ క్లబ్ కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ రమేష్ హాజరై అధ్యాపకులతో కలిసి ఐలయ్య దంపతులను సన్మానించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ అధ్యాపకునికి రిటైర్‌మెంట్ అనేది ఉండదని, నిరంతరం విద్యార్థిగానే ఉంటారన్నారు. విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యులు రోజురోజుకు తగ్గిపోతున్నారని, అయితే ఉద్యోగ విరమణ చేసినప్పటికి యూనివర్సిటీకి కావాల్సిన సహాయ సహకారాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు బన్న ఐలయ్య కళాశాల కోసం చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య హనుమంతు, ప్రొఫెసర్ మల్లిఖార్జున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, డాక్టర్ బిక్షపతి, డాక్టర్ తిరుణహరి శేషు, డాక్టర్ శ్రీలత, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర ఉద్యోగ సంఘం భవనాన్ని ప్రారంభించిన వీసీ

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం కార్యాలయాన్ని గురువారం కేయూ వీసీ రమేష్ ప్రారంభించారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉద్యోగ సంఘం నాయకులు రాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మడికొండ పీఎస్ తనిఖీ చేసిన సీపీ

మడికొండ, ఫిబ్రవరి 29: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం మడికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలతో పాటు వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులతో పాటు నేరాలు, శాంతి భద్రల నియంత్రణ కోసం ముందస్తుగా తీసుకుంటున్న చర్యలపై స్థానిక సీఐని ఆరా తీశారు. శాఖాపరమైన సమస్య లపై విచారించారు.



మడికొండ పీఎస్‌ను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ అంబర్‌కిషోర్ ఝా

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం

9 వతేదీ వరకు ప్రదర్శన



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గంగు ఉపేంద్రశర్మ, దుర్గాప్రసాద్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 29: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహా శివరాత్రి శుక్రవారం రావడం మహాద్భాగ్యమని అన్నారు. మహా శివ రాత్రి రోజున రుద్రాక్షలు ధరించడం వల్ల సకల ఐశ్వర్యాలు లభిస్తాయని శివపురాణం తెలియజేస్తుందని చెప్పారు. నేపాల్ రుద్రాక్షల మేనేజింగ్ డైరెక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలతో పాటు స్పటిక, తులసీ, నవరత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు, దైవికమైన వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు. జన్మ నక్షత్రాన్ని పరిశీలించి అసలైన రుద్రాలను ఇస్తామని చెప్పారు. ఈ ప్రదర్శన మార్చి 1 నుంచి 9 వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేపాల్ రుద్రాక్షల డైరెక్టర్ జి.పద్మలత, దర్గా కాజీపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాదాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 29: రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో సెయింట్ పీటర్స్ పాఠశాలకు చెందిన 2వ తరగతి విద్యార్థిని జూనైరా 2వ ర్యాంకును సాధించింది. ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో నగరంలోని బిషప్ బెరట్టా పాఠశాలలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 41 మంది విద్యార్థులు పాల్గొనగా సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జైనైరా ద్వితీయ హుమతిని, 5 తరగతికి చెందిన సిరి ప్రతీక మొదటి బహుమతిని, 4వ తరగతికి చెందిన దేవాంష్ రెడ్డి కన్సోలేషన్ బహుమతి పొందారు. బహుమతులు పొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ గోపు మథ్యూస్‌రెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పోలీసు కళాజాత

హనుమకొండ, ఫిబ్రవరి 29: ధర్మసాగర్ మండలం దేవునూర్‌లో పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు కళాజాత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ రాజు విచ్చేసి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్‌కు, మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని దాని వాటివల్ల కలిగే నష్టాలను వివరించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్, సీఆర్ఆర్ఐ డైరెక్టర్

కాజీపేట, ఫిబ్రవరి 29: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ కోసం కేంద్రం ఏర్పాటు చేసేందుకు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టర్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.అశోక్‌కుమార్‌లు ఒప్పంద పత్రాలపై గురువారం సంతకం చేశారు. న్యూ ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్ నేషనల్ సెంటరులో ఎంఓఏ సంతకం, దీక్షా వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ ఎంఓఏ పదేళ్ల పాటు ఉంటుందని, సంవత్సరానికి రూ. 2.09 కోట్ల చొప్పున మొదటి మూడేళ్లకు మంజూరు చేయబడి ందన్నారు. పని పురోగతి ఆధారంగా మిగిలిన సంవత్సరాలకు బడ్జెట్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

నిట్ , సీఆర్ఆర్ఐ మధ్య ఎంఓయూ

వరంగల్ నిట్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంట్రల్ రోడ్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ ఐఆర్ -సీఆర్ఆర్ఐ) ఢిల్లీ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు నిట్‌లో డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, సీఆర్ఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. పరదా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ. బిల్డింగ్ కెపాసిటీ, రవాణా, మౌళిక సదుపాయాల అభివృద్ధి విద్యార్థి దిసీస్ సంబంధించిన అంశాలపై అవగాహన ఒప్పందం ఉంటుందని తెలిపారు. అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఐదు రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపులో హై పెర్ఫార్మెన్స్ కంప్యూటరింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో ఇంజనీరింగ్, ఐఐటీ కళాశాల నుంచి 30 మంది పాల్గొన్నారు. నిట్ ప్రొఫెసర్‌లు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో అగ్నిప్రమాదం

మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 29 : మడికొండ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు కొయ్యకాలు, గడ్డివాము గురువారం అగ్ని ప్రమాదానికి గురైంది. అజిత్‌రెడ్డి అనే అనే వ్యక్తికి చెందిన గడ్డివాము దగ్ధమయ్యింది. వెంటనే అక్కడి వారు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడకు వెళ్లి ఫైర్ ఇంజన్‌లతో మంటలను ఆర్పి వేశారు. పక్కనే ఉన్న కోళ్ల ఫాంకు మంటలు వ్యాప్తి చెందకుండా సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 5 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదని హనుమకొండ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆంగోతు నాగరాజు తెలిపారు. ఈ ప్రమాదాన్ని ఆర్పిన వారిలో సిబ్బంది జనార్ధన్, వెంకటేశ్వర్లు, యాకుబ్, రహీంలు ఉన్నారు.

తుదిదశకు క్రికెట్ టోర్నమెంట్

సెమీస్‌కు చేరుక్ను జట్లు

సుబేదారి, ఫిబ్రవరి 29: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో గత 5 రోజులుగా రాము మిత్రమండలి ఆధ్వర్యంలో జరుగుతున్న రాము స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. పోటీల్లో భాగంగా గురువారం పలు జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్స్ పోటీలు జరిగాయి. నేడు(శుక్రవారం)తో టోర్నీ ముగుస్తుందని, గెలిచిన జట్లకు ట్రోఫీతో పాటు నగదు పురస్కారాలు అందజేస్తామని టోర్నీ నిర్వాహకులు మార్నేని ఉదయబానురావు తెలిపారు.

ఫిజిక్స్‌లో శ్రీనివాస్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29: ఓయూ ఫిజిక్స్ విభాగం పరిశోధకుడు బూరుగు శ్రీనివాస్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు గురువారం ఓయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సీపీ వర్ధని శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు వెల్లడించారు. 'ఎఫెక్ట్ ఆఫ్ బిస్మత్ ఆక్సైడ్ / లెడ్ ఆక్సైడ్ / అల్యూమినియం ఆక్సైడ్ ఆన్ ఫిజికల్,ఆప్టికల్ స్ట్రక్చరల్ అండ్ షీల్డింగ్ ప్రాపర్టీస్ ఆఫ్ ఇంక్ కాడ్మియం బోరేట్ గ్లాసెస్' అనే అంశంపై ఓయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ పి. హిమబిందు పర్యవేక్షణలో శ్రీనివాస్ పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. డాక్టరేట్ సాధించిన శ్రీనివాస్ హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. శ్రీనివాస్‌ను కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, మసూద్ అహ్మద్, బండారి రాజు, కిరణ్, నరేందర్, రాజశ్రీ, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

పరీక్ష సామగ్రి అందజేత

హనుమకొండ, ఫిబ్రవరి 29: పదవ తరగతి విద్యార్థులకు షిర్డీసాయి సేవా ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో శివనగర్ గణపతి గుడి వద్ద పెన్నులు, ప్యాడ్‌లు, పెన్సిల్ ఇతర సామాగ్రి గురువారం అందజేశారు. అలాగే మాడిశెట్టి దక్ష్యా ఎంబీబీఎస్ ఆఖరు సంవత్సరాన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విద్యనభ్యసిస్తుండగా మెడిసిన్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మదేవర లలిత వేణుగోపాల్, కాసం వసంతి తదితరులు పాల్గొన్నారు.

విద్య రంగ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి

మెగా డీఎస్సీ ప్రకటనపై హర్షం
ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29: ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడంపై ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం కేయూలో జరిగిన విద్యార్థుల సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో విద్య రంగ సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్ఎంఎస్ హాస్టల్స్ ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని అన్నారు.

అలాగే అందరికీ నాణ్యమైన విద్యను అందేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో బీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, అధ్యక్షుడు మచ్చ పవన్ కల్యాణ్, నరేందర్, ప్రణయ్, అఖిల్, సుకుర, సూర్య, సాయి, కిరణ్, వెంకటేశ్, రాజ్‌కుమార్, పృథ్వీరాజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థి పబ్బ విజయభాస్కర్ రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి పబ్బ విజ యభాస్కర్, రిటైర్డు హెడ్ మాస్టర్ చిదర రుద్రయ్యలు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో దాతల సహాయ సహకారాలు అవసరమన్నారు. ఇదే పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పని చేసిన రుద్రయ్య, పబ్బ విజయ భాస్కర్‌లు తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, ఎలగందుల వెంకటేశ్వర్‌రావు, వాసుదేవరావు, రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టుటైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29 :కేయూ పార్టుటైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని గత మూడు రోజులు నిరసనలు చేస్తున్న పార్టుటైం అధ్యాపకులు గురువారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి డిమాండ్లలతో కూడిన వినతి పత్రాన్ని అందచేసి నిరసన తెలిపారు. అర్హులైన వారిని కాంట్రాక్టు అధ్యాపకులుడి అప్‌గ్రేడ్ చేయాలని, పీరియడ్‌కు రూ. వెయ్యి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు, దేవోజీ, నరేందర్‌నాయక్, భాగ్యమ్మ, శేషు, ఐ.రమేశ్, కె.లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, పూజిత, రజని, నవీన్, సదానందం, చందర్ పాల్గొన్నారు.

ఫాదర్ విజయ్ కుమార్ మృతి

కాజీపేట, ఫిబ్రవరి 29: దీనజన బాంధవుడు ఫాదర్ డాక్టర్ కొమ్మారెడ్డి విజయ్ కుమార్‌రెడ్డి (68) అనారోగ్యంతో మెడికేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. సాయంత్రం ఆయన భౌతికకాయాన్ని కాజీపేట ఫాతిమా నగర్‌లోని బిషప్స్ హౌస్‌కు తరలించారు. అక్కడ పాదర్లు, సిస్టర్లు, బ్రదర్స్, అభిమానులు, శిష్యులు అధిక సంఖ్యలో చేరుకొని ఘనంగా నివాళులర్పించారు. డోర్నకల్‌లో విచారణ గురువుగా మొదట పనిచేసిన ఫాదర్ అనంతరం వడ్డెపల్లి, కాజీపేట, సుబేదారి, సెయింట్ పీటర్స్, పాలకుర్తి విచార ణల్లో పనిచేశారు. క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ, విద్యాజ్యోతి డిగ్రీ, పీజీ కాలేజీల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన వర ంగల్‌లోని మెడికేర్ ఆస్పత్రి డైరెక్టర్‌గా పనిచేశారు. పాదర్ డాక్టర్ విజయ్‌కుమార్ అంత్యక్రియలను శుక్రవారం 4.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు బిషప్ హౌజ్ వర్గాలు తెలిపారు.

నివేదన






గీతాసారం

భగవద్గీత శాశ్వతం

మన సమాజంలో ఉన్న చట్టాలు బయటి ప్రపంచంలో క్రమానుగతమైన వ్యవస్థను నిలబెట్టడం కోసమైతే... భగవద్గీత మన అంతరంగిక ప్రపంచంలో సమత్వాన్ని, సద్భావనను నిలబెట్టుకోవడం కోసం. మనం చేసే ఏ కర్మకయినా రెండు భాగాలు ఉంటాయి. మొదటిది ఉద్దేశం, రెండోది అమలు చేయడం. చట్ట పరిభాషలో వీటిని 'మెన్స్ రియా అండ్ ఆక్టస్ రియస్' అని (లాటిన్ పదాల్లో) పేర్కొంటారు. ఉదాహరణకు... ఒక సర్జన్, ఒక హంతకుడు ఇద్దరూ కత్తిని ఉపయోగిస్తారు. సర్జన్ ఉద్దేశం కాపాడడం, చికిత్స చేయడం. హంతకుడి ఉద్దేశం హాని చేయడం, చంపడం. రెండు సందర్భాలలోనూ మరణం సంభవించవచ్చు. కానీ ఉద్దేశాలు మాత్రం ఒకదానికి ఒకటి పూర్తిగా విరుద్ధమైనవి.

చట్టం పరిస్థితులను బట్టి మారుతుంది. కానీ భగవద్గీత ఎప్పటికీ మారనిది, శాశ్వతమైనది. రోడ్డుకు ఎడమవైపు వాహనం నడపడం ఒక దేశంలో చట్టబద్ధమైతే, మరో దేశంలో దాన్ని నేరంగా పరిగణించవచ్చు. చట్టం పనులను... 'మంచి పని, చెడ్డ పని' అంటూ విభజిస్తుంది. కానీ జీవితంలో అనేక సందేహాస్పదమైన పరిస్థితులు ఉంటాయి. మనం పన్నులు కడుతున్నంత వరకూ అది ఇష్టంతో కట్టారా? కష్టంతో కట్టారా? అనే దానితో చట్టానికి సంబంధం లేదు. మనం ఉంటున్న ప్రాంతంలోని చట్టం ప్రకారం... అది నిర్వచించే పరిమితుల్లో మనం ఉన్నంత వరకూ చట్టం మన జోలికి రాదు. ఎవరైనా ఒక నేరం చేయాలని ఆలోచిస్తూ ఉన్నట్టయితే దానికి చట్టం అడ్డు రాదు. నేరం చేసిన తరువాత మాత్రమే అది రంగంలోకి దిగుతుంది. కానీ అటువంటి ఆలోచనలను కూడా నిర్మూలించాలని భగవద్గీత చెబుతుంది. 'మొక్కై వంగనిది మానై వంగదు' అన్నట్టు 'ఉద్దేశం దశలో ఉన్న (చేయాలనుకుంటున్న) కర్మ గురించి అవగాహన ఉండాలి. లేకపోతే అది మన నియంత్రణను దాటిపోతుంది' అని భగవద్గీత బోధిస్తుంది. ఆ ఉద్దేశాన్ని అమలు చేయడం అనేది భవిష్యత్తులో జరిగే పని. ఉద్దేశం దశలోనే దాన్ని ఆపకపోతే... ఆ తరువాత దాని మీద మనకు ఎటువంటి నియంత్రణా ఉండదు. ఉద్దేశాలను అధిగమించి ఎదగడానికి భగవద్గీత మనకు సాయపడుతుంది. ఉద్దేశం మంచిదయినా, చెడ్డదయినా... అది విజయంతో లేదా అపజయంతో కలిసినప్పుడు అహంకారమైనా పెరుగుతుంది లేదా బలహీనమైన క్షణంలో లావాలా పెల్లుబికే నిరాశ, నిస్పృహ మనసులో పేరుకుంటాయి. ఈ రెండు రకాల పరిస్థితులు మనల్ని మన అంతరాత్మ నుంచి దూరం చేస్తాయి. మన ఉద్దేశాలను గమనించి, వాటిపై అవగాహనను పెంచుకోవాలి. అప్పుడే వాటిని అధిగమించి... అంతరాత్మను చేరుకోగలుగుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

కాశీ... మోక్షదాయిని ఎలా అయింది?

అక్కడ మోక్షం కోసం ఇళ్ళు అద్దెకు ఇస్తారు. మోక్షం కోసం సత్రాలు నడుపుతారు. మోక్షం కోసం హోటళ్ళలో గదులు ఇస్తారు. మోక్షం కోసం ఆశ్రమాలు కడతారు. మోక్షం కోసం ఇలా వసతిని సమకూర్చే ప్రదేశం మరెక్కడైనా ఉందా? మోక్షం లభిస్తుందని హామీ ఇచ్చే ఊరు మరొకటి ఉందా? ప్రపంచంలో మరెక్కడా లేదు... ఒక్క కాశీ నగరం తప్ప.

ఐఐటీ, నీట్ పరీక్షలకు గ్యారెంటీ ఇస్తున్న... కోట, హైదరాబాద్, ఢిల్లీ లాంటి ఊర్లున్నాయి. ఆ పరీక్షల్లో నెగ్గడానికి మా దగ్గర సులువైన మార్గాలు ఉన్నాయని చెప్పే సంస్థలు ఉన్నాయి. కానీ మోక్షానికి మార్గం చూపించే వ్యవస్థ ఎక్కడైనా ఉందా... ఒక్క కాశీలో తప్ప!

దేశం నలుమూలల నుంచి ఎందరెందరో కాశీ వస్తున్నారు... అక్కడ మోక్షం పొందాలని. కొందరు కాశీలోనే శాశ్వతంగా ఉండిపోతున్నారు. మరికొందరు తొమ్మిదినెలలు... ఇంకొందరు తొమ్మిది రోజులు. అలా తొమ్మిది నెలలు ఉండడానికి వచ్చిన రామశాస్త్రి అనే వ్యక్తిని కలిశాను. ఆయన బ్యాంకు మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. భార్యాసమేతంగా వచ్చి ఆంధ్రాశ్రమంలో ఉంటున్నారు. ఆంధ్రాశ్రమం ట్రస్టీ సుందరశాస్త్రి నాకు మంచి మిత్రులు. ఆ ఆశ్రమంలో సుమారు వంద గదులున్నాయి. వాటిలో పది గదులు ఇలా మోక్షం కోసం వచ్చిన వాళ్ళకు కేటాయిస్తారు.

అదొక చిన్న గది. అందులోనే వంట, భోజనాలు, నిద్ర. చదువుకోవడం. రామశాస్త్రిగారి మంచం మీద గీతాప్రెస్ వారు ప్రచురించిన 'శ్రీమద్భగవద్గీత' (తత్త్వవివేచనీ ఆంధ్రానువాదం) ఉంది.

"మీరు ఇక్కడ తొమ్మిది నెలలు ఉండాలని ఎందుకు నిర్ణయించుకున్నారు?" అని రామశాస్త్రిని అడిగాను.

"తల్లి గర్భంలో నవమాసాలు ఉంటాం. ఆ తరువాత భూమిమీదకు వస్తాం. కళ్ళు తెరిచి ప్రపంచాన్ని చూస్తాం. తొమ్మిది నెలలు కాశీలో ఉంటే... ఈ ప్రపంచం నుంచి ముక్తి దొరుకుతుంది. అంటే మోక్షం లభిస్తుంది. మరు జన్మ ఉండదు" అన్నారాయన.

"కాశీలో ఉన్నవారందరికీ ముక్తి లభిస్తుందా?" అని అడిగాను.

ఆయనను నేను వాదనల ఊబిలోకి దించుతున్నట్టు ఆయన భార్య భావించారు. "మోక్షం ఏమైనా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే రేషనా? లక్ష్యం కోసం అందరూ ప్రయత్నిస్తారు. కానీ ఫలితం ఏ కొందరికో దక్కుతుంది" అని అన్నారావిడ.

> జన్మ-పునర్జన్మల చక్రం నుంచి విముక్తి పొందడమే మోక్షం. భక్తి, జ్ఞాన, కర్మ మార్గాల ద్వారా మోక్షం పొందే అవకాశం కేవలం మనిషికే ఉంది.

"కాశీవాసానికి కొన్ని నియమ నిష్ఠలున్నాయి. 'బ్రహ్మవైవర్త పురాణం'లో వీటి గురించి చెప్పారు. నేల మీదనే పడుకోవాలి. చెప్పులు లేకుండా నడవాలి. శాకాహారం తినాలి. దయాదృష్టి ఉండాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. తక్కువ మాట్లాడాలి. ఎక్కువ ధ్యానం చేయాలి. కామ, క్రోధ, లోభాలకు దూరంగా ఉండాలి. సాత్త్విక జీవనం గడపాలి" అన్నారు రామశాస్త్రి.

"మీరేమీ అనుకోనంటే నా సందేహాలు నివృత్తి చేసుకుంటాను" అని అడిగాను.

ఆయన ధార్మిక గ్రంథాలు బాగా చదివారు. నా ఆసక్తిని గమనించి "అడగండి. మీతోపాటు నేనూ తెలుసుకుంటాను" అన్నారు చిరునవ్వుతో.

"ఈ లోకమంతా ఆ దేవుడి సృష్టే. ఆ సృష్టిలో మనం ఒక చిన్న భాగం. ఈ సృష్టిలో ఏ ప్రాణీ మోక్షం కోసం ప్రయత్నించడం లేదు మరి మనమెందుకు ప్రయత్నించాలి?" అని ప్రశ్నించాను.

నా పక్కనే కూర్చున్న సుందరశాస్త్రి 'ఇంకేమీ అడగొద్దు' అన్నట్టు నా చేతిమీద చెయ్యి వేస్తూ... "ఇది నమ్మకమండీ. నమ్మకానికీ, తర్కానికీ పొంతన కుదరదు" అన్నారు. సుందరశాస్త్రి కాశీలో తెలుగువారికి కేంద్రబిందువు. అందరితో ఆయనకు ఆప్యాయమైన సంబంధం ఉంది. అందుకే మిరపకాయల్లాంటి నా ప్రశ్నలను ఆపాలనుకున్నారు.

అయితే "లేదండీ సుందరం. వారు మంచి ప్రశ్న అడిగారు. సమాధానాన్ని కలిసి కనుక్కుందాం" అంటూ... "ఎనభై నాలుగు లక్షల జీవరాశుల్లో అనేకసార్లు పుట్టిన తరువాత, గిట్టిన తరువాత లభించే అపురూపమైన జన్మ... మానవ జన్మ. జీవరాశుల్లో మనిషికి మాత్రమే బుద్ధి ఉంది. అనేక జన్మల కర్మఫలాలు ఆ జీవుడితో ప్రయాణిస్తాయి. ఆ కర్మఫలాలను ఆ జీవి అనుభవించాలి. జన్మ-పునర్జన్మల చక్రం నుంచి విముక్తి పొందడమే మోక్షం. భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలద్వారా మోక్షం పొందే అవకాశం కేవలం మనిషికే ఉంది. అందుకే 'జంతూనాం నర జన్మ దుర్లభం' అన్నారు 'వివేక చూడామణి' గ్రంథంలో శంకరాచార్యులు" అని వివరించారు రామశాస్త్రి.

"మరి కాశీలోనే మోక్షం లభిస్తుందనడానికి ఏదైనా ఆధారం ఉందా?" అని అడిగాను.

"అవునండీ. 'కాశీ ఖండం' గ్రంథంలోని 26వ అధ్యాయంలో పేర్కొన్న ప్రకారం... మహా ప్రళయం తరువాత ఈ సృష్టి నాశనమయింది. అంతటా అంధకారం వ్యాపించింది. సూర్యుడు లేడు. చంద్రుడు లేడు. తారలు లేవు. ఉన్నదల్లా ఒక్కటే... బ్రహ్మం. అది మెదడుకు, మనసుకు అందనిది. రంగు, రూపం, పేర్లు లేనిది. విడదీయలేనిది. కానీ అది రెండుగా విడిపోవాలని అనుకుంది. అలా అభౌతిక బ్రహ్మం నుంచి భౌతికమైన శివ పార్వతులు ఉద్భవించారు. వారు ఆనందవనాన్ని (కాశీని) సృష్టించారు. ఆ ఆనందవనంలో విహరిస్తున్న శివ పార్వతులు మరో జీవిని సృష్టించాలనుకున్నారు. విష్ణువును సృష్టించారు. విష్ణువు ఒక చెరువును (విష్ణుకూపం) తవ్వాడు. దాని పక్కనే కూర్చొని... యాభై వేల ఏళ్ళు తపస్సు చేశాడు. అక్కడకు శివ పార్వతులు వచ్చారు. తపస్సుతో జ్వలిస్తున్న విష్ణువును చూశారు. విష్ణుకూపంలోకి శివుడు తొంగి చూస్తూ ఉండగా... ఆయన చెవి కుండలం జారి పడింది. ఆ కూపాన్ని 'మణికర్ణిక' (చెవికి అలంకారమైన రత్నం) అని పిలవాలని శివుడు ఆదేశించాడు. విష్ణువు తపస్సుకు మెచ్చిన శివుడు ఆయనను వరం కోరుకోమన్నాడు. నిత్యం శివపార్వతుల దర్శనం లభించాలని, శివుని పాదపద్మాల మకరందాన్ని సేవించడానికి తనకు తేనెటీగ రూపాన్ని ప్రసాదించాలని, ఇక్కడ మరణించినవారికి ముక్తి ప్రసాదించాలని విష్ణువు కోరాడు. శివుడు ఆ వరాలన్నీ ప్రసాదించాడు. అంతేకాదు... కాశీలో నివసించేవారికి ఎల్లప్పుడూ సత్యయుగమే కొనసాగుతుందనీ, ఇక్కడ పుణ్యకార్యాలు చేసేవారికి అమరత్వం కలుగుతుందనీ అభయమిచ్చాడు. అలా కాశీ మోక్షదాయిని అయింది" అని రామశాస్త్రి వివరిస్తూ... "మీకు అర్థమయిందా?" అని అడిగారు.

"అవునండీ. చాలా బాగా అర్థమయింది" అని నేను, సుందరశాస్త్రి ఒకేసారి అన్నాం.

"కాశీలోనే పుట్టి పెరిగిన నాకు కూడా ఈ విషయం తెలీదు. మీరు బాగా వివరించారు" అన్నారు సుందరశాస్త్రి.

"మీరు ఇంకా అడగాలని అనుకుంటున్నట్టున్నారు. అడగండి" అన్నారు రామశాస్త్రి నావైపు చూస్తూ.

"మేము మళ్ళీ వస్తామండీ. మాకు కాశీ మోక్షం గురించి చక్కగా చెప్పారు " అంటూ లేచారు సుందరశాస్త్రి. ఇద్దరం అక్కడినుంచి బయలుదేరాం.

• కిల్లాడ సత్యనారాయణ
8333987838

దైవమార్గం

శ్రమ దీక్షలు

క్రైస్తవులు ప్రతి సంవత్సరం నలభై రోజుల పాటు దీక్షను పాటిస్తారు. దాన్ని 'శ్రమదినాల దీక్ష' అంటారు. క్రీస్తు శిలువకు గురైన గుడ్ ఫ్రైడేకి నలభై రోజుల ముందు ఇది ప్రారంభమవుతుంది. ఈ దీక్షా సమయంలో నాలుగు నియమాలను కఠినంగా పాటిస్తారు. వాటిలో ఒకటి ఉపవాస ప్రార్థన. రెండోది పవిత్ర గ్రంథ పఠనం. మూడోది గత దోషాలను గుర్తించి... వాటికి పశ్చాత్తాపం చెందడం. మళ్ళీ వాటిని చేయకుండా ప్రవర్తనను సరిదిద్దుకోవడం. నాలుగోది... పేదలకు, అవసరంలో ఉన్నవారికి, వికలాంగులకు, రోగగ్రస్తులకు ధన రూపంలో, వస్తు రూపంలో, మంచిమాటల ఓదార్పు రూపంలో సాయపడడం. దాన ధర్మాలు చేయడం. ఇవి పాటించడం ద్వారా గుడ్ ఫ్రైడేకి సంసిద్ధులు కావడం జరుగుతుంది. రాబోయే క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) ఉత్సవం కోసం హృదయాలను పవిత్రపరుచుకున్నట్టు అవుతుంది. ఇవే కాకుండా... ఇంకా అనేక రూపాల్లో సహాయాలు చేసేవారూ ఉంటారు. ఈ దీక్షల లక్ష్యం: మనిషిలోని అహంకారాది గుణాలు తొలగిపోవడం. సాత్త్విక భావాలు కలగడం. తోటివారిని ప్రేమించడం. ప్రభువు నేర్పిన ప్రధాన సూత్రాల్లో దేవుణ్ణి ఆరాధించడం ఒకటైతే, తోటివారిని ప్రేమించడం మరొకటి. ఎందుకంటే మన చుట్టూ ఉన్నవారిని ప్రేమించి ఆదరించడమే... ఏ మతానికైనా ఉండే మానవతాపరమైన ప్రాతిపదిక.

ఈ శ్రమదినాలను తపఃకాలంగా క్యాథలిక్‌లు భావిస్తారు. ప్రతి శుక్రవారం శిలువ మార్గ ప్రార్థనల్లో పాల్గొంటారు. ప్రభువు మరణ సంఘటనను పద్నాలుగు స్థలాలుగా (ఘట్టాలుగా) భావించి... ఆ స్థలాల్లో శిలువ యాత్రా సన్నివేశాలను స్మరించుకుంటారు. ఆ సమయంలో తప్పనిసరిగా ఉపవాసాల్లోనే ఉంటారు. ఈ శ్రమదినాల నిష్ఠ... ఈస్టర్‌కు ఒక అర్థవంతమైన పరిపుష్టిని కలిగిస్తుంది. 'నేనే మార్గం' అని ఏసు ప్రభువు చెప్పాడు. ఆ మార్గం సులువైనది కాదని, అది 'శిలువ మార్గం' అని ఈ శ్రమదినాల్లో మరింతగా అర్థమవుతుంది. ఆయన మార్గంలో సాగించే పయనంలోని కష్టం, క్లిష్టత అనంతరం... హృదయానందం ఏమిటనేది స్పష్టమవుతుంది. క్రీస్తు జననం కన్నా... ఆయన మరణ, పునరుత్థాన ఘట్టాల ద్వారానే క్రీస్తు స్వరాన్ని, ధ్యేయాన్నీ, ఆయన బోధల్లోని అంతరార్థాన్ని స్పష్టంగా గ్రహించగలం. ఆయన మరణానికి కారణం... మనం చేసిన పాపాలేనని, వాటి నుంచి మనల్ని విముక్తి చేయడానికే ఆయన శిలువ ఎక్కాడనీ భావించి... చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది, ఆ దైవ కృపకోసం ప్రార్థించేందుకు లభించిన అవకాశమే ఈ శ్రమదినాల దీక్షలు.



• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

చింతన

హృదయం పిలుపు విందాం

మనకు ఎన్నో విషయాలు ఎదురవుతాయి. మన మనో ప్రవృత్తిలోనే ఎన్నో మార్పులు వస్తూ ఉంటాయి. కానీ వాటిని అర్థం చేసుకోలేం. మనం ఎన్నో పుస్తకాలు చదివినా నేర్చుకోలేనివి, ఎంత అధ్యయనం చేసినా తెలుసుకోలేనివి ఎన్నో ఉన్నాయి. ఇలాంటి అనేక విషయాలను అర్థం చేసుకోవాలంటే... ముందుగా ఒక విషయాన్ని మనం గ్రహించాల్సి ఉంది. అది చాలా ముఖ్యమైనది.

మనకంటూ ఏదీ స్థిరంగా ఉండదు. ఒక రోజు నిద్ర లేవగానే మూడ్ బాగుంటుంది. మరో రోజు బాగుండదు. ఒకోసారి ఇంట్లో పనులకే చిరాకుపడతాం. ఒకోసారి ఉద్యోగ పరిస్థితులు బాలేక, ఒంట్లో బాలేక చికాకు పుట్టుకొస్తుంది. దీన్నంతటినీ అర్థం చేసుకొనే శక్తి మన మనసుకు ఉండదు. కానీ హృదయం అర్థం చేసుకోగలదు. ఉదాహరణకు... మీరు ఎక్కడికో వెళ్తున్నారు. ఇందలో ఏదో జరిగి కోపం వచ్చింది. ఆ కోపంలో అరవడం, కేకలు వేయడం లాంటివి చేస్తారు. అలా కోపగించుకోవడం తప్పని మీకు అనిపిస్తుంది. జీవితంలో మీకు కేవలం ఆ ఒక్కసారే కోపం వచ్చిందా? లేదు. కోపం వచ్చాక... ఆ తరువాత దాన్ని మరచిపోతాం. మళ్ళీ కోపం వస్తుంది. మళ్ళీ మరచిపోతాం. అలాంటి పరిస్థితుల్లో మీరు దేనికి నచ్చజెబుతారు? మీ మనసుకా? హృదయానికా?



ఎందుకంటే మనిషిలో రెండు రకాల రాజ్యాలున్నాయి. ఒక దానికి రాజు మనసైతే, మరో చోట రాజు... హృదయం. మనం ఇంకా జీవిస్తూ ఉండడానికి మూలమైన శ్వాసను ఎవరు ప్రేమిస్తారో, సమస్తానికీ కారణమైన శక్తిని ఎవరు ప్రేమిస్తారో... వారు ధన్యులు. ఇదే హృదయ కాంక్ష. కానీ మనసు కాంక్షించేది ఏమిటి? మనసు ఆ శక్తిని, ఆ దైవాన్ని అర్థం చేసుకోదు, చేసుకోలేదు. అది సదా మారుతూ ఉంటుంది. అయినప్పటికీ... యావత్ ప్రపంచం మనసును సంతోషంగా ఉంచడానికీ, శాంతంగా ఉంచడానికీ ప్రయత్నిస్తూనే ఉంది. కానీ ఎవరి మనసులోనూ ఈనాటివరకూ శాంతి లేదు. మనసు విషయంలో ప్రతీదీ మారుతుంది. అక్కడ ఏదీ శాశ్వతం కాదు. కాబట్టి మనసును కాకుండా హృదయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. హృదయాన్ని ప్రేమించాలి.

"మా హృదయం పిలుపును ఎలా వినాలి?" అని చాలామంది నన్ను అడుగుతూ ఉంటారు. హృదయం పిలుపును వినాలంటే... మనసు పిలుపును వినడాన్ని తగ్గించాలి. ఎందుకంటే మనసు గొంతు చాలా పెద్దది. ఎప్పుడైనా రేడియో సౌండ్ ఎక్కువగా ఉండి, పక్కవారి మాటలు వినబడకపోతే మీరేం చేస్తారు? మీరు ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు... పక్కన అంతా గోలగోలగా ఉంటే ఎలా స్పందిస్తారు? ఆ గోల ఆపమంటారు. లేదా దూరంగా వెళ్ళిపోతారు. హృదయం పిలుపును వినాలంటే కూడా చేయాల్సింది ఇదే. హృదయం మీతో ఏదో చెబుతోంది. ఎప్పటినుంచో చెబుతోంది. చెబుతూనే ఉంటుంది. కానీ మనసు గోల, మనసు చేసే అలజడి కారణంగా మనకేదీ వినిపించడం లేదు. కాబట్టి మనసు అలజడిని తగ్గించి, హృదయం పిలుపును వినాలి. అర్థం చేసుకోవాలి. ఇంతకీ ఆ పిలుపు ఏమిటి? "నీ లోపలికి వస్తూ, పోతూ ఉన్న ఈ శ్వాసను అర్థం చేసుకో! నీ జీవితాన్ని సఫలం చేసుకో. నీ హృదయంలో ఉన్నదాన్ని ప్రేమించు. హృదయంలోనే పరమాత్మ కొలువై ఉన్నాడు" అని. ఆ పిలుపును వినాలంటే మిగతా శబ్దాలన్నిటినీ తగ్గించుకోవడం చాలా అవసరం. దానికోసం మన జీవితంలో హృదయం కేంద్రమైన ప్రపంచాన్ని ఏర్పరచుకోవాలి. అప్పుడు ఈ ప్రపంచాన్ని సృష్టించిన పరమాత్మ మీద శ్రద్ధ వహిస్తారు. జగత్తుతో అనుబంధం ఏర్పరచుకుంటారు. ఈ విషయంలో మీరు సరైన నిర్ణయం తీసుకుంటే... ఆ దిశగా మీ ఎదుగుదల మొదలవుతుంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/gxtt9iNలో
చదవండి.



ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

పశ్చాత్తాపంతోనే మన్నింపు

సందేశం

మహా ప్రవక్త మహమ్మద్ చెప్పిన కథ ఇది: పూర్వం చెడు మార్గంలో పడిన ఒక వ్యక్తి ఉండేవాడు. అతను తొంభై తొమ్మిది హత్యలు చేశాడు. తను చేస్తున్నది మహా పాపమని అతను తెలుసుకున్నాడు. పాప విముక్తి కోసం తనకు దారి చూపేవారికోసం అన్వేషించాడు. చివరకు దైవభక్తుడైన ఒక పండితుడి గురించి తెలిసింది. అతను ఆ పండితుడి దగ్గరకు వెళ్ళి "అయ్యా! నేను తొంభై తొమ్మిది హత్యలు చేశాను. నా తౌబాను (పశ్చాత్తాపాన్ని) దేవుడు స్వీకరిస్తాడా?" అని అడిగాడు. అప్పుడు ఆ పండితుడు "లేదు. అందుకు ఎలాంటి అవకాశం లేదు" అన్నాడు. అది వినగానే ఆ వ్యక్తి నిరాశకు గురయ్యాడు. కోపం వచ్చింది. ఆ పండితుణ్ణి కూడా చంపేశాడు. దీనితో అతను వంద హత్యలు చేసినట్టయింది. ఆ తరువాత అతను ఎంతో మనస్తాపానికి గురయ్యాడు. 'ఆగ్రహావేశాలతో మరొకరిని చంపాను. నన్ను దేవుడు కనికరించడు. ఇకపై ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కోపగించను. దేవుడి కటాక్షం కోసం ఓర్పుతో ఉంటాను. ఎంత కష్టమైన పడతాను' అనుకున్నాడు.

కొన్నాళ్ళు అన్వేషించాక... మళ్ళీ మరో పండితుణ్ణి కలిశాడు. ఆయనకు తన పరిస్థితి వివరిస్తూ "నేను వంద హత్యలు చేశాను. నా తౌబా అంగీకారం పొందుతుందా? నా పాపానికి నిష్కృతి ఉందా?" అని ప్రశ్నించాడు. "నీకు ఒక ప్రదేశం గురించి చెబుతాను. అక్కడ దైవారాధనలో నిమగ్నమైన దేవుని ప్రియదాసులు ఉన్నారు. వారి దగ్గరకు వెళ్ళు. మళ్ళీ ఇక్కడకు రాకు. ఎందుకంటే ఇక్కడ నువ్వు నిన్ను మార్చుకొనే అవకాశం లేదు. పశ్చాత్తాపం పొందే పరిస్థితి లేదు" అని చెప్పాడు. ఆ పండితుడి సూచన మేరకు ఆ వ్యక్తి బయలుదేరాడు. ఆ ప్రయాణంలో అతనిలో ఎంతో మార్పు వచ్చింది. పశ్చాత్తాపంతో అతని హృదయం పరిశుద్ధమయింది. విశ్వాసిగా జీవించడంలోనే మానవ జీవితానికి పరమార్థం ఉందని గ్రహించాడు. పూర్తి విశ్వాసిగా మారాడు. ఈలోగా... అతను తన గమ్యస్థలానికి మధ్యలో ఉండగానే మృత్యువు ఆసన్నమైంది. అతను మరణించాడు.



> తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పశ్చాత్తాపం, క్షమాపణ కోసం భగవంతుణ్ణి వేడుకొని... హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవడం ద్వారా వాటికి మన్నింపు లభిస్తుంది. అది జరగాలంటే దైవంపై పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి.

అప్పుడు కారుణ్య దూతలు, శిక్షించే దూతలు వచ్చారు. "అతను తన పాపాలకు పశ్చాత్తాపం చెంది, దేవుడిపైన దృష్టి కేంద్రీకరించి ఇటు వచ్చాడు" అన్నారు కారుణ్య దూతలు. "కాదు. అతను ఇంకా ఎలాంటి పుణ్యకార్యం చేయలేదు" అన్నారు శిక్షా దూతలు. వారి వాదన ఎంతకూ తెగకపోవడంతో... ఆకాశంలో వెళ్తున్న ఒక దేవదూతను మధ్యవర్తిగా పిలిచారు. "ఆ వ్యక్తి ఎటు నుంచి వచ్చాడో చూడండి. ఆ ప్రదేశం దగ్గరగా ఉందా? అతను చేరాల్సిన గమ్యం దగ్గరగా ఉందా? అనేది కొలిచి చూడండి" అని ఆ దేవదూత సలహా ఇచ్చాడు. అప్పుడు వాళ్ళు చెరోవైపూ కొలిచారు. ఆ వ్యక్తి గమ్యమే దగ్గరగా ఉందని తేలింది. అతని ఆత్మను కారుణ్య దూతలు తీసుకువెళ్ళారు.. దేవుడు ఆ వ్యక్తిని కటాక్షించాడు.

తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పశ్చాత్తాపం, క్షమాపణ కోసం భగవంతుణ్ణి వేడుకొని... హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవడం ద్వారా వాటికి మన్నింపు లభిస్తుంది. అది జరగాలంటే దైవంపై పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి. జరిగిన వాటినే తలచుకొని కుమిలిపోవడం వల్ల, నిరాశా నిస్పృహలకు లోను కావడం వల్లా మన తప్పులకు క్షమాపణ దొరకదు. నిజాయితీగా పాపాలను ఒప్పుకొని, పశ్చాత్తాపంతో దైవం మన్నింపును కోరుకోవడమే విశ్వాసులు చేయవలసిన పని.

• మహమ్మద్ వహీదుద్దీన్

అరుదైన సినిమా అవుతుంది




"గామి' అరుదైన సినిమా. ఆరేళ్లపాటు అంకితభావంతో తెరకెక్కించడం మామూలు విషయం కాదు. సినిమాపై ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన 'గామి' చిత్రం ట్రైలర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇది రెగ్యులర్ చిత్రం కాదు. మాస్ అంశాలు ఉండవు. అయినా 'గామి' ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు తర్వాత ఏం జరగబోతోందో అనే ఉత్సుకత ప్రేక్షకుల్లో కలుగుతుందని విద్యాధర్ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారికీ, సాయం చేసిన వారికి నిర్మాత శబరీషన్ ధన్యవాదాలు తెలిపారు.

శ్రీవిష్ణు డబుల్ ధమాకా



గురువారం హీరో శ్రీవిష్ణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన కథానాయకుడిగా రెండు కొత్త చిత్రాలను నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంయుక్తంగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అల్లు అరవింద్ సమర్పకులు. 'ఎస్ వీ 18' వర్కింగ్ టైటిల్. వినూత్నమైన ప్రేమకథా చిత్రమిదని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. అలాగే హసిత్ గోలీ దర్శకత్వంలో శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రానికి 'శ్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

మనసు నొచ్చుకుంటే మన్నించండి



నాగేంద్రబాబు

వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగేంద్రబాబు మాట్లాడుతూ 'ఆరడుగుల మూడంగుళాలు ఉండే హీరోలు పోలీసు పాత్రలు చేస్తే బావుంటుంది. ఐదడుగుల మూడంగుళాలు ఉండే హీరోలయితే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంద'ని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు టాలీవుడ్ హీరోల అభిమానులు సోషల్ మీడియాలో నాగబాబు తీరును తప్పుపట్టారు. దీంతో సోషల్ మీడియా వేదికగా నాగేంద్రబాబు స్పందించారు. 'ఎవరినో తక్కువ చేయాలని అలా మాట్లాడలేదు, నా మాటల వల్ల ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే క్షమించండి' అని కోరారు.

అరి అన్వేషణ



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'అరి'. 'పేపర్‌బాయ్' ఫేం జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి వినోద్ వర్మ క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గ్రంథాలయంలో తీక్షణంగా శోధిస్తున్న లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్. సినిమాటోగ్రఫీ: కృష్ణ ప్రసాద్

ముచ్చటగా మూడోసారి



నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ ముచ్చటగా మూడోసారి ఓ సినిమాను పట్టాలెక్కించనున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో కథానాయకుడిగా ప్రియదర్శి నటించనున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఈ చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సూపర్ హిట్ కాంబోగా పేరున్న వీరిద్దరి నుంచి గతంలో వచ్చిన రెండు చిత్రాలూ విశేష ప్రేక్షకాదరణను పొందాయి. దీంతో ఈ మూడవ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి వీరిద్దరి కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'జెంటిల్‌మేన్' 2016లో విడుదలై భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ సినిమాలో నాని, నివేథా థామస్, సురభి నటించారు. ఆ తర్వాత 2017లో వచ్చిన మరో సూపర్ హిట్ చిత్రం 'సమ్మోహనం' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఇందులో సుధీర్ బాబు, అదితి రావు హైదరీ ప్రధాన పాత్రలు పోషించారు.

తల్లి కాబోతున్న దీపికా పదుకొణె



బాలీవుడ్ బెస్ట్ కపుల్స్‌లో ఒకరిగా పేరొందిన దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ జంట అభిమానులకు తీపి కబురందించారు. త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నామని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సెప్టెంబర్‌లో డెలివరీ డేట్ ఇచ్చారని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2013లో రణ్‌వీర్, దీపికా 'రామ్‌లీలా'లో కలిసి నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఇరువురూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 2018లో వీరిద్దరూ ఇటలీలో ఘనంగా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు.

మంచి సినిమాతో వస్తున్నాం



శివ కందుకూరి

శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర నారాయణ' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శివ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'క్రైమ్, డిటెక్టివ్ థ్రిల్లర్స్ తెలుగులో చాలా వచ్చాయి. అందుకే ఏదో కొత్తదనం ఉంటే తప్ప అలాంటి సినిమా చేయకూడదని అనుకున్నాను. 'భూతద్దం భాస్కర నారాయణ' చిత్ర కథ విన్నాక కొత్తగా అనిపించింది. ఎందుకంటే ఇందులో మైథాలజీ ఎలిమెంట్ కూడా ఉంది. దిష్టి బొమ్మ చూస్తుంటాం. కానీ అసలు ఎందుకది అనే విషయాన్ని పట్టించుకోం. దీని గురించి పురాణాల్లో ఒక కథ ఉంది. ఆ కథకు క్రైమ్, డిటెక్షన్ అంశాలు జోడించాం. కచ్చితంగా ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తుండడం మరింత బలాన్ని ఇచ్చింది' అని చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో... ఎస్ 99



సి.జగన్ మోహన్ దర్శకత్వంలో యతీష్, నందిని నిర్మించిన 'ఎస్ 99' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఇటీవలే నిర్వహించారు. ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ అందివ్వాలనే ఉద్దేశంతో విలక్షణ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నామని దర్శకుడు తెలిపారు. ఇది విజువల్స్, సౌండ్ ప్రధానంగా సాగే కాన్సెప్ట్ బేస్డ్ చిత్రమన్నారు. ఎటువంటి నేరచరిత్ర లేని ఒక వ్యక్తి క్రైమ్‌కు పాల్పడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించడమే కథాంశమని వివరించారు. సినిమాకు టీం స్పిరిట్ ప్రధానమని, ఈ విషయంలో మాకు మంచి టీం దొరికిందని నిర్మాత యతీష్ సంతోషం వ్యక్తం చేశారు.

జానపద, సినీగాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత



ప్రముఖ జానపద, సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్(64) గురువారం ఉదయం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌లోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు భార్య ఇందిర, కుమార్తె మానస ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 14వేల ప్రదర్శనలను ఇచ్చిన శ్రీనివాస్ తొలిసారిగా 'నమస్తే అన్న' చిత్రంలో 'గరం... గరం... పోరీ... నా గజ్జెల సవారీ' పాట పాడారు. ఆ తర్వాత నాగార్జున 'కింగ్' సినిమాలో 'గింత, గింత బాల చుక్కవే' పాట పాడారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' చిత్రంలో శ్రీనివాస్ పాడిన 'గన్ను లాంటి కన్నులున్న...' పాట ఎంతో హిట్ అయ్యింది. ఈ పాటకు 2012 సంవత్సరంలో ఉత్తమగాయకుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. గురువారం సాయంత్రం వడ్డేపల్లి శ్రీనివాస్ అంత్యక్రియలు సీతాఫల్‌మండి శ్మశానవాటికలో జరిగాయి.

బౌద్ధనగర్ (ఆంధ్రజ్యోతి)

భళా భారత్!

విశ్లేషకుల అంచనాలను మించిన ఆర్థిక ప్రగతి

- మూడో త్రైమాసికంలో 8.4 శాతానికి జీడీపీ వృద్ధి
- మాన్యుఫాక్చరింగ్, మైనింగ్, నిర్మాణ రంగాల్లో జోష్
- 2023-24 వృద్ధి రేటు అంచనా 7.6 శాతానికి పెంపు



న్యూఢిల్లీ: భారత ఆర్థిక ప్రగతి చక్రం మరింత వేగం పుంజుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏకంగా 8.4 శాతానికి ఎగబాకింది. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు అంచనా వేసిన 6.6 శాతం వృద్ధితో పోలిస్తే చాలా అధికమిది. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకోగలిగింది. తయారీ రంగం రెండంకెల వృద్ధిని కనబర్చడంతో పాటు మైనింగ్ అండ్ క్వారీయింగ్, నిర్మాణ రంగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే త్రైమాసికానికి వృద్ధి రేటు 4.3 శాతంగా ఉంది. క్యూ3 వృద్ధి అంచనాలను మించడంతో పాటు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసిక (క్యూ1) వృద్ధి రేటును తొలుత ప్రకటించిన 7.8 శాతం నుంచి 8.2 శాతానికి పెంచింది.

సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసిక (క్యూ2) వృద్ధి రేటును సైతం 7.6 శాతం నుంచి 8.1 శాతానికి పెంచింది. అలాగే, రెండో ముందస్తు అంచనాల్లో భాగంగా ఎన్ఎస్ఓ ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి వృద్ధి రేటు అంచనాను సైతం 7.3 శాతం నుంచి 7.6 శాతానికి పెంచింది. అయితే, గత ఆర్థిక సంవత్సరం (2022-23) జీడీపీ వృద్ధి అంచనాను మాత్రం గతంలో ప్రకటించిన 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గించడం గమనార్హం. ఎన్ఎస్ఓ గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ క్యూ3లో వాస్తవిక జీడీపీ లేదా స్థిర ధరల (2011-12) ఆధారిత జీడీపీని రూ.43.72 లక్షల కోట్లుగా అంచనా వేశారు. 2022-23లో ఇదే త్రైమాసికానికి నమోదైన రియల్ జీడీపీ రూ.40.35 లక్షల కోట్లతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 8.4 శాతం వృద్ధి నమోదైంది. ఇకపోతే, క్యూ3లో నామమాత్ర జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీని రూ.75.49 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

2022-23 క్యూ3లో నమోదైన రూ.68.58 లక్షల కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 10.1 శాతం వృద్ధిని అంచనా వేశారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి వాస్తవిక జీడీపీ రూ.172.90 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన జీడీపీ రూ.160.71 లక్షల కోట్లతో పోలిస్తే 7.6 శాతం అధికమిది. కాగా, ఈసారి నామినల్ జీడీపీ రూ.293.90 లక్షల కోట్ల స్థాయికి పెరగవచ్చని అంచనా. 2022-23లో రూ.269.50 లక్షల కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 9.1 శాతం వృద్ధి చెందవచ్చని ఎన్ఎస్ఓ భావిస్తోంది.

దేశ ఆర్థిక వ్యవస్థ శక్తి సామర్థ్యాలకు సంకేతం

మూడో త్రైమాసికంలో 8.4 శాతం జీడీపీ వృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థ సత్తాను ప్రదర్శించింది. దేశం వేగంగా వృద్ధి చెందడంతో పాటు 140 కోట్ల మంది దేశవాసులు మెరుగైన జీవనం గడిపేందుకు, వికసిత్ భారత సృష్టికి ప్రభుత్వం కృషిని కొనసాగిస్తుంది.

- ప్రధాని నరేంద్ర మోదీ

గత ఆర్థిక సంవత్సరం అంచనాలు తగ్గించడం వల్లే..

గత ఆర్థిక సంవత్సరంలో కొన్ని త్రైమాసికాల జీడీపీ వృద్ధి అంచనాలను తగ్గించడమే ఈసారి జీడీపీ గణాంకాలు మెరుగ్గా కన్పిస్తుండటానికి ప్రధాన కారణం. ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాల జోరు అంచనాలను మించిన నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను దీర్ఘకాలంపాటు గరిష్ఠ స్థాయిల వద్దే కొనసాగించవచ్చు. ఆర్‌బీఐ కఠిన పరపతి విధానంలో వచ్చే ఆరు నెలల వరకు మార్పు ఉండకపోవచ్చు.

- సుమన్ చౌదురి, చీఫ్ ఎకనామిస్ట్ అండ్ రీసెర్చ్ హెడ్, అక్యూట్ రేటింగ్స్

15 నెలల కనిష్ఠానికి కీలక రంగాల పనితీరు

ఈ ఏడాది జనవరిలో 8 కీలక రంగాల (బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ) వృద్ధి 15 నెలల కనిష్ఠ స్థాయి 3.6 శాతానికి తగ్గింది. రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, ఎలక్ట్రిసిటీ రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణమైంది. 2022 డిసెంబరులో ఈ రంగాల వృద్ధి 4.9 శాతంగా నమోదైంది. 2023 జనవరిలో 9.7 శాతంగా ఉంది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాలకు 40.27 శాతం వాటా ఉంది.

రూ.11 లక్షల కోట్లకు ద్రవ్యలోటు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జనవరితో ముగిసిన పది నెలలకు ద్రవ్యలోటు రూ.11 లక్షల కోట్లకు పెరిగింది. బడ్జెట్‌లో అంచనాలో 63.6 శాతానికి సమానమిది. 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం ద్రవ్యలోటును రూ.17.35 లక్షల కోట్లు (జీడీపీలో 5.8 శాతం)గా అంచనా వేసింది. ప్రభుత్వ ఆదాయ, వ్యయ అంతరాన్ని ద్రవ్యలోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాలు సమీకరించడం ద్వారా ప్రభుత్వం ఈ లోటును పూడ్చుకుంటుంది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గడిచిన పది నెలల్లో మొత్తం రూ.22.52 లక్షల కోట్ల (సవరించిన బడ్జెట్ అంచనాలో 81.7 శాతం) ఆదాయం సమకూరగా.. మొత్తం వ్యయం రూ.33.54 లక్షల కోట్లుగా (సవరించిన బడ్జెట్ అంచనాలో 74.7 శాతం) నమోదైంది.

'కోహాన్స్'లో సువెన్ ఫార్మా విలీనం

న్యూఢిల్లీ: భారత ఫార్మా రంగంలో మరో విలీనం చోటు చేసుకుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే సువెన్ ఫార్మా కంపెనీ కోహాన్స్ లైఫ్ సైన్సెస్‌లో విలీనమవుతోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశాయి. విలీన ఒప్పందం ప్రకారం ప్రతి 295 కోహాన్స్ షేర్లకు 11 సువెన్ ఫార్మా షేర్లు జారీ చేస్తారు. రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారుల ఆమోదంతో వచ్చే 12-15 నెలల్లో ఈ విలీన ప్రక్రియ పూర్తి అవుతుందని భావిస్తున్నారు

హైదరాబాద్‌లో మోడ్‌మెడ్ జీసీసీ కేంద్రం

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరింది. ప్రపంచవ్యాప్తంగా ఆస్పత్రులకు 'ఆల్ ఇన్ వన్' క్లౌడ్ సేవలు అందించే మోడ్‌మెడ్ తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్ హైటెక్ సిటీలో 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. కంపెనీకి భారత్‌లో ఇదే తొలి జీసీసీ కేంద్రం. ఈ కేంద్ర నిర్వహణ కోసం మోడ్‌మెడ్ ఇప్పటికే 100 మంది ఉద్యోగులను నియమించుకుంది. ఈ ఏడాది చివరికల్లా వీరి సంఖ్య 200కు చేరనుంది. 'మోడ్‌మెడ్ ప్రయాణంలో ఇదో మైలురాయి. హైదరాబాద్ టెక్ ఎకోసిస్టమ్, నిపుణులైన ఉద్యోగుల లభ్యత మా అభివృద్ధిని మరింత వేగిరం చేస్తాయని భావిస్తున్నాం' అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ డేనియల్ కేన్ చెప్పారు.

మెడ్‌ట్రానిక్ ఎంఈఐసీ సెంటర్ విస్తరణ

రూ.3,000 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: మెడికల్ టెక్నాలజీలో అంతర్జాతీయంగా పేరున్న మెడ్‌ట్రానిక్.. హైదరాబాద్‌లోని తన ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసీ)ను మరింత విస్తరించింది. 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు గురువారం ప్రారంభించారు. ఈ విస్తరణ కేంద్రం కోసం మెడ్‌ట్రానిక్ సంస్థ రూ.3,000 కోట్లు ఖర్చు చేసింది. అమెరికా వెలుపల కంపెనీకి ఇదే అతిపెద్ద ఆర్ అండ్ డీ కేంద్రం. ప్రస్తుతం 900 మందికి పైగా ఉన్న ఉద్యోగుల సంఖ్యను భవిష్యత్‌లో 1,500కు పెంచనున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ కార్యక్రమంలో మెడ్‌ట్రానిక్ ఛైర్మన్, సీఈఓ జియోఫ్ మార్తా, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,830 ▼	57,580 ▼	75,700 ▲
ముంబై	62,241 ▲	57,013 ▲	69,312 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ	
హైదరాబాద్	460
మార్చి 1వ తేదీ	
చిత్తూరు	513
గోదావరి	460
విజయవాడ	460
విశాఖపట్నం	500
వరంగల్	462
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126
వరంగల్	126
కరీంనగర్	126
మహబూబ్‌నగర్	126
కర్నూలు	126
విశాఖపట్నం	127
గోదావరి	134
విజయవాడ	134
గుంటూరు	134
ఒంగోలు	134
చిత్తూరు	133

లాభాల్లోకి మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం లాభాలతో ముగిసింది. రోజంతా ఆటుపోట్లకు లోనైన మార్కెట్, ట్రేడింగ్ చివర్లో లాభాల బాట పట్టింది. దీంతో సెన్సెక్స్ 195.42 పాయింట్ల లాభంతో 72,500.30 దగ్గర ముగియగా నిఫ్టీ 31.65 పాయింట్ల లాభంతో 21,982.80 వద్ద క్లోజైంది. గురువారం ఫిబ్రవరి నెల డెరివేటివ్స్ సెటిల్మెంట్‌కు చివరి రోజు కావడం, ఈ వారం వెలువడే కీలక ఆర్థిక గణాంకాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన మార్కెట్‌ను వెంటాడింది. షాంఘై తప్ప మిగతా ఆసియా మార్కెట్లు నష్టాల్లో ట్రేడవటం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

లగ్జరీ యూరోపియన్ ఫర్నీచర్‌లోకి ఆల్టెరో

హైదరాబాద్: లగ్జరీ యూరోపియన్ ఫర్నీచర్ ఉత్పత్తుల విక్రయంలోకి ఆల్టెరో అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో కంపెనీ తొలి స్టోర్‌ను ప్రారంభించింది. యూరప్‌లోనే డిజైన్, తయారు చేసిన ఫర్నీచర్ ఇక్కడ అందుబాటులో ఉంటాయని ఆల్టెరో ఎండీ చందన కోగంటి తెలిపారు. ప్రతి ఉత్పత్తి డిజైన్, కలర్ వేటికవే ప్రత్యేకతమని ఆమె చెప్పారు. ఈ ఫర్నీచర్ ఉత్పత్తుల ధర రూ.5 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటాయని వివరించారు. రానున్న రోజుల్లో దేశంలోని ప్రధాన నగరాల్లో ఆల్టెరో స్టోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లగ్జరీ గృహాలకు రోజురోజుకు డిమాండ్ పెరిగిపోతోందని, అందుకు తగ్గట్టుగానే నాణ్యమైన, ఖరీదైన ఫర్నీచర్‌ను వినియోగదారులు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం భారత లగ్జరీ ఫర్నీచర్ మార్కెట్ రూ.36,100 కోట్లుగా ఉంది.

విస్తరణ బాటలో ఎంటీఆర్

త్వరలో మరిన్ని కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్: వెజిటబుల్ మసాలాలు, ఆహార ఉత్పత్తుల తయారీ కంపెనీ ఎంటీఆర్.. తన ఉత్పత్తుల పోర్టుఫోలియోను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. గురువారం నాడిక్కడ కంపెనీ వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంటీఆర్ సీఈఓ సునయ్ భాసిన్ మాట్లాడుతూ.. రెడీ టు మీల్స్, దోశ, ఇడ్లీ పిండి (బ్యాటర్) ఉత్పత్తులను త్వరలో విడుదల చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. ఎంటీఆర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లు చాలా కీలకంగా ఉన్నాయని, కంపెనీ ఉత్పత్తులైన సాంబార్, రసం పౌడర్, గులాబ్ జామూన్ మిక్స్ ఉత్పత్తులకు ఇక్కడ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కంపెనీని మరింత పటిష్ఠం చేసే ఉద్దేశంతో గడచిన మూడేళ్లలో దాదాపు రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన చెప్పారు. కాగా కంపెనీ ఇప్పటికే ఏపీలోని గుంటూరులో చిల్లీ పౌడర్ ప్లాంట్‌ను నిర్వహిస్తోందని, తాజాగా ఇక్కడ మసాలా ఉత్పత్తుల కోసం ప్రత్యేకమైన ఉత్పత్తి లైన్‌ను ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.30 కోట్లతో ఈ ఉత్పత్తి లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భాసిన్ పేర్కొన్నారు. కాగా వెర్మిసెల్లీ ఉత్పత్తి కోసం హైదరాబాద్‌లో ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భారత్ బిల్ పే మరింత పటిష్ఠం

సవరించిన నిబంధనలు జారీ చేసిన ఆర్‌బీఐ

ముంబై: దేశంలో బిల్లు చెల్లింపుల విధానం మరింత వేగవంతం చేయడంతో పాటు అధిక భాగస్వామ్యం, కస్టమర్‌కు మరింత రక్షణ కల్పించే విధంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సవరించిన నిబంధనలు జారీ చేసింది. చెల్లింపుల వ్యవస్థలో ఇటీవల కాలంలో విశేషమైన పరిణామాలు చోటు చేసుకున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన నిబంధనలు మరింత ఆధునికం చేయాలన్న లక్ష్యంతో "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత్ బిల్ పేమెంట్) నిబంధనలు, 2024" పేరిట ఈ నూతన విధివిధానాలు నిర్దేశించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బ్యాంకులు, ఎన్‌పీసీఐ భారత్ బిల్‌పే లిమిటెడ్, ఇతర నాన్ బ్యాంక్ పేమెంట్ వ్యవస్థలన్నింటికీ ఈ నూతన నిబంధనలు వర్తిస్తాయి. భారత్ బిల్ పేమెంట్ వ్యవస్థ (బీబీపీఎస్) యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, కార్డులు, నగదు, ప్రీపెయిడ్ చెల్లింపు సాధనాలన్నింటి ద్వారా బిల్లు వసూళ్లు, చెల్లింపు కార్యకలాపాలకు ఒక సమర్థవంతమైన వేదిక. మొబైల్ యాప్‌లు, మొబైల్ బ్యాంకింగ్, ఫిజికల్ ఏజెంట్లు, బ్యాంక్ బ్రాంచీల ద్వారా ఈ కార్యకలాపాలన్నీ జరుగుతూ ఉంటాయి. ఈ వ్యవస్థలో భాగస్వాములయ్యేందుకు ఎవరు అర్హులు, దీనికి సంబంధించిన సాంకేతిక ప్రమాణాలేవి వంటి వివరాలన్నింటితో కూడిన నూతన నియమ నిబంధనలను భారత్ బిల్ పే సెంట్రల్ యూనిట్ (బీబీపీసీయూ) నిర్దేశిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది.

ప్రతిష్ఠాత్మక బ్రాండ్స్ ఆఫ్ ఆసియాలో 'అమరాన్'కు చోటు



హైదరాబాద్: అమరాన్ బ్రాండ్ ఆటోమోటివ్ బ్యాటరీలకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్ఈ అండ్ ఎం) కంపెనీ తయారు చేసే ఈ బ్యాటరీల బ్రాండ్‌కు 'ప్రిస్టేజియస్ బ్రాండ్స్ ఆఫ్ ఆసియా 2023-24' గుర్తింపు లభించింది. దుబాయ్‌లో హెరాల్డ్ గ్లోబల్ అండ్ బార్క్ ఆసియా నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సింపోజియంలో ఆటోమేటివ్ బ్యాటరీల విభాగంలో అమరాన్‌కు ఈ గుర్తింపు లభించింది. ఇదే సదస్సులో ఏఆర్ఈ అండ్ ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన గౌరినేనిని మార్కెటింగ్ మీస్టర్, 2023-24 అవార్డుతో సత్కరించారు.

స్పోర్ట్స్

రాహుల్ అవుట్

బుమ్రా వచ్చేశాడు

ఆఖరి టెస్టుకు భారత జట్టు



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరిదైన ఐదో టెస్టు కోసం భారత జట్టును ప్రకటించారు. ధర్మశాలలో ఈనెల 7 నుంచి జరుగనున్న ఈ మ్యాచ్ కోసం 16 మంది ఆటగాళ్ల జాబితాను సెలెక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. అయితే మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఇంకా కోలుకోలేదు. గాయంతో బాధపడుతున్న అతను ఈ టెస్టుకు కూడా దూరమవుతున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. మరోవైపు పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఆఖరి టెస్టుకు ఎంపిక చేశారు. ఇక రాహుల్ ఐదు టెస్టుల సిరీస్‌లో కేవలం మొదటి టెస్టు మాత్రమే ఆడగా, ఆ తర్వాత తొడ కండరాల గాయంతో వైదొలిగాడు. వైద్య నిపుణుల అభిప్రాయం తీసుకునేందుకు రాహుల్ లండన్ వెళ్లాడు. గతేడాది కూడా ఇదే గాయంతో 4 నెలల పాటు విశ్రాంతి తీసుకున్న రాహుల్.. ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌ల్లోనూ ఆడే అవకాశం లేదు. తను జట్టులో లేకపోవడంతో రజత్ పటీదార్ కొనసాగవచ్చు. కానీ పేలవ ఫామ్ లో ఉన్న అతడికి తుది జట్టులో చోటు కష్టమే. ధర్మశాలలో దేవ్‌దత్ పడిక్కళ్‌కు చాన్స్ లభించ

బుమ్రా కమ్‌బ్యాక్

రాంచీలో జరిగిన నాలుగో టెస్టులో స్టార్ పేసర్ బుమ్రాకు పని ఒత్తిడి కారణంగా విశ్రాంతినిచ్చారు. ఇప్పుడు చివరి టెస్టులో చోటు కల్పించారు. ఆడిన మూడు టెస్టుల్లోనే 17 వికెట్లు తీసిన బుమ్రా..జడేజా, అశ్విన్‌లతో కలిసి టాప్‌లో ఉన్నాడు. అయితే రాంచీలో గెలిచిన భారత్ 3-1తో ఇప్పటికే సిరీస్ కూడా సాధించింది. సిరీస్ గెలిస్తే అతనికి ఆఖరి టెస్టులోనూ విశ్రాంతి కల్పిస్తారని తొలుత భావించారు. మరోవైపు బుమ్రా రాకతో తుది జట్టులో ఆకాశ్ దీప్‌నకు చోటు దక్కుతుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. అరంగేట్ర టెస్టులోనే ఈ బెంగాల్ పేసర్ మూడు వికెట్లతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇక 2 నుంచి జరిగే రంజీ సెమీస్‌లో తమిళనాడుకు ఆడేందుకు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను విడుదల చేశారు. ఆ మ్యాచ్ ముగిశాక అవసరమైతే తిరిగి భారత జట్టుతో కలుస్తాడు.

భారత జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రజత్ పటీదార్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, రవి అశ్విన్, బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్, దేవ్‌దత్ పడిక్కళ్, కేఎస్ భరత్, అక్షర్ పటేల్.

ఎవరో.. కొత్త చాంప్?

ప్రొ కబడ్డీ ఫైనల్లో హరియాణాతో పుణె ఢీ నేడు

రాత్రి 8 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..



హైదరాబాద్: మూడు మాసాలు అలరించిన ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10 తుది అంకానికి చేరుకొంది. గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం జరిగే టైటిల్ ఫైట్‌లో పుణెరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్ అమీతుమీ తేల్చుకోనుంది. సీజన్ ఆసాంతం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పుణె.. సెమీస్‌లో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. ఆల్‌రౌండర్లు అస్లం ఇనామ్‌దార్, పంకజ్ మోహిత్ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2023 ఫైనల్లో జైపూర్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన పల్టన్.. ఈసారి టైటిల్ నెగ్గాలన్న పట్టుదలతో ఉంది. మరోవైపు ఒడిదొడుకులు ఎదుర్కొంటూ ప్లేఆఫ్స్‌కు చేరుకొన్న హరియాణా తొలిసారి తుది పోరుకు అర్హత సాధించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసిన స్టీలర్స్.. సెమీస్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిచ్చింది. ఇరుజట్లూ ఒక్కసారి కూడా టైటిల్ నెగ్గకపోవడంతో.. ఏ టీమ్ గెలిచినా కొత్త చాంపియన్ ఆవిర్భవించడం ఖాయం.

బెంగళూరుకు ఝలక్

మంధాన పోరాటం వృథా ఢిల్లీ ఘనవిజయం



బెంగళూరు: వరుస విజయాలతో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు తొలి ఓటమి ఎదురైంది. రికార్డు ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన (43 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 74) అద్భుత ఆటతీరును కనబరిచినా ఫలితం లేకపోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్ షోతో 25 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ లీగ్‌లో ఈ జట్టుకిదే అత్యధిక స్కోరు. తొలి ఓవర్‌లోనే క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న ఓపెనర్ షఫాలీ వర్మ (31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50) మెరుపు అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. మరో ఓపెనర్ లానింగ్ (11) విఫలమైనా.. షఫాలీ-ఎలిస్ క్యాప్సీ (33 బంతుల్లో 46) జోడీ ఆర్‌సీబీ బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. 12వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన షఫాలీ ఆ వెంటనే అవుటైంది. మరుసటి ఓవర్‌లోనే క్యాప్సీ వెనుదిరగ్గా రెండో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివర్లో జెస్ జొనాసెన్ (16 బంతుల్లో 36 నాటౌట్), మరిజానె కాప్ (16 బంతుల్లో 32) కదం తొక్కడంతో ఆఖరి ఐదు ఓవర్లలోనే జట్టు 70 రన్స్ రాబట్టింది.

మంధాన ఆడినా...

భారీ ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన మాత్రమే పోరాడడంతో బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 169 పరుగులు చేసి ఓడింది. తొలి వికెట్‌కు డివైన్ (23)తో కలిసి మంధాన 77 పరుగులు జోడించింది. మంధానాను 12వ ఓవర్‌లో కాప్ అవుట్ చేయడం దెబ్బతీసింది. అటు మేఘన (36) కాస్త నిదానంగా ఆడడంతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పెరిగింది. ఉన్న కాసేపు రిచా ఘోష్ (19) మాత్రం ఆకట్టుకుంది. వేగంగా ఆడే క్రమంలో ఆర్‌సీబీ టపటపా వికెట్లను కోల్పోయింది. ఈక్రమంలో చివరి ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు.

సంక్షిప్త స్కోర్లు: ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 194/5. (షఫాలీ 50, క్యాప్సీ 46, జొనాసెన్ 36 నాటౌట్, కాప్ 32; డివైన్ 2/23 డిక్లెర్క్ 2/35); **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు:** 20 ఓవర్లలో 169/9 (మంధాన 74, మేఘన 36, డివైన్ 23; జొనాసెన్ 3/21, కాప్ 2/35, అరుంధతి రెడ్డి 2/38).

టీ20 వరల్డ్‌కప్‌నకు కిషన్, అయ్యర్ కష్టమేనా!



న్యూఢిల్లీ: సీనియర్ క్రికెటర్లు ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌లకు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు నిరాకరించడం భారత క్రికెట్‌లో సంచలనం రేపింది. ఇటీవలి కాలంలో టీమిండియాలో తరచూ కనిపించే వీరికి వార్షిక కాంట్రాక్టులు లభించక పోవడంతో.. జూన్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కడం కష్టంగా మారింది. వ్యక్తిగత కారణాలతో సౌతాఫ్రికా టూర్ మధ్యలోనే కిషన్ వైదొలగగా.. ఇంగ్లండ్‌తో అయ్యర్ రెండు టెస్టులు ఆడాడు. అయితే, వీరికి కాంట్రాక్టులు ఎందుకివ్వలేదనే విషయాన్ని బోర్డు ఎక్కడా స్పష్టం చేయలేదు. కానీ, దేశవాళీ క్రికెట్‌ను నిర్లక్ష్యం చేస్తున్న వారికి గట్టి హెచ్చరికలే పంపిందని విశ్లేషకులు చెబుతున్నారు. బోర్డు ప్రకటనలో కూడా ఫిట్‌గా ఉన్న ఆటగాళ్లు.. జాతీయ జట్టుకు దూరమైనప్పుడు ఆయా సమయాల్లో జరుగుతున్న దేశవాళీ లీగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది.

అందరినీ సమంగా చూడాలి

'బీసీసీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తా. ప్రతి ఆటగాడూ దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే. ఖాళీగా ఉన్న సమయంలో కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా రాష్ట్రం తరఫున ఆడాలి. అయ్యర్, కిషన్‌లపైనే చర్యలు తీసుకోవడం సబబుకాదు. ఈ విషయంలో అందరికీ ఒకే తరహా నిబంధనలు ఉండాలి.'

కీర్తి ఆజాద్, 1983 వరల్డ్‌కప్ జట్టు సభ్యుడు

శ్రేయాస్ స్వయంకృతమా?

శ్రేయాస్ తన భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకొంటున్నాడన్న వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి. రెండో టెస్ట్ తర్వాత వెన్నునొప్పిగా ఉందని తప్పుకొన్నాడు. అయితే జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) మెడికల్ టీమ్ మాత్రం అతను మ్యాచ్‌కు ఫిట్‌గా ఉన్నట్టు నివేదిక ఇచ్చింది. అయినా కూడా ఎంపికకు అందుబాటులో ఉండేందుకు అయ్యర్ నిరాకరించినట్టు సమాచారం. రంజీలు కూడా ఆడకుండా.. నైట్‌రైడర్స్ నిర్వహించిన ప్రీ సీజన్ క్యాంప్‌లో శ్రేయాస్ పాల్గొనడం సెలెక్టర్లకు ఏమాత్రం రుచించలేదట. ఇషాన్‌ను కూడా దేశవాళీ క్రికెట్ ఆడాలని కోచ్ ద్రవిడ్ సూచించాడు. అయితే, హార్దిక్ పాండ్యాతో కలసి ఐపీఎల్‌కు సన్నద్ధమవుతున్నట్టు సోషల్ మీడియాలో ఫొటోలు వచ్చాయి.



మేఘనకు సీఎం అభినందన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : ఉగాండాలో జరిగిన బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ చాలెంజ్‌లో కాంస్యం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి మేఘనా రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో అభినందించారు. మేఘన స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా.

అప్పుడే ధోనీతో పోలికా?



న్యూఢిల్లీ: యువ కీపర్ ధ్రువ్ జురెల్.. మరో ధోనీ అంటూ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలతో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విభేదించాడు. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్ విజయంలో జురెల్ కీలకపాత్ర పోషించాడు. తీవ్ర ఒత్తిడిలోనూ ధ్రువ్ ఆడిన తీరును దాదా సైతం ప్రశంసించాడు. 'అతడేమీ ధోనీ కాదు. తనదైన ఆటను ఆడుకోనివ్వండి. స్పిన్నర్లు, పేసర్లను.. ముఖ్యంగా ఒత్తిడి సమయాల్లో ధ్రువ్ ఎదుర్కొంటున్న తీరు ఆకట్టుకొంద'ని గంగూలీ చెప్పాడు.

ఐర్లాండ్‌కు ఆధిక్యం

అఫ్ఘాన్‌తో ఏకైక టెస్టు

అబుధాబి : అఫ్ఘానిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 101/4తో రెండో రోజు ఆట కొనసాగించిన ఐర్లాండ్ 263 పరుగుల వద్ద ఆలౌటైంది. దీంతో ఆ జట్టుకు 108 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినట్టయింది. స్టిర్లింగ్ (56), కాంఫెర్ (49) రాణించారు. రెహ్మాన్‌కు ఐదు, నవీద్‌కు 3 వికెట్లు లభించాయి. అనంతరం అఫ్ఘాన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 134 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. అఫ్ఘాన్ జట్టు ప్రస్తుతం 26 పరుగుల ఆధిక్యంలో మాత్రమే ఉంది. అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 155 రన్స్‌కే ఆలౌటైంది.

క్వార్టర్స్‌కు గాయత్రి జోడీ

జర్మన్ ఓపెన్



ముల్హీమ్ అన్ డెర్ రుహ్ర్ (జర్మనీ): జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో గాయత్రి జంట క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో నాలుగో సీడ్ ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల జోడీ 21-10, 21-11తో చెక్ జంట కత్రీనా జుజకొవా-సోనియా హొరిన్‌కొవాపై సునాయాసంగా గెలిచింది. కాగా, సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో ఆకర్షి కశ్యప్ 13-21, 14-21తో మియా బ్లిచ్‌ఫీల్డ్ (డెన్మార్క్) చేతిలో, సతీష్ కుమార్ కరుణాకరన్ 18-21, 22-24తో ఎన్హట్ గుయన్ (ఐర్లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు.

గ్రీన్ అజేయ శతకం

ఆసీస్ 279/9
కివీస్‌తో తొలి టెస్ట్



వెల్లింగ్టన్: కామెరూన్ గ్రీన్ (103 బ్యాటింగ్) శతకంతో ఆదుకోవడంతో.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా కోలుకొంది. గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో మొదటి రోజు ఆటనిలిచే సమయానికి ఆస్ట్రేలియా 279/9 స్కోరు చేసింది. గ్రీన్‌తోపాటు పరుగులేమీ చేయకుండా హాజిల్‌వుడ్ క్రీజులో ఉన్నాడు. మార్ష్ (40), ఖవాజా (33), స్మిత్ (31)లకు చక్కని ఆరంభాలు దక్కినా.. భారీ స్కోర్లుగా మలచలేక పోయారు. మాట్ హెన్రీ 4 వికెట్లు పడగొట్టగా.. విలియమ్, కుగ్గలీన్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు.

నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పాలమూరు ప్రాజెక్టు సందర్శన

- రేవంత్ మినహా పర్యటనకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- ప్రాజెక్టు పనులు, వాటి నాణ్యత పరిశీలన
- బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ'కు కౌంటర్‌గా..

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 29: ఓవైపు బీఆర్ఎస్ నేతలు మేడిగడ్డ పర్యటనకు వెళ్తున్న క్రమంలో.. మరోవైపు ఉమ్మడి పాలమూరు జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐ) సందర్శించబోతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేల్లో సీఎం రేవంత్‌రెడ్డి మినహా మిగతా 11 మంది పాలమూరు ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను శుక్రవారం సందర్శించనున్నారు. అక్కడ జరిగిన పనులు, వాటి నాణ్యతను పరిశీలించనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.. పాలమూరు-రంగారెడ్డి పథకంలోనూ కమీషన్ల కోసం ఇష్టానుసారంగా అంచనాలు పెంచి డిజైన్ మార్చారని ఆ పార్టీ నేతలు ఎప్పట్నుంచో ఆరోపణలు చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ'కు కౌంటర్‌గా.. పాలమూరు ప్రాజెక్టును సందర్శించి అక్కడి లోపాలను ఎత్తిచూపేందుకు ఆ పార్టీ సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది..

సమస్యను పక్కదోవ పట్టించేందుకే చలో మేడిగడ్డ: చాడ

హుస్నాబాద్, ఫిబ్రవరి 29: సమస్యను పక్కదోవ పట్టించేందుకే బీఆర్ఎస్ చలో మేడిగడ్డ కార్యక్రమాన్ని చేపట్టిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'కేటీఆర్ మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించకపోవచ్చు. కాని కేసీఆర్ మాత్రం ఎన్నోసార్లు చూశారు కదా. కేటీఆర్ అక్కడికెళ్లి ఏం చూస్తారు? ప్రాజెక్టు కుంగలేదంటారా? పగుళ్లు లేవని చెబుతాడా? ప్రాజెక్టు మొత్తం బాగుందని చెబుతాడా?" అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై కాగ్ ఇచ్చిన నివేదికను గుర్తుంచుకోవాలన్నారు. దీనిపై జ్యుడిషియల్ విచారణ జరుగుతుందని, దానికి ముందే వారికి ఉలుకెందుకని ప్రశ్నించారు.

3 విప్లవ పార్టీల ఐక్యతతో 'మాస్‌లైన్'

- జాతీయ పార్టీగా ఏర్పాటుకు నిర్ణయం
- ఖమ్మంలో 3, 4, 5న జాతీయ మహాసభలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 29: దశాబ్దాల పాటు తుపాకీ పట్టి అజ్ఞాత జీవితం గడుపుతూ దున్నేవానికే భూమి, ప్రజలకే రాజ్యాధికారం దక్కాలని ఉద్యమాలు చేసినా ప్రజాసమస్యలు పరిష్కారం కాలేదు. అంతర్గతంగా మరో 40ఏళ్ల పాటు అజ్ఞాతమా, సామాజిక పోరాటమా అంటూ చర్చలు జరిపిన మూడు విప్లవ పార్టీలు ఐక్యత దిశగా అడుగులు వేశాయి. తెలంగాణలోని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా, అస్సోం, త్రిపుర, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్ బిహార్ రాష్ట్రాల్లో పనిచేస్తున్న పీసీసీ సీపీఐ(ఎంఎల్), అలాగే 12 రాష్ట్రాల్లో కార్మిక, రైతు, ఉద్యమాలు చేస్తున్న సీపీఐ(ఎంఎల్) రెవెల్యూషనరీ ఇనిషియేటివ్ పార్టీలు కలిసి 'మాస్‌లైన్' జాతీయ పార్టీగా ఏర్పడేందుకు అంగీకారం కుదుర్చుకున్నాయి. ఐక్యంగా జాతీయ స్థాయిలో పోరాటాలు చేయాలని ఈ మూడు పార్టీలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలోనే మార్చి 3, 4, 5వ తేదీలో ఖమ్మంలో జాతీయ మహాసభలు నిర్వహించనున్నారు. 3న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి పెవిలియన్ మైదానం వరకు వేలాది మందితో ర్యాలీ, గ్రేట్‌మార్చ్, బహిరంగసభ నిర్వహించనున్నారు. 4, 5 తేదీల్లో భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల మహాసభలు నిర్వహించనున్నారు. ఇందులోనే కేంద్ర కమిటీ ఎన్నిక ఇతర రాజకీయ నిర్ణయాలు తీసుకోనున్నారు. మాస్‌లైన్ పార్టీ ఆవిర్భావ జాతీయ మహాసభలకు జర్మనీ ఎంఎల్‌డీపీడీ పార్టీ ప్రతినిధులు, నేపాల్ సీపీఐ(ఎంఎల్) ముసాల్ ప్రతినిధి, శ్రీలంక పార్టీ ప్రతినిధి సౌహార్ధ అతిథులుగా హాజరుకానున్నారు. ఈ మహాసభలకోసం ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మాస్‌లైన్ పార్టీ జెండాలను ఏర్పాటు చేశారు.

నేడు బాబ్లీ నుంచి నీటి విడుదల

మెండోర, ఫిబ్రవరి 29: తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు శుక్రవారం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. వేసవిలో గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఏడాది మార్చి 1న 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదులుతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శ్రీరాంసాగర్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, ప్రాజెక్టు అధికారులు.. బాబ్లీ ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రాజెక్టు గేట్లను ఎత్తనున్నారు.

హాలియా మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

హాలియా, ఫిబ్రవరి 29: నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీ కాంగ్రెస్ సొంతమైంది. మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్, బీఆర్ఎస్‌కు చెందిన వెంపటి పార్వతమ్మ, వైస్ ఛైర్మన్ నల్లగొండ సుధాకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మున్సిపాలిటీలోని 12 మంది కౌన్సిలర్లలో ఎనిమిది మంది ఛైర్‌పర్సన్‌పై ఫిబ్రవరి 10 న అవిశ్వాసం పెట్టారు. దీనిపై గురువారం సమావేశం నిర్వహించగా హాజరైన పది మంది(ఎనిమిది మంది కాంగ్రెస్, ఇద్దరు బీఆర్ఎస్) సభ్యులు అవిశ్వాసానికి మద్దతు పలికారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో చెన్నయ్య ప్రకటించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యుడు, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సమావేశానికి హాజరైనా, సరిపోను సభ్యులు ఉండడంతో ఆయన ఓటింగ్‌లో పాల్గొనలేదు.

'గొర్రెల' అక్రమాల కేసులో కదులుతున్న డొంక

- ఏసీబీ కస్టడీలో నోరువిప్పుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- విచారణలో వెలుగులోకి కొత్త పేర్లు!

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గొర్రెల కొనుగోళ్ల బిల్లు చెల్లింపులో అక్రమాల కేసులో అవినీతి డొంక కదులుతోంది. ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపిన వేర్వేరు ప్రభుత్వ విభాగాలకు చెందిన డి.రవి, ఎం.ఆదిత్య కేశవసాయి, పి.రఘుపతి రెడ్డి, సంగు గణేష్‌ను గత వారం ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితుల్ని విచారించడం వల్ల కేసుకు సంబంధించి మరింత సమాచారం, ఆధారాలు పొందడానికి కోర్టు అనుమతితో దర్యాప్తు అధికారులు వారిని కస్టడీకి తీసుకున్నారు. వీరిని కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్న ఈ నలుగురిని గురువారం ఉదయం కస్టడీకి తీసుకున్న అధికారులు బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. గొర్రెల కొనుగోలు, బిల్లుల చెల్లింపునకు సంబంధించిన ఖాతాల వివరాల నమోదు, డబ్బుల పంపిణీ వంటి పలు అంశాలకు సంబంధించిన కీలక సమాచారం వెల్లడించినట్లు తెలిసింది. ఈ కేసులో తమతోపాటు భాగస్వాములుగా ఉన్న మరి కొందరు ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల పేర్లు కూడా ఏసీబీ అధికారులకు చెప్పినట్లు సమాచారం. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతుల ఫిర్యాదు మేరకు రూ.2.10 కోట్ల గోల్‌మాల్‌లో ఎవరెవరి వాటా ఎంత, ఎవరెవరి ఖాతాల్లోకి నిధులు మళ్లించారనే విషయాల్ని నలుగురు నిందితుల్ని అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమాధానాల్ని క్రోడీకరించి విశ్లేషిస్తున్నారు. రెండో రోజూ విచారణకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉండి ప్రస్తుతం విదేశాల్లో ఉన్న మొహిదొద్దీన్, అతని కుమారుడికి సంబంధించిన సమాచారాన్నీ రాబడుతున్నారు ఏసీబీ అధికారులు.

నేడు గోదావరి బోర్డు సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగనుంది. ఇప్పటికే బోర్డులో చర్చించే ఎజెండాను విడుదల చేశారు. అయితే గోదావరి జలాల పంపిణీ కోసం ట్రిబ్యునల్ వేయాలనే ఏపీ విజ్ఞప్తిని కూడా ఎజెండాలో చేర్చడంపై తెలంగాణ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ శుక్రవారం లేఖ రాసింది. ఆ అంశంపై చర్చించే అధికారం బోర్డుకు లేదని అందులో స్పష్టం చేసింది. కాగా, బోర్డుకు నిధులు, తదితర అంశాలపై శుక్రవారం జరిగే సమావేశంలో చర్చించనున్నారు.

కేటీఆర్‌ను కాంగ్రెస్ కార్యకర్త ఓడిస్తాడు

సీఎంపై పోటీ చేసే స్థాయి కేటీఆర్‌ది కాదు.. కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో మంత్రి తుమ్మల

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి):"కేటీఆర్‌ది సీఎం రేవంత్‌రెడ్డి స్థాయి కాదు. కేటీఆర్‌ను కాంగ్రెస్ కార్యకర్త ఓడిస్తాడు. సీఎంపై పోటీ చేసే స్థాయి కేటీఆర్‌ది కాదు" అని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి, మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తే.. తాను సిరిసిల్ల ఎమ్మెల్యే పదవిని వదులుకుని బరిలో దిగుతానంటూ కేటీఆర్ విసిరిన సవాలుపై మంత్రి తుమ్మల స్పందించారు. కేటీఆర్ మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే.. తాము కాంగ్రెస్ కార్యకర్తను నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. "అందుకు సిద్ధమా?" అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల అండదండలతో రేవంత్‌రెడ్డి ఎంపీగా గెలిచారని, పీసీసీ అధ్యక్షుడిగా.. ముఖ్యమంత్రిగా ఎదిగారని గుర్తుచేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం మల్కాజిగిరి నుంచే మొదలవ్వాలని ఆకాంక్షించారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన కాంగ్రెస్ కూకట్‌పల్లి



నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. అంతకుముందు నియోజకవర్గానికి చెందిన 100 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజీవరావు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పిస్తాం..

సిరిసిల్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ల కోసం జీవో ఇచ్చి, సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంపై తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్, ఆసాముల సమన్వయ కమిటీ, సీఐటీయూ ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలను కలిసి, వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలకు సంబంధించిన బకాయిలను, ఇతర సబ్సిడీలను చెల్లించలేదని ఈ సందర్భంగా వారు తుమ్మలకు వివరించారు. దీనిపై మంత్రి స్పందించారని, పెండింగ్ బకాయిల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళతానని హామీ ఇచ్చారని నేతన్నలు తెలిపారు.

నేడు బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ'

వాస్తవాలను ప్రజల ముందుంచుతాం: కేటీఆర్.. కాంగ్రెస్ బండారం బయటపెడతాం: కడియం

హైదరాబాద్/భూపాలపల్లి/హనుమకొండ టౌన్/న్యూఢిల్లీ/సుబేదారి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నేడు (శుక్రవారం) చలో మేడిగడ్డ కార్యక్రమం చేపట్టినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డపై ప్రజలకు అసలు నిజాలు తెలియపరిచే ఉద్దేశంతో బీఆర్ఎస్ చేపట్టిన ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలందరితో కలిసి వెళ్లనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. 200 మందికి పైగా పార్టీ నేతలతో బస్సుల్లో బయలుదేరి వెళ్లి.. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించి.. అక్కడి నుంచే మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలియపరుస్తామన్నారు. మరోవైపు 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నుంచి బస్సులో వస్తున్న కేటీఆర్‌ను వరంగల్ నేతలు జనగామ సమీపంలో నెల్లుట్ల వద్ద ఉదయం 10 గంటలకు స్వాగతం పలికి ర్యాలీగా మేడిగడ్డకు బయలుదేరి వెళ్లనున్నారు. గురువారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు, బాల్క సుమన్, తదితర బీఆర్ఎస్ నేతలు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీ పరిసరాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇటు హనుమకొండలోని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. ఇందులో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ



స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, నేతలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కడియం మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చూపుతామని, కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయం కోసం వాడుకుంటున్న కాంగ్రెస్ బండారం బయటపెడతామని చెప్పారు.

బొందలగడ్డకు ఎందుకు: రామచంద్ర

బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ' కార్యక్రమంపై కాంగ్రెస్ నేతలు ఫైర్ అయ్యారు. మేడిగడ్డ సందర్శనకు వెళ్లే ముందు.. అసెంబ్లీకి ఎందుకు రాలేదో కేసీఆర్ ప్రజలకు చెప్పాలని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ డిమాండ్ చేశారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'నేషనల్ డ్యామ్స్ అథారిటీ సూచనలు ఖాతరు చేయకుండా.. శాస్త్రీయత లేకుండా నిర్మించారు. మేడిగడ్డను బొందలగడ్డ అని పిలిచిన కేసీఆర్.. మరి బీఆర్ఎస్ నేతలను అక్కడికి ఎందుకు పంపుతున్నారో ప్రజలకు వివరణ ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. మందుల సామెల్ మాట్లాడుతూ.. కేసీఆర్, హరీశ్‌లు మేడిగడ్డకు బొక్క కొట్టారు. దీన్ని చూడటానికి వెళ్తున్నారా కేటీఆర్..? కమీషన్ల కోసం కాళేశ్వరమని అన్నందుకు నాయిని నర్సింహారెడ్డికి టికెట్ ఇవ్వలేదు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో 2, 3 సీట్లు గెలవాలని చూస్తున్నారు కానీ అది నెరవేరదు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు' అని చెప్పారు. కాకమ్మ కథలు చెప్పేందుకే బీఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటన చేస్తుందని ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి విమర్శించారు. బీఆర్ఎస్ తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం రాజకీయ లబ్ధి కోసం చేపట్టిందే తప్ప రైతుల లబ్ధి కోసం చేపట్టింది కాదన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి నిపుణులు చెప్పేదాని కోసం అందరూ ఎదురుచూస్తుంటే ఆ డ్యామ్‌కు పగులుపెట్టిందే కాంగ్రెస్ అని బీఆర్ఎస్ దుష్ప్రచారానికి తెరలేపిందని మండిపడ్డారు. చేసిన పాపాలకు కేసీఆర్ లెంపలేసుకోవాలన్నారు.

ప్రజలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి: కూనంనేని

మేడిగడ్డకు బీఆర్ఎస్ నేతలు ఎందుకెళ్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'మీ హయాంలోనే నిర్మించిన మేడిగడ్డ కుంగింది. అన్నారం బ్యారేజీలో పగుళ్లు ఏర్పడ్డాయి. మేడిగడ్డను బొందలగడ్డ అని.. అక్కడికే పంపుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణులు ఏది చెబితే అది చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నిపుణులు త్వరగా తేల్చితే పరిష్కారం దొరుకుతుంది' అని అన్నారు.

పాలమూరు వెనకబాటుకు కాంగ్రెస్సే కారణం..

పాలమూరు జిల్లా వెనుకబాటుకు, అక్కడి నుంచి 14 లక్షల మంది వలస వెళ్లడానికి కాంగ్రెస్ విధానాలే కారణమని బీఆర్ఎస్ నేతలు వి.శ్రీనివాస్‌గౌడ్, సి.లక్ష్మారెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ జెండా ఎత్తుకున్నాకే.. అక్కడ ప్రాజెక్టుల నిర్మాణానికి శిలాఫలకాలు పడ్డాయన్నారు. అయితే ఆయా ప్రాజెక్టుల నిర్మాణాన్ని కాంగ్రెస్ పెండింగ్‌లో పెడితే.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిచేశామని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కాంగ్రెస్ అవరోధాలు సృష్టించినా కేసీఆర్ 90 శాతం పనులు చేపట్టామన్నారు. మిగిలిపోయిన పనులు పూర్తి చేయాల్సిందిపోయి.. కాంగ్రెస్ నేతలు పాలమూరు యాత్ర చేయడం హాస్యాస్పదమన్నారు.

'కారుణ్యా'లకు ఓకే

- 178మంది వీఆర్వోల కుటుంబాలకు న్యాయం
- ఉత్తర్వులు జారీ చేశాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, కొత్తగూడెం/కల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నిరుద్యోగ యువత కన్న కలలు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాకారమవుతున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తాజాగా 178 మంది పూర్వ వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో, అనేక కారణాలతో మరణించిన 178 మంది వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్న విజ్ఞప్తుల మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేస్తూ కొత్త చట్టం అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా వీఆర్వోలను ఇతర డిపార్ట్‌మెంట్లలో సర్దుబాటు చేస్తున్న క్రమంలో కొందరు వీఆర్వోలు మనోవేదనకు గురై అకాల మరణం చెందారు. ఆ కుటుంబాలకు న్యాయం చేసేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాగా పూర్వ వీఆర్వోల కుటుంబాలకు అర్హతల మేరకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల వీఆర్వోల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఇక, రాష్ట్రంలో రెవెన్యూశాఖను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలో గురువారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ, భగీరథ, పోలీసు, అటవీశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించిందని తెలిపారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు బీఆర్ఎస్‌ను వీడి గురువారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు దాదాపు 150మంది కాంగ్రెస్‌లో చేరారు. కంచర్ల గతంలో దాదాపు 20ఏళ్లు కాంగ్రెస్ కొనసాగారు.



అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో సాసర్ పిట్ వద్ద నీరు తాగడానికి వచ్చినచిరుత

అమ్రాబాద్ అభయారణ్యంలో చిరుతలు 173

- రాష్ట్ర వ్యాప్తంగా 334 నుంచి 297కు తగ్గుదల
- దేశ వ్యాప్తంగా 2022 గణనను వెల్లడించిన ఎన్‌టీసీఏ

మన్ననూర్, ఫిబ్రవరి 29: నాగర్‌కర్నూలు తదితర జిల్లాల్లో విస్తరించి ఉన్న అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో చిరుత పులుల సంఖ్య పెరిగింది. దేశ వ్యాప్తంగా చిరుత పులుల గణకాల నివేదికను నేషనల్ కన్సర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ), వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసింది. నివేదిక ప్రకారం.. అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్)లో 2018లో 160 చిరుతలుండగా 2022 నాటికి 173కి పెరిగాయి. అయితే తెలంగాణ వ్యాప్తంగా 2018లో 334 చిరుతలుండగా 2022 నాటికి వాటి సంఖ్య 297కు తగ్గింది. చిరుత పులులకు నల్లమల ప్రాంతంలో అనువైన వాతావరణం, మెరుగైన పరిరక్షణ పద్దతులు ఉన్న కారణంగానే వాటి సంఖ్య పెరిగిందని డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, అమ్రాబాద్, మన్ననూరు రేంజ్ అధికారులు ఈశ్వర్, ఆదిత్య తెలిపారు. రిజర్వు అభయారణ్యం, పులుల అభయారణ్య ప్రాంతాల వారీగా అడవులను విభజించగా, రిజర్వు ఫారెస్ట్‌లో నాలుగేళ్లకొకసారి మాత్రమే పులుల గణన జరుగుతుంది.

మల్కాజిగిరిలోనే తేల్చుకుందాం!

దమ్ముంటే సీఎం, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిరా.. నేనూ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వస్తా

- మల్కాజిగిరిలో ఎవరేంటో చూద్దాం
- మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏది రాజకీయ ప్రేరేపిత నివేదిక
- మా హరీశ్ చెప్పినట్లు మీకు చేతకాకుంటే దిగిపోండి
- మేడిగడ్డకు పరిష్కారం చూపుతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): 'లోక్‌సభ ఎన్నికల్లో నీ సిటింగ్ సీటులోనే తేల్చుకుందాం. రేవంత్! నీకు దమ్ముంటే సీఎం పదవికి, కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిరా. నేనూ సిరిసిల్ల ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి వస్తా. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో పోటీ చేద్దాం. ఎవరి సత్తా ఏంటో చూద్దాం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. దమ్ముంటే ఒక్క ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌ను గెలిపించాలంటూ ఇటీవల రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌కు ప్రతిగా.. ఎక్కడో ఎందుకు నీ సొంత నియోజకవర్గంలోనే తేల్చుకుందాం అంటూ ప్రతిసవాల్ విసిరారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానం పరిధిలో ఎన్ని ఎమ్మెల్యే సీట్లు గెలిపించావ్? ఎంతమంది కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిచారు? అని రేవంత్‌ను నిలదీశారు. మల్కాజిగిరి నుంచి పోటీకి రేవంత్ సిద్ధమైతే.. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను బతిమాలి టికెట్ దక్కించుకుంటానన్నారు. మగాడివైతే మీ పార్టీని గెలిపించు అన్న సీఎం వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ఏం మాటలవి. గెలిస్తే మగవాడు. ఓడితే కాదా? అంటే ఎన్నికల్లో మగాళ్లు తప్ప ఆడవాళ్లు గెలవొద్దనా నీ ఉద్దేశం. 2018లో కొడంగల్‌లో ఓడినపుడు నువ్వు మగాడివి కాదా?' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, దాన్ని పట్టుకొని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రేవంత్‌కు తగదన్నారు. రేవంత్‌రెడ్డికి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉందని, తానే సీఎంనంటూ అన్ని సార్లు చెప్పుకొంటున్నారంటే.. సీఎంగానే ఉన్నాననే నమ్మకం రేవంత్‌కు లేనట్టుందన్నారు. మగాడివైతే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చెయ్యాలని, రైతుభరోసా ప్రారంభించి 70 లక్షల మంది ఖాతాల్లో డబ్బులు వెయ్యాలని, మహాలక్ష్మి కింద దరఖాస్తు చేసుకున్న 1.60 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.2500 ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రేవంత్‌ది పేమెంట్ కోటా

'నాది మేనేజ్‌మెంట్ కోటా అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిస్తున్నారు. అయితే.. రాహుల్, ప్రియాంకలది ఏ కోటా? అసలు రేవంత్‌రెడ్డిది మణిక్కం ఠాకూర్‌కు డబ్బులిచ్చి పదవులు తెచ్చుకున్న పేమెంట్ కోటా. అందుకనే ఢిల్లీకి పేమెంట్ చేయాల్సి వస్తోంది. తెలంగాణ నుంచి రేవంత్.. కర్ణాటక నుంచి డీకే శివకుమార్ ఇదే పని చేస్తున్నారు. రాష్ట్రంలోని బిల్డర్లను, వ్యాపారులను బెదిరిస్తున్నారు. త్వరలోనే బిల్డర్లు, వ్యాపారులు రేవంత్ సెస్‌పై రోడ్డెక్కే పరిస్థితి వస్తుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఈడీ, సీబీఐలపైనా అంత నమ్మకమా?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేంద్రానికి చెందిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సంస్థ మేడిగడ్డపై ఇచ్చిన నివేదిక రాజకీయ ప్రేరేపితమైనదని, దాన్ని పట్టుకొని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. ఏకంగా ప్రాజెక్టు కూలిపోతుందని చెప్పడం తగదని కేటీఆర్ చెప్పారు. ఎన్‌డీఎస్ఏ మీద ఉన్న నమ్మకం.. ఈడీ, సీబీఐ వంటి ఇతర కేంద్రసంస్థలపై కూడా ఉందా అని ప్రశ్నించారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బ్యారేజీకి బరాజ్‌కు తేడా తెలియదని.. అవగాహనా రాహిత్యంతో ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. గతంలో అనేక ప్రాజెక్టులకు రిపేర్లు వచ్చాయని, ప్రభుత్వాలు మరమత్తులు చేసి కాపాడాయన్నారు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుపై ఇంజినీరింగ్ పరిష్కారాలపై దృష్టి పెట్టకుండా.. మొత్తం కొట్టుకుపోవాలన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం క్రూర రాజకీయానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. కుంగిపోయిన పిల్లర్ల వద్ద కాపర్‌డ్యాం నిర్మాణం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపొచ్చు.. మా పార్టీనేత హరీశ్‌రావు చెప్పినట్లు మీకు చేతకాకుంటే అధికారం నుంచి దిగిపోయి మాకు అప్పజెప్పండి.. రెండు నెలల్లో దానికి తగిన పరిష్కారం చూపిస్తామని కేటీఆర్ సవాల్ విసిరారు. కాళేశ్వరం, హెచ్ఎండీఏ.. ఇతర ఏ శాఖల్లో విచారణ జరిపినా తాము భయపడేదే లేదని, అన్యాయంగా నిందలు మోపితే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలది అక్రమ సంబంధమని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో సరైన అభ్యర్థుల్లేక.. బీఆర్ఎస్‌కు చెందిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని.. ఆరుకుపైగా స్థానాల్లో తమ పార్టీ నుంచి వెళ్లిన వారికి ఎంపీ టికెట్ ఇవ్వనున్నారని కేటీఆర్ చెప్పారు. తమ పార్టీ అభ్యర్థులను కేసీఆర్ ఇప్పటికే నిర్ణయించారని.. షెడ్యూల్ విడుదలయ్యాక ఆయనే ప్రకటిస్తారన్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ విడుదల చేయండి

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు నిధులు విడుదల చేయాలని ఉపముఖ్యమంత్రి, భట్టి విక్రమార్కకు కేటీఆర్ ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. అమెరికాలో చదువుతున్న రవి అనే విద్యార్థి తాను ఫీజు చెల్లించాల్సి ఉందని, కానీ, రెండో విడత స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదని తన దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో కేటీఆర్ ఈ విజ్ఞప్తి చేశారు.

ఆ 4 గ్రాముల కొకైన్ ఎక్కడ?

అబ్బాస్ నుంచి వివేకానంద తీసుకుంది 7 గ్రాములు.. రాడిసన్ హోటల్ పార్టీలో వాడింది 3 గ్రాములు

- ఆరా తీస్తున్న గచ్చిబౌలి పోలీసులు.. కేసులో మరో ఇద్దరు
- ఎఫ్ఐఆర్‌లో వివేకానంద డ్రైవర్, డ్రగ్ సప్లయర్ పేర్లు
- 12కు పెరిగిన నిందితులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసులో.. మరో నాలుగు గ్రాముల కొకైన్ ఎక్కడ? అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.. ప్రధాన నిందితుడు గజ్జల వివేకానందకు డ్రగ్స్ సరఫరా చేసిన అబ్బాస్‌ను విచారించారు. ఈ క్రమంలో.. యాకుత్‌పురకు చెందిన సయ్యద్ అబ్బాస్ అలీ జాఫ్రీ నుంచి అబ్బాస్‌కు కొకైన్ సరఫరా అయినట్లు గుర్తించారు. అబ్బాస్ ఇచ్చే కొకైన్‌ను వివేకానంద డ్రైవర్ ప్రవీణ్ తీసుకెళ్లేవాడని నిర్ధారించారు. దీంతో.. మిర్జా, ప్రవీణ్‌ను నిందితులుగా ఈ కేసులో చేర్చారు. పోలీసుల దర్యాప్తులో వివేకానంద గతనెల 16న రెండు గ్రాముల కొకైన్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. 17వ తేదీన మరో రెండు గ్రాములు, 18న ఒక గ్రాము, 19న రెండు గ్రాముల కొకైన్ వివేకానందకు చేరినట్లు తేల్చారు. ఇదే విషయాన్ని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అయితే.. రాడిసన్‌లో జరిగిన పార్టీలో మూడు గ్రాముల కొకైన్‌ను వినియోగించినట్లు గుర్తించారు. దీంతో.. మిగతా నాలుగు గ్రాముల కొకైన్‌ను సీజ్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలని, మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ల వెనక ఎంతటి వారున్నా ఉపేక్షించరాదని పదేపదే చెబుతున్న నేపథ్యంలో పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నాలుగు గ్రాముల్లోపు డ్రగ్స్ సీజ్ అయితే శిక్షలు సాధారణంగా ఉంటాయి. అదే నాలుగు గ్రాముల కంటే ఎక్కువ ఉంటే.. నిందితులకు కఠిన శిక్షలు తప్పవు. ఈ నేపథ్యంలో ఏడు గ్రాముల కొనుగోలుకు సంబంధించిన ఆధారాలు దొరికినా.. కోర్టులో కేసు బలంగా నిలబడేందుకు వివేకానంద దాచిన నాలుగు గ్రాముల కొకైన్‌ను సీజ్ చేసే దిశలో పోలీసులు అడుగులు వేస్తున్నారు.

మిర్జా పట్టుబడితేనే వెలుగులోకి డ్రగ్స్ లింకు!

ఇప్పటి వరకు ఈ కేసులో అబ్బాస్ డ్రగ్స్ విక్రేత అని పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే.. అబ్బాస్‌ను విచారించాక.. మిర్జా ద్వారా కొకైన్‌ను సేకరించినట్లు గుర్తించారు. దీంతో.. ఇప్పుడు మిర్జా కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతను పట్టుబడితే తప్ప.. డ్రగ్స్ మూలాలకు వెళ్లలేమని భావిస్తున్నారు. అదేవిధంగా.. ఈ కేసులో ఇప్పటి వరకు ముగ్గురు-- వివేకానంద, అబ్బాస్, డ్రైవర్ ప్రవీణ్ అరెస్టవ్వగా.. నిర్భయ్, కేదార్‌లను విచారించి, విడిచిపెట్టారు. పరారీలో ఉన్న ఏడుగురి కోసం గాలింపును తీవ్రం చేశారు. నిందితులు డ్రగ్స్ సేవించిన నెల రోజుల్లోపు పరీక్షలు నిర్వహిస్తేనే పాజిటివ్ వస్తుందని, రోజులు గడిస్తే నిరూపించడం ఇబ్బందికరమేనని పోలీసులు భావిస్తున్నారు.

తెలంగాణ ఎన్టీపీసీ స్టేజ్ 1 నిర్మాణం పూర్తి

- అందుబాటులోకి 1600 మెగావాట్ల విద్యుత్తు
- 4న ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం

జ్యోతినగర్, ఫిబ్రవరి 29 : పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) స్టేజ్-1 నిర్మాణం పూర్తయింది. ఈప్రాజెక్టులోని 800 మెగావాట్ల సామర్థ్యంగల రెండో యూనిట్‌ను గురువారం అర్ధరాత్రి (00.00 గంటలు) కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్ (సీవోడీ)గా ప్రకటించారు. ఈ యూనిట్ పూర్తి స్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడం, సీవోడీ ప్రకటనతో మొత్తం 1600 మెగావాట్ల (800 మెగావాట్ల 2 యూనిట్లు) మొదటి దశ సంపూర్ణమైంది. టీఎస్టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు నుంచి 85 శాతం విద్యుత్తు తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేస్తారు. స్టేజ్ 2లో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది. మార్చి 4న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు.

ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి అవార్డు


అవార్డును అందుకుంటున్న ఎన్టీపీసీ జీఎం వేముల అనిల్ కుమార్

జ్యోతినగర్, ఫిబ్రవరి 39: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోని ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. స్థిరమైన, స్థితిస్థాపక మౌలిక వసతుల(సస్టయినబుల్, రెజీలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) వి భాగంలో 100 మెగావాట్ల ఈ ప్రాజెక్టుకు అవార్డు దక్కింది. గురువారం హరియాణా రాజధాని చండీగఢ్‌లో జరిగిన 6వ నేషనల్ ఎనర్జీ సమ్మిట్‌లో.. రామగుండం ఎన్టీపీసీ జీఎం వేముల అనిల్ కుమార్‌కు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్(చండీగఢ్) కారొలిన్ రోవెట్, హరియాణా విద్యుత్‌శాఖ మంత్రి రంజిత్‌సింగ్‌లు ఈ అవార్డును అందజేశారు.

'ధూపదీప' అర్చకుల వేతనాలకు రూ.11 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ధూపదీప నైవేద్యం (డీడీఎన్) పథకం కింద చిన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ధూపదీప పథకం కింద 6271 ఆలయాల్లో అర్చకులు పనిచేస్తున్నారు. వీరి వేతనాల చెల్లింపునకు రూ. 11.2 కోట్లు మంజూరు చేస్తూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాన్స్‌కోలో 'రూ.191 కోట్ల' పనులు రద్దు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు, కొందరు ప్రభుత్వ పెద్దలకు మేలు చేయడానికి ప్రతిపాదించిన పనులను రద్దు చేస్తూ ట్రాన్స్‌కో నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2015 నుంచి 2023 వరకు రూ.191.06 కోట్లతో ఏడు పనులకు పరిపాలనపరమైన అనుమతులు ఇస్తూ గతంలో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయా పనులను సమీక్షించిన కొత్త ప్రభుత్వం.. వాటి అవసరం లేదని గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది.

మెట్రోలో భాగస్వాములవుతాం: బీఈఎంఎల్

మెట్రో రైలు విస్తరణ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు బెంగళూరుకు చెందిన 'భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్)' సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు బీఈఎంఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శంతనురాయ్.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో సచివాలయంలో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీఈఎంఎల్ కార్యకలపాలపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. రక్షణ రంగానికి సంబంధించి కేరళలోని పాలక్కడ్‌లో పని చేస్తున్నామని, అలాగే సింగరేణిలోనూ పని చేస్తున్నామని శంతనురాయ్ వివరించారు. హైదరాబాద్‌లో తమ సంస్థకు ప్రాంతీయ కార్యాలయం ఉందని తెలిపారు. ఇందుకు స్పందించిన భట్టి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఓ సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

నేడు సాగర్ కుడికాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, హైదరాబాద్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ జలాశయం నుంచి కుడికాల్వకు 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రజల తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని ఏపీ నీటిపారుదల శాఖ అధికారులు కేఆర్ఎంబీకి రెండు రోజుల క్రితం లేఖలు రాశారు. దాంతో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు రోజుకు సుమారు 5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

'టాప్ ఇండియన్స్' జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్

- 100 మందితో విడుదల చేసిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 'టాప్ 100 అత్యంత ప్రభావవంతమైన భారతీయులు' పేరుతో గురువారం ఓ జాబితాను విడుదల చేసింది. విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన ఈ జాబితాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నెంబర్‌వన్ స్థానంలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భాగవత్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ వరుసగా తర్వాత స్థానాల్లో నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 39వ స్థానం లభించింది. కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ-16, సోనియాగాంధీ-29, ప్రియాంకాగాంధీ-62వ ర్యాంకుల్లో నిలవగా.. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు 36వ స్థానం లభించింది. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మమతా బెనర్జీకి 15వ స్థానం, అరవింద్ కేజ్రీవాల్‌కు 18వ స్థానం, సిద్ధరామయ్యకు 22వ స్థానం, స్టాలిన్‌కు 25వ స్థానం దక్కింది. కాగా, బాలీవుడ్ బాద్‌షా షారూఖ్‌ఖాన్‌కు ఈ జాబితాలో 27వ ర్యాంకు లభించగా, సీనియర్ నటుడు అమితాబ్‌బచన్ చివరన 99వ స్థానంలో నిలిచారు.

కాళేశ్వరం అదనపు టీఎంసీని పరిశీలించలేం

'అదనపు టీఎంసీ'కి చూపిన కారణాలు సహేతుకంగా లేవు..!

వాస్తవాలు నివేదించాల్సిందేనన్న కేంద్ర జలవనరుల సంఘం

హైదరాబాద్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): గణాంకాలు ఒక్కోచోట ఒక్కో విధంగా ఉన్నాయని పేర్కొంటూ.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సవరణ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను పరిశీలించలేమని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) స్పష్టం చేసింది. రూ.30 వేల కోట్లతో అదనపు టీఎంసీ చేపట్టడానికి చూపిన కారణాలు సహేతుకంగా లేవంటూ లేఖ రాసింది. అదనంగా రోజుకు ఒక టీఎంసీని ఎత్తిపోసే కాంపోనెంట్‌ను 2021 జూలై 15న కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుల గెజిట్‌లో అనుమతి లేని జాబితాలో పెట్టింది. అయితే, రోజుకు 2 టీఎంసీలు తరలించే ప్రధాన పథకం, అదనంగా టీఎంసీని తరలించే పథకాలు వేర్వేరు కాదని అప్పటి సీఎం కేసీఆర్ వాదించారు. అదనపు టీఎంసీని వెంటనే గెజిట్ నుంచి తొలగించాలని కోరారు. దీనినే చెబుతూ సవరణ డీపీఆర్ సమర్పిస్తే, రెగ్యులర్ డీపీఆర్‌లాగే అన్ని పరిశీలనలు చేసి గెజిట్ నుంచి తొలగిస్తామని కేంద్రం తేల్చిచెప్పింది. ఈ మేరకు సవరణ డీపీఆర్‌ను రెండేళ్ల కిందటే సీడబ్ల్యూసీతో పాటు గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)లో దాఖలు చేశారు. కాగా, అదనపు టీఎంసీపై కోర్టులో కేసులు ఉన్నందున దానిని పరిశీలించబోమని ఓ దశలో గోదావరి బోర్డు పేర్కొంది. కేంద్ర జలశక్తి శాఖ కూడా డీపీఆర్‌పై యథాతథ స్థితిని పాటించాలని ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కోర్టుకెళ్లింది. న్యాయస్థానం ఆదేశాలతో కాళేశ్వరం డీపీఆర్ పరిశీలన జరిగింది. ఆ సమయంలో సీడబ్ల్యూసీ ప్రశ్నలకు గత ప్రభుత్వం జవాబులు చెప్పలేకపోయింది. తాజాగా తెలంగాణ సమర్పించిన గణాంకాలు చూసిన సీడబ్ల్యూసీ ఇక డీపీఆర్‌ను పరిశీలించేది లేదని తేల్చి చెప్పింది. కాళేశ్వరం పంపులకు వాడే కరెంట్ యూనిట్ రూ.3 నుంచి రూ.6.3కు చేరిందని, 2022 ఏప్రిల్‌లో బెనిఫిట్ కాస్ట్ రేషియా 1.542గా, 2023 జనవరిలో 1.873గా చూపారని ఆక్షేపించింది.

ఆది నుంచి వివాదాలే...

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రధాన కాంపోనెంట్ హెడ్ వర్క్స్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసిన ప్రభుత్వం, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ జోలికి వెళ్లలేదు. ఈలోగా రోజుకు అదనంగా ఒక టీఎంసీ తరలించే కాంపోనెంట్‌ను తెరమీదికి తెచ్చింది. ఇప్పుడు సీడబ్ల్యూసీ నిర్ణయంతో కాంపోనెంట్‌ను రద్దు చేసి, సవరణ డీపీఆర్‌ను వెనక్కితీసుకునే అవకాశాలున్నాయి.

కాళేశ్వరం డిజైన్లకు కేంద్రం అనుమతి లేదు

(మొదటిపేజీ తరువాయి)



కార్పొరేషన్(ఆర్ఈసీ) నుంచి రుణాల విడుదలను నిలిపివేసినట్టు తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహెట్టి వద్ద 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నట్టు సీడబ్ల్యూసీ పేర్కొనగా.. ఎగువ రాష్ట్రాలు వాడుకోగా 67 టీఎంసీలే ఉంటాయనే వాదనతో, మహారాష్ట్ర ఒప్పుకోలేదనే సాకుతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆయన ఆక్షేపించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలోనే రూ.11 వేల కోట్లకుపైగా ఖర్చు చేశారని.. మరో రూ.30 వేల కోట్లు ఖర్చుచేసి ఉంటే ఆ ప్రాజెక్టు పూర్తయ్యేదని.. గ్రావిటీతో నీటిని తరలించే ఆ ప్రాజెక్టును కాదని, తప్పుడు సమాచారంతో కాళేశ్వరం చేపట్టారని మండిపడ్డారు. రూ.40 వేల కోట్లతో పూర్తయ్యేదాన్ని కాదనుకొని.. రూ.1.27 లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని విమర్శించారు. తుమ్మిడిహెట్టితో 16.4 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందేదని.. కానీ, దానికి మూడింతలు ఎక్కువ వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో 18.25 లక్షల ఎకరాలకు నీరందుతుందని, అంటే అదనంగా 1.8 లక్షల ఎకరాలకే నీరు అందుతుందని వివరించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన.. కాళేశ్వరం ప్రాజెక్టు లోటుపాట్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంచలన విషయాలు బయటపెట్టారు. మేడిగడ్డ వద్ద 120 రోజుల పాటు వరద ఉంటుందని సీడబ్ల్యూసీ స్పష్టం చేసిందని.. 120 రోజుల పాటు నీటిని తరలించే అవకాశం ఉండగా, కేవలం 60 రోజుల్లోనే 180 టీఎంసీల నీటిని తరలించేలా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేపట్టారని విమర్శించారు. అవసరం లేకున్నా రూ.33 వేల కోట్లతో రోజుకు ఒక టీఎంసీ నీటిని తరలించే పనులు చేశారని, దీనివల్ల కొత్తగా ఆయకట్టు పెరిగిందేమీ లేదన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టులు చేపట్టినప్పుడు.. నదీగర్భంలో జియొలాజికల్ ప్రొఫైల్ చేయించి, కింద మట్టి ఉందా, రాళ్లున్నాయా? బంకమట్టి ఉందా? ఇసుక ఉందా? అనే విషయాన్ని బోర్‌హోల్స్ వేసి తెలుసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకు జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సహాయం తీసుకోవాలని.. దీనికి 6 నెలల నుంచి సంవత్సరం సమయం పడుతుందని వివరించారు. తమకు తెలిసినంతవరకూ రాష్ట్రప్రభుత్వం జీఎస్ఐ సహాయం తీసుకోలేదని.. సొంతంగా సర్వే చేపట్టలేదని వ్యాఖ్యానించారు. ఇది అతిపెద్ద తప్పు అని ఆందోళన వెలిబుచ్చారు. "ఎంత పెద్ద తప్పంటే.. దీనికి బాధ్యులైనవారు జైలుకు వెళ్లాలి. అలా వెళ్లేదెవరో కాలమే చెబుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే, రుతుపవనాలకు ముందు, తర్వాత.. ప్రాజెక్టు గేట్లు, కాంక్రీట్ బ్లాకులు, సీసీ బ్లాకులు, స్పిల్ వే ఎలా ఉన్నాయో పరిశీలించాల్సి ఉండగా, అలా చేయలేదని ఆక్షేపించారు. తప్పనిసరిగా చేయాల్సిన థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ కూడా చేయలేదని మండిపడ్డారు.

కుంగిన వెంటనే..

గత ఏడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా.. ఆ మరుసటి రోజే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ)తో పరిశీలనకు నిర్ణయం తీసుకున్నామని శ్రీరామ్ గుర్తుచేశారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించిన అథారిటీ.. నిర్మాణ, నిర్వహణ లోపాలే కుంగుబాటుకు కారణమని తేల్చిందన్నారు. ప్రాజెక్టును సమగ్రంగా పరిశీలించడానికి జియో ఫిజికల్, జియో టెక్నికల్‌తో పాటు 20 రకాల సమాచారాన్ని కోరగా... గత ప్రభుత్వమే కాక ప్రస్తుత సర్కారు కూడా ఇవ్వలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడానికి.. ఓ కమిటీని ఏర్పాటైందని, వచ్చేవారం ఆ కమిటీ బ్యారేజీలను పరిశీలించి, నాలుగునెలల్లో నివేదిక ఇవ్వనుందన్నారు. అయితే నెల రోజుల్లోపే నివేదిక ఇవ్వాల్సిందిగా కమిటీని కోరామన్నారు.

అదే పరిష్కారం

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ప్రమాదంలో పడిన నేపథ్యంలో.. ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కట్టుకోవడం లేదా... 100 టీఎంసీల సామర్థ్యంతో కాళేశ్వరం వద్ద డ్యామ్ కట్టుకోవడమే పరిష్కారమని వెదిరె శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. ఇక.. కృష్ణా నదిపై కట్టిన సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను బోర్డుకు అప్పగించడమే మంచిదని, దానివల్ల ఇరు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. అలాగే.. కృష్ణా జలాలను ఏడాదిలోగా తెలుగు రాష్ట్రాలకు పంచాల్సిందిగా జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-2)ను కేంద్రం కోరిందని శ్రీరామ్ తెలిపారు. బచావత్ ట్రైబ్యునల్ తెలుగు రాష్ట్రాలకు 811 టీఎంసీల జలాలను గంపగుత్తగా కేటాయించగా... రాష్ట్ర ఏర్పాటు అనంతరం అందులో 299 టీఎంసీలకే తెలంగాణ ఒప్పుకొందని, ప్రాజెక్టులకు మరో 200 టీఎంసీల దాకా నీటి అవసరాలు ఉన్నా పట్టించుకోలేదని ఆక్షేపించారు. త్వరలో తాము తేనున్న కొత్త ట్రైబ్యునల్ చట్టం ఆమోదం పొందితే.. నీటి పంపిణీపై ట్రైబ్యునల్ మూడేళ్లలోపు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కృష్ణా ప్రాజెక్టులపై పెత్తనాన్ని కేంద్రం కోరడం లేదని, కృష్ణా బోర్డులో తెలుగు రాష్ట్రాల అధికారులే ఉంటారని స్పష్టం చేశారు. నీళ్ల కేటాయించే, పంచే అధికారం కూడా బోర్డుకు లేదని, ట్రైబ్యునల్‌కు మాత్రమే ఈ అధికారాలున్నాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నిర్లక్ష్యంతో నిర్వహణ లేక నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లు ప్రమాదంలో పడ్డాయని శ్రీరామ్ ఆందోళన వెలిబుచ్చారు. ఇటీవ లే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) ఈ డ్యామ్‌లను పరిశీలించగా.. పలు లోపాలు బయటపడ్డాయని తెలిపారు. ఆ మరమ్మతులపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు.

భువనగిరి టికెట్ ఎవరికివ్వాలో పార్టీ ఇష్టం

భువనగిరి ఎంపీ టికెట్ ఎవరికి ఇవ్వాలనేది పార్టీయే (బీజేపీ) చూసుకుంటోందని.. ఆ టికెట్‌కు కాళేశ్వరం ప్రాజెక్టుతో ఏం సంబంధమని వెదిరే శ్రీరామ్ ప్రశ్నించారు. భువనగిరి ఎంపీ టికెట్ కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుపై శ్రీరాం ఆరోపణలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఇలా స్పందించారు.


ఎంఈఐసీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌బాబు

మాన్యు ఫాక్చరింగ్ యూనిట్లు పెరగాలి: దుద్దిళ్ల

రాయదుర్గం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు పెరగాల్సిన అవసరం ఉందని, ఇదే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నానక్‌రాంగూడలో మెడ్‌ట్రానిక్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసీ) నూతన కార్యాలయాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఎంఈఐసీ ఉండవల్ల నగరం మెడ్‌టెక్ ఆవిష్కరణకు హాట్‌స్పాట్‌గా మారిందని చెప్పారు. వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, రాష్ట్రంలోనే కాకుండా దేశంలో కూడా రోబోటిక్ సర్జరీలు బాగా పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. మెడ్‌ట్రానిక్ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెడక్‌ట్రానిక్ ఛైర్మన్, సీఈవో జెఫ్‌మార్తా, ఎంఈఐసీ ఉపాధ్యక్షుడు సైట్‌లీడర్ దివ్యప్రకాశ్‌జోషి మాట్లాడారు.

ఫోర్సీస్ ఇంక్ నూతన కార్యాలయం ప్రారంభం

నానక్‌రాంగూడలో ఫోర్సీస్ ఇంక్ నూతన కార్యాలయాన్ని మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రైవేటు సంస్థలతో ప్రభుత్వం కలిసి పనిచేసేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్, ఐల్యాబ్స్ గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాసరరాజు, స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాబడులు రూ.1.36 లక్షల కోట్లే..

- జనవరి నాటికి 63 శాతమే వసూలు: కాగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన మేర రెవెన్యూ రాబడులు సమకూరడం లేదు. 2023-24 సంవత్సర బడ్జెట్‌లో అన్ని రకాల రాబడుల కింద రూ.2,16,566 కోట్లు వస్తాయని అంచనా వేశారు. అయితే ఈ ఏడాది జనవరినాటికి రూ.1,36,859 కోట్లు మాత్రమే సమకూరాయి. ఈ మొత్తం అంచనా రాబడుల్లో 63.20 శాతం మాత్రమే. ఈమేరకు రాష్ట్ర రాబడులు, వ్యయాలకు సంబంధించి జనవరి నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గురువారం విడుదల చేసింది. జనవరినాటికి సమకూరిన 63.20 శాతం రాబడిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 2నెలల్లో (ఫిబ్రవరి,మార్చి) మిగతా 37% నిధులు సమకూరడం సాధ్యమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రూ.1,36,859 కోట్ల రెవెన్యూ రాబడుల్లో పన్ను రాబడి కిందే 1,10,442కోట్లు (72.42%) వచ్చాయి. ఇందులో జీఎస్టీ ద్వారా రూ.37,995 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.11,698 కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ.24,915 కోట్లు, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద రూ.17,964 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.11,290 కోట్లు, ఇతర పన్నుల కింద రూ.6,577 కోట్లు సమకూరాయి. పన్నేతర రాబడి కింద రూ.22,808 కోట్లను అంచనా వేయగా జనవరినాటికి రూ.20,572 కోట్లు (90.20%), కేంద్రగ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద అంచనా వేసిన రూ.41,259 కోట్లలో రూ.5,844 కోట్లు(14.17%) సమకూరాయి. అప్పులకింద 40,852 కోట్లు వచ్చాయి. జనవరి నాటికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.1,72,121 కోట్లు వ్యయం చేసింది. రూ.2,49,209కోట్ల అంచనా వ్యయంలో ఇది రూ.69.07%. వడ్డీ చెల్లింపులకు రూ.19,102 కోట్లు, ఉద్యోగుల వేతనాలు/భత్యాలకు రూ.32,650 కోట్లు, సర్వీసు పెన్షనర్లకు పెన్షన్ల కోసం 14,012 కోట్లు, వివిధ పథకాల సబ్సిడీలకు 7,620 కోట్లు వెచ్చించారు.

ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

(మొదటిపేజీ తరువాయి)

జారీచేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండే రెవెన్యూ సిబ్బంది, అవసరాన్ని బట్టి ఇతర శాఖల సిబ్బందిని ఈ బృందాల్లో నియమించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్లు ఏరోజుకారోజు ఆర్డీవోలు, తహసీల్దార్ల ద్వారా పురోగతిని తెలుసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ధరణిలో దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణల అధికారం కేవలం కలెక్టర్లకే ఉండేది. నవీన్‌మిత్తల్ జారీ చేసిన తాజా ఉత్తర్వుల్లో ఆ అధికారాలను ఆర్డీవోలు, తహసీల్దార్లకు కూడా దఖలుపరుస్తున్నట్లు స్పష్టంచేశారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్.. ఇలా ఏయే అధికారి స్థాయిలో ఎలాంటి సమస్యలను పరిష్కరించాలో వివరంగా పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో పరిశీలన జరిపేలా కలెక్టర్లకు విచక్షణాధికారాలను ఇచ్చారు. దరఖాస్తుదారుడి భూమి విలువ రూ.5 లక్షల్లోపు ఉంటే ఆర్డీవో.. రూ.5లక్షల నుంచి రూ.50 లక్షల్లోపు ఉంటే కలెక్టర్లు, రూ.50 లక్షలకు పైన ఉంటే సీసీఎల్ఏ ఆ దరఖాస్తులను పరిష్కరిస్తారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఒక దరఖాస్తును ఆమోదించినా.. తిరస్కరించినా.. అందుకు కారణాలను స్పష్టం చేయాల్సి ఉంటుంది. కాలయాపన లేకుండా.. అధికారులకు స్పష్టమైన గడువును విధించారు. అంటే.. తహసీల్దార్ ఏడు రోజులు, ఆర్డీవో 3 రోజులు, అదనపు కలెక్టర్ 3 రోజులు, కలెక్టర్ ఏడు రోజుల్లో ఆయా దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంటుంది.

తహసీల్దార్ అధికారాలివి..!

అసైన్డ్ భూములు సహా టెక్నికల్ మాడ్యుల్(టీఎం)-4 పరిధిలోని విరాసత్ దరఖాస్తులను తహసీల్దార్ పరిష్కరిస్తారు. టీఎం-10 దరఖాస్తులు-- జీపీఏ, ఎస్‌పీఏ, ఎగ్జిక్యూటివ్ జీపీఏలు, టీఎం-14లోని స్పెషల్ ల్యాండ్ మ్యాటర్, టీఎం-32లోని మెర్జింగ్‌కు సంబంధించిన అర్జీలకు తహసీల్దార్ పరిధిలోనే పరిష్కారం లభిస్తుంది. ఇందుకోసం తహసీల్దార్లు సెత్వార్, చేసాలా, పాత పహాణీలు, ఖాస్రా పహాణీలు, ఇతర రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తారు.

ఆర్డీవో పరిధిలోకి వచ్చేవి ఇవే..!

టీఎం-7లో దరఖాస్తు చేసుకున్న నాలా కన్వర్షన్, టీఎం-16 పరిధిలోకి వచ్చే ప్రభుత్వం సేకరించిన భూముల సమస్యలు, టీఏ-20 లోని ఎన్నారైల భూములకు సంబంధించిన సమస్యలు, టీఎం-22 లోని సంస్థలకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, టీఎం-26 పరిధిలోని కోర్టు కేసులకు సంబంధించిన సమస్యలను ఆర్డీవోలు పరిశీలించి, పరిష్కరిస్తారు. వీటితోపాటు.. టీఎం-33 పరిధిలోని భూ సమస్యల(మార్కెట్ విలువ రూ.5 లక్షల లోపు) దరఖాస్తులను ఆర్డీవోలు పరిశీలించనున్నారు.

కలెక్టర్ల పరిధిలో అధికారాలు..

అన్ని మాడ్యూళ్ల దరఖాస్తులను రిపోర్టుల ఆధారంగా ఆమోదించే అధికారం కలెక్టర్లకు ఉంటుంది. మ్యుటేషన్, సక్సెషన్, పీవోబీ సమస్యలు, సెమీ అర్బన్ ఏరియాలో పట్టాదారు పాస్‌పుస్తకాల సమస్యలు, కోర్టు తీర్పుల ఆధారంగా పాసుపుస్తకాల జారీ, ఇళ్లు లేదా నివాస స్థలాలుగా మారిన భూముల నాలా కన్వర్షన్, టీఎం-33 పరిధిలో.. పాసుబుక్ డేటా కరెక్షన్‌లో పేరు మార్పు, ధరణి రాకముందే అమ్మేసిన భూముల సమస్యలు పరిష్కరిస్తారు. రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల లోపు విలువ కలిగిన భూముల సమస్యలు పరిష్కరించే అధికారం కలెక్టర్లకు ఉంటుంది.

సీసీఎల్ఏ పరిష్కరించేవి..


టీఎం-33 కింద వచ్చిన దరఖాస్తులు డేటా కరెక్షన్, నోషనల్ ఖాతా, ట్రాన్స్‌ఫర్, క్లాసిఫికేషన్ మార్పుతో పాటు.. రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ చేసే భూముల డేటా కరెక్షన్ సంబంధించిన అర్జీలను, సీసీఎల్ఏ పరిశీలించి, పరిష్కరిస్తారు.

శ్వేతపత్రం విడుదల చేస్తాం: మంత్రి పొంగులేటి

ధరణిపై త్వరలో శ్వేత పత్రం విడుదల చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ధరణితో రెవెన్యూ వ్యవస్థను కొల్లగొట్టారంటూ గత సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి వల్ల ఎన్నో రైతు కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, లక్షల ఎకరాలను మాయం చేశారని ఆరోపించారు. గత సర్కారు తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామన్నారు. ఈ నెల 9 వరకు నిర్వహించనున్న స్పెషల్ డ్రైవ్‌ల వల్ల ప్రజలు తమ విలువైన భూములను దక్కించుకుంటారని వ్యాఖ్యానించారు. భూరికార్డుల పాలిట శరాఘాతంగా ఉన్న ధరణి పోర్టల్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు.

ఫెడరల్ ఫ్రంట్‌కు కేసీఆర్ కుట్ర

- ఇండియా కూటమి బలహీనానికి ఆయన ఎత్తులు
- వచ్చే ఎన్నికలు ప్రధాని మోదీని ఓడించే యుద్ధం..
- కాంగ్రెస్‌తోనే దేశంలో లౌకిక, ప్రజాస్వామిక పాలన
- తిరువనంతపురం సమరాగ్ని సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


కేరళలో సమరాగ్ని సభలో అభిమానులకు ముఖ్యమంత్రి రేవంత్ అభివాదం

తిరువనంతపురం, ఫిబ్రవరి 29: ఇండియా కూటమిని బలహీనపరిచేందుకు మూడో ఫ్రంట్ లేదా ఫెడరల్ ఫ్రంట్ పేరిట జరిగే కుట్రలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహకరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌నే కాక.. కేరళలో ఆయనకు సహకరిస్తున్న శక్తులను ఓడించాలని కోరారు. తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన నిరంకుశ, అవినీతిమయ విధానాలు వామపక్ష భావజాలాన్ని కలుషితం చేశాయన్నారు. తిరువనంతపురం సమరాగ్ని సభలో గురువారం సీఎం రేవంత్ మాట్లాడారు. మోదీ ఆధ్వర్యంలోని బీజేపీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. రాబోయేవి లోక్‌సభ ఎన్నికలు కావని.. మోదీని ఓడిచేందుకు జరుగుతున్న యుద్ధం అని, దేశమంతా మోదీపై యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ఇండియా కూటమిని గెలిపించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ విజయంతోనే ప్రజాస్వామ్య, లౌకిక శక్తులకు బలం చేకూరుతుందని రేవంత్ పేర్కొన్నారు. ఈ విలువలను బీజేపీ తుంగలో తొక్కిందని.. అవినీతిని ప్రోత్సహిస్తోందని విమర్శించారు.

సంపద సృష్టికర్తలు పారిశ్రామికవేత్తలే

- సింగపూర్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం
- అవసరమైన భూమి, వనరులున్నాయి: భట్టి విక్రమార్క
- ఉప ముఖ్యమంత్రితో సింగపూర్ కౌన్సిల్ జనరల్ బృందం భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలే సంపద సృష్టికర్తలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి సింగపూర్ నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ బృందం గురువారం సచివాలయంలో భట్టి విక్రమార్కతో భేటీ అయింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించే విషయంలో ప్రభుత్వం చాలా ఆసక్తిగా ఉందని స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని వర్గాల వారు ఆస్వాదించే భౌగోళిక వాతావరణంతో పాటు మౌలిక సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని సింగపూర్ బృందానికి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణంతో హైదరాబాద్‌లో పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలను కలిపేలా రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణం జరుగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి క్లస్టర్ జోన్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫార్మా, టెక్స్‌టైల్, ఐటీ క్లస్టర్లను ఏర్పాటు చేసి అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మూసీ నది పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపారు. ఇటీవల జపాన్‌కు చెందిన 'జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జైకా)' రాష్ట్రానికి రుణమివ్వడానికి ఆసక్తిని కనబర్చిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన భూమి, ఇతర వనరులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తెలంగాణ జీఎస్‌డీపీ బాగా పెరిగిందని, ఐటీ, ఫార్మా రంగాల విషయంలో ప్రభుత్వం ముందుచూపుతో ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సింగపూర్‌కు చెందిన కొన్ని కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని ఎడ్గర్ పాంగ్.. భట్టి విక్రమార్కకు వివరించారు. అర్బన్ ప్లానింగ్ విషయంలో తమకు మంచి పట్టు ఉందని తెలిపారు. సింగపూర్‌కు చెందిన అతిపెద్ద డీబీఎస్ బ్యాంక్ హైదరాబాదులో ఉందని, ఐటీ పార్కులో సింగపూర్ ఆఫీసులున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్ బయోటెక్ హబ్‌గా మారుతుందని పాంగ్ వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడా నికి ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో ట్యాంకర్ ద్వారా వరి పంటకు నీరు పెడుతున్న రైతు మహేందర్

నేలతల్లి తడారకుండా..

» పంటను కాపాడుకునేందుకు సిద్దిపేట జిల్లా రైతుల పాట్లు

అక్కన్నపేట, ఫిబ్రవరి 29: వేసవి ఇంకా మొదలవ్వకముందే రైతన్నలకు నీటి కష్టాలు మొదలైపోయాయి. సాగునీటి కొరతతో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట ఎండిపోతోంది. భూగర్భజలాలు అడుగంటడంతో వ్యవసాయ బావులు, బోరుబావుల్లో నీళ్ల ఉండడం లేదు. దీంతో వరి మడులకు నీరందించలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఎండిపోతుందేమో అని భయపడుతున్నారు. అక్కన్నపేటకు చెందిన గొట్టే మహేందర్ అనే రైతు తన నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇప్పటివరకు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకోగా.. బోరుబావిలో నీరు తగ్గిపోవడంతో తడులు పారించేందుకు నానా తంటాలు పడుతున్నాడు. గ్రామానికి చెందిన ఓ రైతు బోరుబావిని రూ.10 వేలకు అద్దెకు తీసుకొని ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకువచ్చి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

ఒకేసారి నాలుగు కొలువులు!

అక్షయ్ కుమార్, దీపారెడ్డి

అచ్చంపేట/మానవపాడు, ఫిబ్రవరి 29: ఇంతకాలం నిరుద్యోగులుగా ఉన్న ప్రతిభావంతులు.. ఇటీవల వరుసగా వెలువడుతున్న పలు ఉద్యోగ నియామక ఫలితాల్లో సునాయాసంగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. కొందరు నాలుగేసి కొలువులు కూడా సాధించి తామేంటో నిరూపించుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన దాసరి మీనమ్మ- జైపాల్ దంపతుల రెండో కుమారుడు అక్షయ్ ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించారు. ఇంగ్లిష్ టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలను ఆయన సాధించారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ దేవసేనారెడ్డి- హేమలత కుమార్తె దీపారెడ్డి కూడా ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆమె ఏకలవ్య ఈజీ మాడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో టీచర్ పోస్టు, గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్, గురుకుల జూనియర్ లెక్చరర్, గురుకుల పోస్టు గ్రాడ్యుయేట్ కళాశాలలో టీచర్ పోస్టులు సాధించారు. ఈ సందర్భంగా దీపారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కష్టంగా కాకుండా ఇష్టంతో చదివితే తప్పనిసరిగా విజయం సాధించవచ్చని అన్నారు.

అవినీతి కేసులో సీడీపీవో శ్రీదేవి అరెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సీడీపీవో) అనిశెట్టి శ్రీదేవిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. గతంలో ఆమె ఆదిలాబాద్ జిల్లా జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేశారు. ఆమె 2015-16 మధ్యకాలంలో ఆరోగ్య లక్ష్మి పథకంలో భాగంగా 322 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గిరిజన చిన్నారులు అందించాల్సిన పాల పథకంలో రూ. 65.78 లక్షల అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. నకిలీ ఇండెంట్లు సృష్టించి నగదు కాజేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో ఏసీబీ అధికారులు గుర్తించారు. దాంతో ఆమె అవినీతి, అక్రమాలపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, గురువారం హైదరాబాద్‌లో ఆమెను అరెస్ట్ చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

టెట్ లేకుండా డీఎస్సీ నోటిఫికేషనా?:ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్ నోటిఫికేషన్‌ను ఇవ్వడంపై నిరుద్యోగులు పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలోనికి వెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. టెట్, డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న వారంతా గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నిరసన నిర్వహించారు. ఆందోళనకారులకు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్యతో పాటు నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ తదితరులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. టెట్ అర్హత సాధించి డీఎస్సీ రాసేందుకు లక్షలాది మంది ఎదురు చూస్తుండగా ప్రభుత్వం నిరుద్యోగులను, ఉపాధ్యాయ సంఘాలను పట్టించుకోకుండా హడావిడిగా తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే టెట్‌ను నిర్వహించి, 25 వేల టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని, లేకపోతే నిరుద్యోగులతో కలిసి ఉద్యమం తప్పదని కృష్ణయ్య హెచ్చరించారు.

లారీ చక్రాల కింద నలిగిన కుటుంబం

» ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ

» ఎనిమిది నెలల గర్భిణి, 13 నెలల బాలుడు సహా

» ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం

కార్వాన్, దోమ ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర పరిధి ఇబ్రహీంబాగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టిన ఘటనలో 8 నెలల గర్భంతో ఉన్న ఓ మహిళ, ఆమె భర్త, ఏడాది వయస్సు ఉన్న వారి కుమారుడు లారీ చక్రాల కింద నలిగి ప్రాణాలు కోల్పోయారు. వికారాబాద్ జిల్లా దోమ మండలం బట్లచందారం గ్రామానికి చెందిన విసురుకంట గోపాల్(29) మేస్త్రీగా పని చేస్తున్నాడు. భార్య రేణుక(25), కుమారుడు అర్జున్(13 నెలలు)తో కలిసి గండిపేట్ మండలం పరిధి మంచిరేవుల గ్రామంలో నివాసముంటున్నాడు. రేణుక ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి, ఆమెకు వైద్య పరీక్షలు చేయించేందుకు కుమారుడు అర్జున్‌తో కలిసి దంపతులు ద్విచక్రవాహనంపై గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి బయలుదేరారు. నార్సింగ్ మీదుగా వెళుతున్న వీరి ద్విచక్రవాహనాన్ని ఇబ్రహీంబాగ్ చౌరస్తా వద్ద ఓ ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ క్రమంలో లారీ చక్రాల కింద పడిన అర్జున్ అక్కడికక్కడే మరణించాడు. గోపాల్, రేణుకను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు.

బాసర ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌పై వేటు

» గంజాయి ఘటనపై సర్కార్ సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాసర, ఫిబ్రవరి 29: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో గంజాయి పీల్చుతూ విద్యార్థులు పట్టుబడిన ఘటన సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఆ వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆ క్యాంపస్‌లో గంజాయి ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతోనే సతీశ్ కుమార్‌పై వేటు పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 25న గంజాయితో ఇద్దరు విద్యార్థులు పట్టుబడటం అంతకుముందూ ఇలాంటి ఘటనే చోటు చేసుకోవడంతో ఈనెల 26న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'బాసర ట్రిపుల్ ఐటీలో మళ్లీ గంజాయి మత్తు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలోనే క్యాంపస్‌లో నెలకొన్న పరిణామాలపై ప్రభుత్వం సీరియస్ అయి వైస్ చాన్స్‌లర్ వెంకటరమణను ఆరా తీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో అక్కడ రెండేళ్ల నుంచి డైరెక్టర్‌గా పనిచేస్తున్న సతీశ్ కుమార్‌ను ఉస్మానియా వర్సిటీకి బదిలీ చేయడం విశేషం. ఇక ట్రిపుల్ ఐటీలో లోపాలపై వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ చర్యలు ప్రారంభించారు. గురువారం వర్సిటీకి వచ్చిన ఆయన 'గంజాయి ఘటన'పై నివేదిక తీసుకున్నారు. శుక్రవారం దీనిపై ఆయన ఓ ప్రకటన చేయనున్నారు. అదేరోజు యూనివర్సిటీలో అన్ని విభాగాల అధికార సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి విభాగానికి నోడల్ అధికారులను నియమించనున్నారు.

గురుకుల జేఎల్ పరీక్ష ఫలితాలు విడుదల

జేఎల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించిన రామరాజు, డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో మొదటి ర్యాంకు పొందిన మాసంపల్లి హరికృష్ణ

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగ రాత పరీక్ష ఫలితాలను గురుకుల నియామక బోర్డు(ట్రిబ్) గురువారం సాయంత్రం ప్రకటించింది. పరీక్ష ఫలితాలను గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మొత్తం 1,924 జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టులకు పరీక్ష నిర్వహించగా.. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం ప్రస్తుతం 1,767 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. దివ్యాంగుల కేటగిరీలో ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉండడంతో ఆ పోస్టులను పెండింగ్‌లో ఉంచారు. కాగా టీజీటీ, డిగ్రీ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించిన ఫలితాలను వెల్లడించిన నేపథ్యంలో ఆయా పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించేందుకు ట్రిబ్ కసరత్తు చేస్తోంది.

ఫలితాల్లో నల్లగొండ యువకుల సత్తా...

నల్లగొండ టౌన్: గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన యువకులు సత్తా చాటారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మునగాల తుర్కపల్లికి చెందిన మాసంపల్లి హరికృష్ణ గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో గణిత విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు(ఓపెన్ కేటగిరిలో) సాధించారు. కొంతకాలంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న హరికృష్ణ గురుకుల పాఠశాలలో పీజీటీగా, గ్రూప్-4లో 544వ ర్యాంక్‌తోనూ మెరిశారు. అలాగే, నల్లగొండకు సమీపంలోని అక్కలాయిగూడేనికి చెందిన కన్నెబోయిన రామరాజు ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించారు. గురువారం ప్రకటించిన జేఎల్ ఫలితాల్లో కెమిస్ట్రీ విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. అలాగే బుధవారం ప్రకటించిన డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ఆరో ర్యాంకు పొందారు. గురుకుల పాఠశాలలో పీజీటీ విభాగంలో ఫిజికల్ సైన్స్‌లో రాష్ట్రస్థాయి 9వ ర్యాంకు సాధించారు. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన రామరాజు డిగ్రీ లెక్చరర్‌గా చేరతానని తెలిపాడు. రామరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రైవేటు పాఠశాలలో పని చేస్తూ, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటూ రామరాజు ఉద్యోగ పరీక్షల్లో సత్తా చాటారు. కాగా, గురుకుల నియామకాల్లో హిందీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ విభాగం ఆరోపించింది. ప్రస్తుతం గురుకులాల్లో జరుగుతున్న నియామక ప్రక్రియలో టీజీటీ పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో దక్షిణభారత్ హిందీ ప్రచార్ సభ ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవనడం సమంజసం కాదని పేర్కొంది. దీని వల్ల అభ్యర్థులు నష్టపోతున్నారని, ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని కోరింది.

'మెగా' నోటిఫికేషన్

టీచర్ పోస్టులకు.. మార్చి 4 నుంచి దరఖాస్తులు!.. ఏప్రిల్ 2వ తేదీ దాకా గడువు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మెగా డిస్సీకి నోటిఫికేషన్ వచ్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం స్వయంగా సీఎం రేవంత్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ప్రభుత్వం 5,089 ఖాళీలతో విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రేవంత్ సర్కారు రద్దు చేసి, అదనపు పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. తాజాగా విడుదలైన నోటిఫికేషన్‌లోని వివరాల ప్రకారం.. గతంలో టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవక్కర్లేదు. మునుపు దరఖాస్తు చేసుకోలేని అభ్యర్థులు మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. డీఎస్సీలో భాగంగా ఓ అభ్యర్థి ఒకటికి మించి పరీక్షలు రాయాలనుంటే అన్నింటికీ వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి దరఖాస్తుకు ఫీజు రూ.1000గా నిర్ణయించారు. టీచర్ పోస్టుల భర్తీలో 95 శాతం స్థానికతను అమలు పరచనున్నారు. ఆయా జిల్లాల్లోని పోస్టులకు రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నారు. 20 మార్కులతో టెట్ వెయిటేజీ ఉంటుంది. రాత పరీక్షను 80 మార్కులకు పెడతారు. ప్రశ్నకు అర మార్కు చొప్పున మొత్తంగా 160 ప్రశ్నలుంటాయి. మొత్తంగా 100 మార్కులకు అభ్యర్థులు మెరిట్ జాబితాను రూపొందించి.. దాని ఆధారంగా ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలోని డీఎస్సీ ఈ నియామకాలను చేపట్టనుంది. చివరదశలో ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర స్థాయిలో వెరిఫికేషన్ చేస్తారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం బీఈడీ అభ్యర్థులు



కేవలం స్కూల్ అసిస్టెంట్ పోస్టులకే అర్హులు. ఎస్జీటీ పోస్టులకు అర్హులు కారు. డీఎడ్ చేసిన అభ్యర్థులే ఎస్జీటీ పోస్టులకు పోటీపడతారు.

వయోపరిమితి ఎంత?

గత నోటిఫికేషన్‌తో పోల్చితే తాజా నోటిఫికేషన్‌లో వయోపరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ మేరకు టీచర్ పోస్టుల అభ్యర్థి వయసు 01/07/2023 నాటికి 18 ఏళ్ల నుంచి 46 ఏళ్ల మధ్య ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరీ వారికి మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, పీహెచ్‌సీలకు 10 ఏళ్ల వెసులుబాటు ఉంటుంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే యూనిట్‌గా పరీక్షను నిర్వహించనున్నారు. ఈ పరీక్షను కంప్యూటర్ బెస్ట్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్) పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 11 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకునే సమయంలోనే పరీక్ష కేంద్రాన్ని కూడా ఎంచుకోవాల్సి ఉంటుంది. మెగా డీఎస్సీని ప్రకటించినందుకు పీఆర్టీయూ నాయకులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు

టీచర్ పోస్టుల వివరాలు

పోస్టు పేపరు	ఖాళీలు
స్కూల్ అసిస్టెంట్	2,629
లాంగ్వేజ్ పండిట్	727
ఫిజికల్ ఎడ్యుకేషన్	182
ఎస్జీటీ	6,508
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	220
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	796
మొత్తం	11,062

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు

ఆదిలాబాద్	324	ములుగు	192
కొత్తగూడెం	447	నాగర్‌కర్నూలు	285
హనుమకొండ	187	నల్లగొండ	605
హైదరాబాద్	878	నారాయణపేట	279
జగిత్యాల	334	నిర్మల్	342
జనగాం	221	నిజామాబాద్	601
జయశంకర్	237	పెద్దపల్లి	93
గద్వాల	172	రాజన్న సిరిసిల్ల	151
కామారెడ్డి	506	రంగారెడ్డి	379
కరీంనగర్	245	సంగారెడ్డి	551
ఖమ్మం	575	సిద్దిపేట	311
కొమురం భీం	341	సూర్యాపేట	386
మహబుబాబాద్	381	వికారాబాద్	359
మహబూబ్‌నగర్	243	వనపర్తి	152
మంచిర్యాల	288	వరంగల్	301
మెదక్	310	యాదాద్రి	277
మెడ్చెల్	109	మొత్తం	11,062

డీఎస్సీ నోటిఫికేషన్‌తో విపక్షాలకు నిద్ర కరువు: కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులు.. కొద్దిరోజుల్లోనే రేవంత్ సర్కారు చేసి చూపెట్టిందని టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, లింగం యాదవ్ వ్యాఖ్యానించారు. 11 వేలకుపైగా టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే ప్రతిపక్షాలకు నిద్ర కూడా పట్టడం లేదన్నారు. గురువారం గాంధీభవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుంచి 2023 వరకు ఎవరేమి చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. 11,062 పోస్టులకు మెగా డీఎస్సీ వేస్తే సంతోషించాల్సింది పోయి.. దగాకోరు డీఎస్సీ అని విమర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. డీఎస్సీతో పాటు టెట్ కూడా నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారన్నారు. వారి డిమాండ్‌ను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తన చేతగానితనంతో కేసీఆర్ కృష్ణాజలాలపై హక్కులు వదులుకుని తెలంగాణకు తీరని ద్రోహం చేశారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు చేసిన ద్రోహంపై.. పాలమూరుకు చేసిన అన్యాయంపై దమ్ముంటే కేసీఆర్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. దమ్ము, ధైర్యముంటే మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి కేసీఆర్ పోటీ చేయాలని సవాల్ చేశారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు కేటీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. కేటీఆర్ సంస్కారం గూర్చి మాట్లాడుతుంటే నవ్వు వస్తోందన్నారు. 'గతంలో ఆయన తండ్రి కేసీఆర్ మాట్లాడిన మాటలను సమాజం మొత్తం చూసింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానన్నారు కేసీఆర్. సవాల్ స్వీకరించిన రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు గెలిచి అధికారం చేపట్టింది. రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరే స్థాయి నీది (కేటీఆర్) కాదు. నేను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి బరిలో దిగుతా.. నువ్వు సిరిసిల్లలో రాజీనామా చేసి రా.. మల్కాజిగిరిలోనైనా లేదా మరెక్కడైనా సరే పోటీకి దిగుదాం.. దమ్ముంటే రా.. మా తడాఖా చూపిస్తాం' అని సవాల్ విసిరారు.

నేడు లేదా రేపు బీజేపీ తొలి జాబితా?

దేశవ్యాప్తంగా వందకుపైగా అభ్యర్థుల ప్రకటన

రాష్ట్రంలో ఆరేడు స్థానాల్లో పోటీదారుల పేర్ల వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో బీజేపీ తరఫున లోక్‌సభకు పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు తుది దశకు చేరింది. దేశవ్యాప్తంగా వందకుపైగా స్థానాల్లో బరిలో నిలిచే అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను శుక్ర లేదా శనివారం ప్రకటించే అవకాశం ఉంది. అందులో తెలంగాణ నుంచి ఆరేడు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఉన్నట్టు తెలిసింది. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షాల నేతృత్వంలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం గురువారం అర్ధ రాత్రి వరకు జరిగింది. తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌లు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్‌తోపాటు రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, బండి సంజయ్.. డీకే అరుణ, ఈటల రాజేందర్, జితేందర్ రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో బీజేపీకి నాలుగు సిటింగ్ ఎంపీ స్థానాలు ఉండగా.. ఆదిలాబాద్ మినహా మిగిలిన మూడు స్థానాలకు అభ్యర్థులను తొలి జాబితాలోనే ప్రకటించనున్నట్టు సమాచారం. కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్, సికిందరాబాద్ నుంచి కిషన్‌రెడ్డి పేర్లుంటాయని తెలిసింది. అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి గురువారమే బీజేపీలో చేరిన ఎంపీ రాములు లేదా ఆయన కుమారుడిని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా మొదటి జాబితాలోనే ప్రకటించే అవకాశముంది. మల్కాజిగిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్ స్థానాలపైనా కేంద్ర ఎన్నికల కమిటీ చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది.

హాట్ టాపిక్‌గా జితేందర్ రెడ్డి ట్వీట్..

హైదరాబాద్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు జితేందర్‌రెడ్డి చేసిన ఓ ట్వీట్ బీజేపీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దుస్తులు లేకుండా ఓ చిన్న పిల్లోడు సుదీర్ఘంగా ఆలోచిస్తూ.. అటూ ఇటూ తిరుగుతున్న ఓ ఫన్నీ వీడియోను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. ఎన్నికల ముందు వాట్ టు డూ.. వాట్ నాట్ టు డూ.. అంటూ వీడియోను పోస్ట్ చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కోసం గట్టిగా పట్టుబడుతున్న జితేందర్ రెడ్డి.. ఎవరిని ఉద్దేశించి ఈ వీడియో పెట్టారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వీడియోను ఆయన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులకు ట్యాగ్ చేశారు.

మోదీ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండంలో రూ.6 వేల కోట్లతో ఎన్‌టీపీసీ నిర్మించిన 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును మార్చి 4న ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా మోదీ వర్చువల్ విధానంలో ఈ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. మార్చి 5న హైదరాబాద్‌లో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (కారో) సంస్థను ప్రధాని ప్రారంభించనున్నారు.

వర్గీకరణ కోసమే బీజేపీలో చేరా

» హామీ నెరవేరుస్తారనే నమ్మకముంది

» నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ రాములు

» బీజేపీ వైపు.. ఎంపీ బీబీ పాటిల్ చూపు..?

» 5న సంగారెడ్డిలో సభలో చేరే చాన్స్



బీజేపీలో చేరిన ఎంపీ రాములు, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

న్యూఢిల్లీ/కామారెడ్డి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసమే బీజేపీలో చేరుతున్నానని నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ పోతుగంటి రాములు తెలిపారు. దళితుల దశాబ్దాల కల అయిన ఎస్సీ వర్గీకరణ చేస్తానని ప్రధాని మోదీ హైదరాబాద్‌లో ప్రకటించారని, ఆయనపై తనకు నమ్మకం ఉందని అన్నారు. మోదీ ప్రకటనతో లక్షలాది మంది ఎస్సీలు ఎంతో సంతోషించారని, అందులో తానూ ఒకడినని చెప్పారు. గురువారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో రాములు.. ఆయన కుమారుడు, కల్వకుర్తి జడ్పీటీసీ భరత్, వనపర్తి జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌తో కలిసి కమలం గూటికి చేరారు. బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వారికి కండువా కప్పారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, అది మోదీతోనే సాధ్యమని చెప్పారు. దేశ ఖ్యాతి, వికసిత భారత్, పేదరిక నిర్మూలన కోసం అనేక మంది బీజేపీలో చేరుతున్నారని బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఇక ముగిసిన అధ్యాయమని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. రాములు చేరికతో ఉమ్మడి పాలమూరులో బీజేపీ తిరుగులేని శక్తిగా మారుతుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ బీబీపాటిల్ బీజేపీ వైపు చూస్తున్నట్లు సమాచారం. బీజేపీలో చేరేందుకు ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు, ఢిల్లీ నేతలతో పాటిల్ చర్చలు జరిపినట్లు జోరుగా చర్చ నడుస్తోంది. ఈ నెల 5న సంగారెడ్డి జిల్లాలో ప్రధాని మోదీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను కలుపుతూ ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ఈ సభలోనే బీబీపాటిల్ బీజేపీలో చేరతారని చర్చ జరుగుతోంది. జహీరాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు గెలుపొందినప్పటికీ.. ఆ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాటిల్‌కు పూర్తిస్థాయిలో గుర్తింపు ఇవ్వలేదన్న వాదన ఉంది. ఒకానొక సమయంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయనను బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు అడుగుపెట్టనివ్వలేదనే చర్చ కూడా ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇద్దరు మాత్రమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండటం వంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఎంపీగా గెలిచే అవకాశాలు ఉండవని పాటిల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జహీరాబాద్ ఎంపీ సీటు కోసం ఆయన బీజేపీ అధిష్ఠానంతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే టికెట్ విషయంలో గ్యారెంటీ ఇవ్వలేమని బీజేపీ రాష్ట్ర నేతలు ఆయనకు చెప్పారని.. ఒకవేళ చర్చలు సఫలమైతే పాటిల్ బీజేపీలో చేరతారని సమచారం. ఇప్పటికే జహీరాబాద్ బీజేపీ ఎంపీ టికెట్ కోసం ఆ పార్లమెంట్ పరిధిలో సుమారు 15 మందికిపైగా ఆశావహులు పోటీ పడుతున్నారు. జహీరాబాద్ కాకుంటే మహారాష్ట్రలో ఎక్కడో ఓ చోట పాటిల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది.

400కుపైగా సీట్లు సాధిస్తాం: గడ్కరీ

నిజామాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400కు పైగా సీట్లు సాధిస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గురువారం నిజామాబాద్‌లో నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర ముగింపు సమావేశంలో గడ్కరీ మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో ఏ ఒక్క రంగం కూడా అభివృద్ధి చెందలేదన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు హైవే రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలే తప్ప ప్రజా సంక్షేమం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు ఎగుమతులను ప్రోత్సహించడం వల్లనే ధర పెరుగుతోందని చెప్పారు. కుటుంబ పాలన తప్ప కాంగ్రెస్ దేశానికి చేసిందేమీ లేదని జాతీయ బీజేపీ కార్యవర్గ సభ్యురాలు కుష్బూ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో కుష్బూ పాల్గొన్నారు.

కమల దళంలో మల్కాజ్‌గిరి చిచ్చు!

» ఈటలకు అవకాశమిస్తే సహకరించం

» అధినాయకత్వానికి సీనియర్ల అల్టిమేటం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి టికెట్ అంశం కమల దళంలో చిచ్చు రగిల్చింది. పార్టీ జాతీయ కార్యవర్గసభ్యులు ఈటల రాజేందర్‌కు ఇక్కడ టికెట్ ఖరారైనట్లు జరుగుతున్న ప్రచారం పట్ల పలువురు సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రచారానికి అనుగుణంగా ఆయనకు టికెట్ ఇస్తే పనిచేయొద్దని అంతర్గతంగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని పార్టీ జాతీయ నాయకత్వానికి నివేదించారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం ఎవరు పనిచేస్తున్నారో వారికే అవకాశం ఇవ్వాలని, ఇప్పుడు టికెట్ అడుగుతున్నవారికి కనీసం ఐదేళ్లు పని చేసిన తర్వాతే అవకాశం ఇవ్వాలని కోరారు. "ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పోటీచేస్తామంటే ఒప్పుకొనే ప్రసక్తేలేదు.. 35 లక్షల మంది ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో బయటి నుంచి వచ్చే వ్యక్తి పోటీ చేయాల్సిన అవసరం ఉందా? మల్కాజ్‌గిరిలో కార్యకర్తల్లేరా? మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు పోటీచేయడానికి అర్హులు కాదా?" అని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అవకాశం ఇవ్వొద్దని పార్టీ జాతీయ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం స్థానికంగా పనిచేస్తున్న నాయకుల్లో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా తాము పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈటల రాజేందర్‌కే టికెట్ ఖరారైందంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, పలువురు ఆశావహులు, సీనియర్ నేతలు గురువారం రాత్రి అత్యవసరంగా సమావేశమయ్యారు. మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు హరీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, సామ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు తదితరులు కొంపెల్లిలో గురువారం రాత్రి భేటీ అయ్యారు. తమలో ఎవరికి అవకాశం ఇచ్చినా మిగతావారంతా కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈటల, కొంతమంది కార్యకర్తలు, నాయకులతో బుధవారం నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌పై సమావేశంలో చర్చించారు. మల్కాజ్‌గిరి టిక్కెట్ తనకే ఖరారైందంటూ ఈటల ఈ సమావేశం ద్వారా ప్రచారం చేసుకున్నారని వారు పేర్కొంటూ, ఇలాంటి ఘటనలను పార్టీ జాతీయ నాయకత్వం ప్రోత్సహించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన రెండు చోట్లా ఓడిపోయిన వ్యక్తికి ఇప్పుడు అవకాశం ఇస్తే ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తాం? అని ఒక నేత ఆవేదన వ్యక్తం చేశారు. ఈటల ఆత్మగౌరవం కోసం తామంతా హుజూరాబాద్ వెళ్లి ఉప ఎన్నికలో ఆయన్ను గెలిపించామని పేర్కొంటూ, ఇప్పుడు తమ ఆత్మగౌరవం ఆయన తమను గెలిపించాలని మరో నేత అభిప్రాయపడ్డారు. మరోవైపు అసలు పార్టీలో సభ్యత్వమే లేని వ్యక్తి తనకే టికెట్ ఖరారైందని మరో నేత ప్రచారం చేసుకుంటున్నా పార్టీ స్థానిక నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల మరికొందరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 1 మార్చి 2024



తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- లా కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఎంట్రెన్స్ టెస్ట్‌ల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడేళ్లు/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి టీఎస్ లాసెట్ 2024; రెండేళ్ల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి టీఎస్ పీజీఎల్‌సెట్ 2024 రాయాల్సి ఉంటుంది. వీటిని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల్లో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా లా ప్రోగ్రామ్‌లు అందించే యూనివర్సిటీలు, అనుబంధ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

టీఎస్ లాసెట్ అండ్ పీజీఎల్‌సెట్ నోటిఫికేషన్

టీఎస్ లాసెట్

అర్హత: అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్ రాయాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 45 శాతం మార్కులు తప్పనిసరి. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసినవారు, ఇంటర్ చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్‌కు కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో అంతకన్నా తక్కువ మార్కులు ఉండి 45 శాతానికి మించిన మార్కులతో పీజీ/బీఈడీ పూర్తిచేసినవారు; ప్రస్తుతం డిగ్రీ చివరి ఏడాది పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎటువంటి ప్రాథమిక విద్య లేకుండా ఓపెన్ యూనివర్సిటీల నుంచి నేరుగా ఇంటర్/డిగ్రీ/పీజీ పూర్తి చేసినవారు; ఓయూ నుంచి బీఏ ఎక్స్‌టర్నల్ గ్రాడ్యుయేట్స్; వన్ సిటింగ్ విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు.

పరీక్ష వివరాలు: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ నుంచి 30; రెండో పార్ట్‌లో కరెంట్ అఫైర్స్ నుంచి 30; మూడో పార్ట్‌లో ఆప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లా నుంచి 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 'మ్యాచింగ్' ప్రశ్నలు కూడా ఇస్తారు. అయిదేళ్ల ప్రోగ్రామ్‌నకు నిర్వహించే టెస్ట్‌లో ఇంటర్ స్థాయిలో; మూడేళ్ల ప్రోగ్రామ్‌నకు నిర్వహించే పరీక్షలో డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 42 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు లేదా ఇంగ్లీష్, ఉర్దు మాధ్యమాల్లో ఇస్తారు.

టీఎస్ పీజీఎల్‌సెట్

అర్హత: మూడేళ్లు/అయిదేళ్ల వ్యవధిగల ఎల్ఎల్‌బీ/బీఎల్ కోర్సులు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు కౌన్సెలింగ్ నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

పరీక్ష వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జ్యూరిస్ప్రుడెన్స్, కాన్‌స్టిట్యూషనల్ లా అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో పబ్లిక్&ప్రైవేట్ ఇంటర్నేషనల్ లా, బిజినెస్ అండ్ కార్పొరేట్ లా, లేబర్ లా, క్రైమ్స్ అండ్ టార్ట్స్, అలైడ్ లా విభాగాలకు సంబంధించి ఒక్కోదానిలో 16 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 30 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** లాసెట్‌కు రూ.900(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600); పీజీఎల్‌సెట్‌కు 1100 (దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 20 నుంచి 25 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 30 నుంచి
- **టీఎస్ లాసెట్ 2024, టీఎస్ పీజీఎల్‌సెట్ 2024 తేదీ:** జూన్ 3
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కరీంనగర్, సిద్దిపేట్, సత్తుపల్లి, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, నర్సంపేట్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, కర్నూలు తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** lawcet.tsche.ac.in

ఆర్ఐఎంసీలో ప్రవేశానికి ఏపీపీఎస్సీ ఆహ్వానం

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదో తరగతి(2025 జనవరి టర్మ్) ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాలనుంచి 2025 జనవరి 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జనవరి 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష వివరాలు: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200 జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **ఏపీపీఎస్సీ చిరునామా:** అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ ఆఫీస్ దగ్గర, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్, విజయవాడ- 520010, ఆంధ్రప్రదేశ్
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **పరీక్ష తేదీ:** జూన్ 1
- **పరీక్ష కేంద్రం:** విజయవాడ
- **వెబ్‌సైట్:** www.rimc.gov.in, https://psc.ap.gov.in

తెలంగాణ గిరిజన గురుకుల సైనిక పాఠశాలలో అడ్మిషన్స్

వరంగల్ జిల్లా-అశోక్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా ఆరోతరగతి, ఇంటర్(ఎంపీసీ) మొదటి సంవత్సరంలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాలురు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌ల ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం బోధన ఉంటుంది. మిలిటరీ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. ఎన్‌డీఏ, ఎస్ఎస్‌బీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. వసతి, భోజనం, బోధన ఉచితం. యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్ అందిస్తారు. వార్షిక పరీక్షలకు ఫీజు చెల్లించనవసరం లేదు.



సీట్ల వివరాలు: ఆరోతరగతిలో 80 సీట్లు, ఇంటర్(ఎంపీసీ)లో 80 సీట్లు ఉన్నాయి. ఒక్కో తరగతిలో ఎస్టీ విద్యార్థులకు 58; ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఇతరులకు ఒక్కో వర్గానికి అయిదు; గురుకులం ఎంప్లాయీ, స్పోర్ట్స్ కోటాల కింద ఒక్కో దానికి ఒక సీటు ప్రత్యేకించారు.

అర్హత: కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2,00,000; గ్రామాల్లో రూ.1,50,000 మించకూడదు. తెలుగు మీడియం విద్యార్థులు కూడా పరీక్ష రాయవచ్చు. నిర్దేశించిన మేరకు శారీరక ప్రమాణాలు(ఎత్తు, బరువు) ఉండాలి.

- ఆరోతరగతిలో చేరాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి అయిదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులు 2012 ఏప్రిల్ 1 నుంచి 2014 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.
- ఇంటర్(ఎంపీసీ) మొదటి ఏడాదిలో ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులు/ప్రస్తుతం పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు 2007 ఏప్రిల్ 1 నుంచి 2009 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం మూడు గంటలు.

- ఆరోతరగతి ఎంట్రెన్స్ టెస్ట్‌లో తెలుగు నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 30, మేథమెటిక్స్ నుంచి 30, సైన్స్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలను అయిదో తరగతి స్టేట్ సిలబస్ ప్రకారం ఇస్తారు.
- ఇంటర్(ఎంపీసీ) ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 20, కెమిస్ట్రీ నుంచి 15, బయాలజీ నుంచి 5 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలను ఎనిమిది నుంచి పదోతరగతి స్టేట్ సిలబస్ ప్రకారం ఇస్తారు.
- ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారం విద్యార్థులను 1:3 నిష్పత్తిలో స్క్రీనింగ్ చేసి ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌కు పంపుతారు.

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్: ఆరోతరగతిలో చేరే విద్యార్థులకు 6 మీటర్ల షటిల్ రన్, 100 మీటర్ల స్ప్రింట్, హారిజాంటల్ జంప్, జంప్ అండ్ టచ్, టచింగ్ టోస్ వంటి ఈవెంట్లు నిర్వహిస్తారు.

- ఇంటర్(ఎంపీసీ)లో చేరే విద్యార్థులకు 2.4 మీటర్ల రన్నింగ్, స్కిప్పింగ్, పుషప్స్ అండ్ సిటప్స్, చిన్ అప్స్, రోప్ క్లయింబింగ్ ఈవెంట్లు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 18
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 7
- **విద్యార్థుల మెరిట్ జాబితా విడుదల:** ఏప్రిల్ 24
- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు:** మే 1 నుంచి 6 వరకు
- **అశోక్‌నగర్ సైనిక పాఠశాల అడ్మిషన్ తేదీ:** జూన్ 12
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

జాబ్ కార్నర్

బెల్‌లో టెక్నీషియన్స్

పంచకుల(హరియాణా)లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

ట్రేడులు: ఎలక్ట్రానిక్ మెకానిక్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్

అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వేతనం: నెలకు రూ.21,500 నుంచి రూ.82,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.250. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మార్చి 13

వెబ్‌సైట్: https://bel-india.in

నాబార్డులో స్పెషలిస్ట్ పోస్టులు

ముంబయిలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ప్రధాన కార్యాలయం.... దేశ వ్యాప్తంగా నాబార్డ్ శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 31

1. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్
2. ప్రాజెక్ట్ మేనేజర్
3. లీడ్ ఆడిటర్
4. అడిషనల్ చీఫ్ రిస్క్ మేనేజర్
5. సీనియర్ అనలిస్ట్
6. రిస్క్ మేనేజర్
7. సైబర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ స్పెషలిస్ట్
8. డేటాబేస్ అండ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ స్పెషలిస్ట్
9. ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ బ్యాంకింగ్ స్పెషలిస్ట్
10. ఎకనామిస్ట్
11. క్రెడిట్ ఆఫీసర్
12. లీగల్ ఆఫీసర్
13. ఈటీఎల్ డెవలపర్
14. డేటా కన్సల్టెంట్
15. బిజినెస్ అనలిస్ట్
16. పవర్ బీఐ రిపోర్ట్ డెవలపర్
17. స్పెషలిస్ట్ - డేటా మేనేజ్‌మెంట్
18. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కన్సల్టెంట్ - టెక్నికల్
19. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కన్సల్టెంట్ - బ్యాంకింగ్

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.50. మిగతా వారందరికీ రూ.800.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: https://www.nabard.org/

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్స్

వాపి(గుజరాత్)లోని ఈఎస్ఐసీ హాస్పిటల్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 13

విభాగాలు: అనస్తీషియా, ఐ, మెడిసిన్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, సర్జరీ.



అర్హత: సంబంధిత విభాగంలో పీజీ లేదా పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.1,21,454

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు

ఇంటర్వ్యూ తేదీ: మార్చి 7

వెబ్‌సైట్: https://vapihospital.esic.gov.in/

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ప్రొఫెషనల్ పోస్టులు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్... వివిధ విభాగాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 27

పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అడిషనల్ సీఎంఓ, సీనియర్ మెడికల్ ఆఫీసర్.

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్ ల్యాబ్, మెటీరియల్స్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హ్యూమన్ రిసోర్స్, మెడికల్, సేఫ్టీ.

అర్హత: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), పీజీ, డిప్లొమా, సీఏ, సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 20

వెబ్‌సైట్: https://www.rfcl.co.in/

చిట్టి కథ



ఏనుగు- చిట్టి చీమలు


అడవిలో ఓ ఏనుగు ఉండేది. అది మదపుటేనుగు. ఎవరి మాటా వినేది కాదు. చెట్లును పీకేసి రోడ్డుకు అడ్డంగా వేసేది. గట్టిగా అరిచేది. ఎదురుగా వచ్చిన జంతువులను తొండంతో ఈడ్చి కొట్టేది. దీంతో ఏనుగుతో స్నేహం భయంకరమే అన్నట్లు అన్ని జంతువులు అనుకునేవి. గజరాజును నేనని గర్వం ఏనుగుకు ఉండేది.

జంతువులనే కాదు.. అడవి మనుషులను కూడా ఇబ్బంది పెట్టే ఏనుగు. దీంతో అడవి అంతా తానే అన్నట్లుండేది ఈ ఏనుగు. పండ్ల చెట్లను కూడా పీకేసేది. అడ్డూ అదుపు లేకుండా ఉండే దాని తీరు చూసి అన్నీ జడుసుకునేవి. ఈ ఏనుగు ప్రతి పది రోజులు ఓ ప్రాంతంలో ఉండే ఆ తర్వాత మరో ప్రాంతానికి వెళ్లిపోయేది. ఆ ప్రాంతాన్ని ధ్వంసం చేసిన తర్వాతనే వెళ్లిపోయేది.



ఒక రోజు ఏనుగు నిద్రపోయే చోటు చీమలపుట్ట పడింది. ఈ చీమలన్నీ నా దగ్గర ఉన్నాయేంటీ? అని ఆ ఏనుగు ఆ పుట్టను తొక్కేసింది. చిన్న చీమలు కాబట్టి ఏమీ చచ్చిపోలేదు. మూడు రోజుల్లో అదే ప్రాంతంలో మరో పుట్టను పెట్టాయి చీమలు. ఏనుగు కోప్పడింది. దగ్గరలో ఉండే నదిలోని నీళ్లను తొండంతో పీల్చుకుని వచ్చేది. ఆ నీటిని ఆ పుట్టమీద వదిలేసేది. చీమలన్నీ కొట్టుకుపోయేవి. ప్రాణాలు వదిలేవి కొన్ని. ఇలా నిత్యం నీళ్లతో చీమలను ఇబ్బందిపెట్టే స్థాయికి ఏనుగు వచ్చింది. ఏనుగు లాంటి జంతువు.. ఈ చీమలమీద ప్రతాపమేంటీ అని కొన్ని జంతువులు నవ్వుకున్నాయి. అయినా పట్టించుకోలేదు.

ఇక ఆ ప్రాంతం వదలి వెళ్లిపోకముందు ఒక రోజు ఏనుగు నిద్రపోతూ ఉంది. క్షణాల్లో చీమల గుంపు ఏనుగు తొండలోకి వెళ్లి కరవటం ప్రారంభించాయి. ఏనుగుకు దిక్కుతోచక పరుగెత్తింది. కరవటం ఆపలేదు చీమలు. నీళ్లలోకి పరిగెత్తి నీళ్లు పీల్చాలన్న ఆలోచన కూడా కలగలేదు ఆ ఏనుగుకు. అంతలా బాధపడింది. చివరికి తనతప్పు తెలుసుకుంది. చిన్న చీమలేనని గర్వంతో వీగిపోయాను. ఇవి బుద్ధి చెప్పాయని.. తెలుసుకుంది ఆ ఏనుగు.



10 తేడాలు గుర్తించండి

సరైన నీడ ఏది?





పిల్లులు ఎన్ని?

డైలీ సుడోకు - 243

	4	7					5	
	9	5	7		2	4		
				5		1		
	5		8	6				4
		4				5		
8				7	5		6	
		2		4				
		9	2		7	8	4	
	1					3	7	

సుడోకు - 242 సమాధానం

8	4	3	2	9	6	7	1	5
1	9	7	3	8	5	6	4	2
6	5	2	4	1	7	3	8	9
9	1	5	6	7	3	8	2	4
4	3	8	5	2	9	1	7	6
2	7	6	8	4	1	5	9	3
3	8	4	1	5	2	9	6	7
5	2	9	7	6	8	4	3	1
7	6	1	9	3	4	2	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.